www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
ప్రజల గొంతుక... దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 15 సంచిక : 129 మంగళవారం, ఫిబ్రవరి 03, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

## మోదీ నాకు గొప్ప స్నేహితుడు..
## భారత్‌పై ప్రతీకార టారీఫ్‌లు తగ్గిస్తున్నా..!



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 02 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన దూకుడు తగ్గించి భారత్ పట్ల స్నేహహస్తం చాటుతున్నారు. ఈమధ్యే యూరోపియన్ యూనియన్, భారత్ మధ్య స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం కుదరడంతో కంగుతిన్న ట్రంప్.. వెనక్కి తగ్గారు. సోమవారం ప్రధాని నరేంద్ర మిగతా2లో...

## భారత్ సరిహద్దుల్లోకి
## చైనా చొరబాట్లు

**ఆర్మీ మాజీ చీఫ్ నరవణెళె పుస్తకంలో వెల్లడి**

**సభలో మాట్ అలాడకుండా అడ్డుకున్నారు: రాహుల్**


2లో

## బుల్లెట్ ట్రైన్ హబ్‌గా
## హైదరాబాద్

**బుల్లెట్ ట్రైన్ల కేటాయిపులపై మంత్రి అశ్వినీ వైష్ణవ్**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 02 :** బుల్లెట్ ట్రైన్‌కు హైదరాబాద్ మహా నగరం హబ్‌గా మారుతుందని రైల్వే, ఐటీ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు.బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన రైల్వే ప్రాజెక్టులతోపాటు నిధుల కేటాయింపులను వివరించారు. సోమవారం న్యూఢిల్లీలో మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకర్లతో మాట్లాడుతూ.. తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులకు రూ.5,454 కోట్ల నిధులు మిగతా2లో...

## అడ్డంగా సంపాదించి..అధికార దుర్వినియోగం చేసి
# వేలకోట్లు కూడాబెడితే ప్రశ్నించవద్దా...?

**వేలకోట్లు కూడాబెడితే ప్రశ్నించవద్దా...?**

**బిఆర్ఎస్ నేతల తీరుపై మండిపడ్డ సిఎం రేవంత్**

**రావినారాయణరెడ్డి లాంటి నేతలు అరుదని కితాబు**



**హైదరాబాద్,ఫిబ్రవరి 02 :** తెలంగాణలో పదవులన్నీ కేసీఆర్ కుటుంబం అనుభవించి, అక్రమంగా సంపాదించిందని సిఎం రేంవత్ రెడ్డి అన్నారు. వందల ఎకరాల ఫామ్‌హౌస్‌లు, వేల కోట్ల వ్యాపారాలు మీకెలా వచ్చాయి..? బీఆర్ఎస్ నేతలు చేయాల్సిన తప్పులన్నీ చేశారు. నేరాలు చేస్తాం.. ప్రశ్నించవద్దని మీరెలా అంటారు? అక్రమ మార్గాలు ఎంచుకున్నప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా విచారణ తప్పదని సీఎం స్పష్టం చేశారు. రావినారాయణ రెడ్డి స్మారక కార్యక్రమంలో సిఎం మాట్లాడారు. రావి నారాయణరెడ్డి స్ఫూర్తితో తాము పనిచేస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అమరవీరుల స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రావి నారాయణరెడ్డి పురస్కారాన్ని జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి సీఎం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. నిజాం పాలకులకు వ్యతిరేకంగా రావి నారాయణరెడ్డి పోరాటం చేశారు. నాడు ప్రజల కష్టాలు, రాచరిక పోకడలు, అరాచక చర్యలపై పోరాడారు. 500 ఎకరాల భూమిని మిగతా2లో...



## తిరుమల లడ్డూపై
## ఎందుకు మాట్లాడరు

**- వైకాపా ట్రాప్‌లో పడకండి**

**- పార్టీ శ్రేణులకు జనసేనాని హితవు**

**మంగళగిరి,ఫిబ్రవరి 02 :** జనసేన పార్టీ జనరల్ బాడీ సమావేశం వేదికగా పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పార్టీ నేతలపై అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా తిరుమల లడ్డూ వ్యవహారం గురించి వైసీపీ చేస్తున్న విమర్శల ధాటిని తిప్పికొట్టడంలో నేతలు విఫలమవుతున్నారని ఆయన అన్నారు. మంగళగిరిలోని పార్టీ మిగతా2లో...

## కులం కాదు..
## గుణం చూసి ఓటేయండి

**- మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం**

**- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**




**హైదరాబాద్,ఫిబ్రవరి 02 :** మున్సిపల్ ఎన్నికల్లో కులం కాదని.. గుణం చూసి ఓటేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. పైసలు కాదని.. పని చేసేవారికి ఓటు వేయాలని సూచించారు. మంచి అభ్యర్థులు ఏ పార్టీ నుంచి పోటీ చేసినా ఓటు వేయాలని కోరారు. తెలంగాణ జాగృతి మిగతా2లో...

## గ్యారెంటీల పేరుతో
## ఓట్లు దండుకున్న కాంగ్రెస్

**బూటకపు హామీలు - మోసపూరిత వాగ్దానాలు**

**ఛార్జ్‌షీట్ విడుదల చేసిన బిజెపి చీఫ్ రామచంద్రరావు**



**హైదరాబాద్,ఫిబ్రవరి 02 :** గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ఓట్లు దండుకున్నదే కానీ ప్రజలకు చేసిందేమీ లేదని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు విమర్శించారు. ఈ మేరకు రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై రాంచందర్ రావు నిప్పులు చెరిగారు. సోమవారం హైదరాబాద్‌లోని హోటల్ పీపుల్స్ ప్లాజాలో 'బూటకపు హామీలు - మోసపూరిత వాగ్దానాలు' అంటూ కాంగ్రెస్ అరాచక, అవినీతి పాలనపై తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు ఛార్జ్‌షీట్ విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ బూటకపు హామీలు, మోసపూరిత వాగ్దానాలు, సేవ్ తెలంగాణ, ఓట్ బీజేపీ థీమ్‌తో ఈ ఛార్జ్ షీట్‌ను విడుదల చేశామన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వలేని పరిస్థితుల్లో రేవంత్ ప్రభుత్వం ఉండటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఉస్మానియా యూనివర్సిటీకి రూ.1000 కోట్లు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని.. కానీ నేటికి ఒక్క పైసా మిగతా2లో...

## సర్పంచ్ ఎన్నిక కోసం....
## కన్నకూతురు బలి

**ముగ్గురు సంతానం నిబంధనతో ఒకరిని చంపేసిన తండ్రి**

**బాలిక హత్యను ఛేదించిన నిజామాబాద్ పోలీసులు**


2లో

# సిట్ చీఫ్ సజ్జనార్ వ్యాఖ్యలు సరికాదు

- **చట్టవిరుద్ధ ఫోన్ ట్యాపింగ్ అని ఎలా ప్రకటిస్తారు**
- **ఇది పోలీస్ మాన్యువల్‌కు వ్యతిరేకం అని తెలియదా..?**
- **కెసిఆర్ విచారణ తరవాత ఘటనపై హరీష్ రావు అభ్యంతరం**



**హైదరాబాద్,ఫిబ్రవరి 02 :** చట్టవిరుద్ధ ఫోన్ ట్యాపింగ్ కేసులో కెసిఆర్ విచారణ ముగిసిందని నగర పోలీస్ కమిషనర్, సిట్ ఇన్‌ఛార్జ్ సజ్జనార్ చేసిన ప్రకటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు సీరియస్ అయ్యారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం విచారణలోనే ఉన్నప్పుడే ఇల్లీగల్ అని ఎలా తేల్చేశారని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ ఇల్లీగల్ అవునా కాదా అనేది ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం నిర్ణయాంచాల్సి ఉంటుందని తెలిపారు. ఈ వ్యాఖ్యలను కోర్టు ధిక్కరణ కింద పరిగణించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై విచారణ కొనసాగుతున్న దశలోనే దీనిని అక్రమంగా పేర్కొనడం చట్ట విరుద్ధమని హరీశ్‌రావు తెలిపారు. కానీ ఈ తరహా వ్యాఖ్యలు సిట్ చీఫ్ సజ్జనార్ చేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తుందని విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వా మ్యంలో న్యాయస్థానం తుది తీర్పు ఇచ్చే వరకు ఏ ఆరోపణను కూడా నేరంగా పరిగణించ కూడదన్నది స్థిరమైన న్యాయసూత్ర మని ఆయన స్పష్టం చేశారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లో భాగమైన డాక్టరిన్ ఆఫ్ ప్రిజంప్షన్ ఆఫ్ ఇన్నొసెన్స్ చెబుతుందని తెలిపారు. దర్యాప్తు చేయడమే పోలీసుల బాధ్యత తప్ప.. తీర్పు చెప్పే అధికారం వారికి లేదని వ్యాఖ్యానించారు..ఫోన్ ట్యాపింగ్ చట్టబద్ధమా? కాదా అన్నది భారత టెలిగ్రాఫ్ చట్టంలోని సెక్షన్ 5(2), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ అలాగే పీయూసీఎల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు నిర్దేశించిన మార్గదర్శకాలకు మిగతా2లో...

## ఫోన్ ట్యాపింగ్ దుశ్చర్యలు
## బయటపడాల్సిందే...

**- దోషులు ఎవరో తేల్చాల్సి ఉంది**

**- ఎవరిపైనా కక్షసాధింపు చర్యలు లేవు**

**- మంత్రి శ్రీధర్ బాబు స్పష్టీకరణ**



**హైదరాబాద్,ఫిబ్రవరి 02 :** ఫోన్ ట్యాపింగ్ కేసుపై ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మిగతా2లో...

## మేడారం జాతర విజయవంతం

**ఊహించిన దానికన్నా పెరిగిన భక్తుల రాక:మంత్రి సీతక్క వెల్లడి**



**ములుగు,ఫిబ్రవరి 02 :** మేడారం సమక్క - సారక్క అమ్మవార్ల మహా జాతర విజయ వంతం అయిందని తెలంగాణ పంచాయ తీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క) పేర్కొన్నారు. జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. భక్తులకు చిన్న చిన్న అసౌకర్యాలు కలిగినందుకు చింతిస్తున్నామన్నారు. వీవీఐపీల తాకిడి వల్లే ట్రాఫిక్ జామ్ అయిందని చెప్పుకొచ్చారు. సమ్మక్క - సారలమ్మ అమ్మవార్లతో తమకు భావోద్వేగ బంధం ఉందని మంత్రి సీతక్క మిగతా2లో...

# గ్యారెంటీల పేరుతో ఓట్లు దండుకున్న కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. ఆరోగ్య శ్రీ పథకం కింద వేల కోట్ల రూపాయిల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో విద్య, వైద్యం పూర్తిగా కుంటుపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కటీ సంపూర్తిగా అమలు కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందుతున్నాయని.. తద్వారా లక్షలాది మంది లబ్ది పొందుతున్నారని వివరించారు. షో పుటప్ తప్పు.. రాష్ట్రంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు లేదంటూ రేవంత్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఓట్ల కలెక్షన్ల కోసమే ఇందిరమ్మ ఇళ్లు అంటూ ఎద్దేవా చేశారు. మున్సిపాలిటీలకు చేసిందేమిటో చెప్పాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా ఆయన నిలదీశారు. 7 మున్సిపల్ కార్పొరేషన్లలో టాక్సీల పేరు మీద భారీ కుంభకోణం జరుగుతోందని విమర్శించారు. దీనిలో రూ. 250 కోట్లకుపైగా కుంభకోణం జరిగిందని వివరించారు. మున్సిపాలిటీలకు వచ్చే నిధుల్లో ప్రతి పైసా కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్నవేనని గుర్తు చేశారు. రాష్ట్రంలో రహదారులన్నీ అధ్వానంగా మారాయని.. నిత్యం రోడ్డు ప్రమాదాల వల్ల అనేక మంది మరణిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో క్రైమ్ విపరీతంగా పెరిగిపోయిందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. లా అండ్ ఆర్డర్ పూర్తిగా విఫలం అయిందన్నారు. డ్రగ్స్‌కు కేంద్రంగా తెలంగాణ మారిపోయిందంటూ మండిపడ్డారు. హిందూ దేవాలయాలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. చివరకు దేవాలయాల భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మారుతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. కమిషన్, కాంట్రాక్ట్, కరప్షన్ ప్రభుత్వమని అభివర్ణించారు. ఇది 40 పర్సెంట్ కమిషన్ ప్రభుత్వమని వ్యంగ్యంగా అన్నారు. తమ ఫోన్లు ట్యాపింగ్ చేసి.. తమపైనే కేసులు పెట్టారని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ చేయవలసిన అవసరం ఎందుకొచ్చిందంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. తొలుత బీజేపీ నేతల ఫోన్లనే ట్యాపింగ్ చేశారని గుర్తు చేశారు. సేవ్ తెలంగాణ.. ఓట్ బీజేపీ నినాదంతో ప్రజల్లోకి వెళ్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ప్రజలు ఆలోచించాలని, గతంలో రెండు పార్టీలకు అవకాశం ఇచ్చారని.. ఒకసారి బీజేపీకి కూడా అవకాశం ఇవ్వండంటూ టీ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు విజ్ఞప్తి చేశారు.

# సర్పంచ్ ఎన్నిక కోసం... కన్నకూతురు బలి

**ముగ్గురు సంతానం నిబంధనతో ఒకరిని చంపేసిన తండ్రి**

**బాలిక హత్యను ఛేదించిన నిజామాబాద్ పోలీసులు**

**నిజామాబాద్,ఫిబ్రవరి 02 :** పంచాయితీ ఎన్నికల కోసం ఓ తండ్రి కన్నకూతురునే బలితీసుకున్నాడు. కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కన్న తండ్రి తన స్వార్థం కోసం అభం శుభం తెలియని ఆరేళ్ల కూతురిని హత్య చేసిన సంఘటన కలకలం రేపుతోంది. ఈ సంఘటన నిజామాబాద్‌లో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్ జిల్లా ముఖేడ్ తాలూకా కేరూర్‌కు చెందిన పాండురంగ, త్వరలో జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి సన్నాహాలు చేసుకుంటు న్నాడు. అయితే, ముగ్గురు పిల్లలు ఉంటే పోటీకి అనర్హత ఉందని పాండురంగ దారుణమైన నిర్ణయం తీసుకున్నాడు. తన ఆరేళ్ల పెద్ద కూతురు ప్రాచీని బైక్‌పై తీసుకొచ్చి నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం ఎఆర్‌పి శివారులో కాలువలో పడేసి చంపేశాడు. కెనాల్‌లో మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పాప మృతదేహాన్ని బయటకు తీసి.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో కన్న తండ్రే హంతకుడని తేలింది. పాండురంగ్‌తో పాటు అతనికి సహకరించిన గణెళిష్ షిండేను అరెస్ట్ చేశారు. బాలికను తీసుకువచ్చేందుకు ఉపయోగించిన బైక్, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు నిజామాబాద్ సీపీ సాయి చైతన్య తెలిపారు. ఈ కేసులో మృతురాలు తండ్రి పాండురంగతో పాటు కేరూరు సర్పంచ్ గణెళిష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.



# తిరుమల లడ్డూపై ఎందుకు మాట్లాడరు

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయంలో జరిగిన ఈ కీలక సమావేశంలో పవన్ కళ్యాణ్.. పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, పీఏసీ సభ్యుల తీరుపై ఘాటుగా స్పందించారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై ఇంత జరుగుతున్నా ఒక్కరూ ఎందుకు మాట్లాడటం లేదన్నారు. అన్నింటికీ నేనే సమాధానం చెప్పాలా అన్నారు. అలాంటప్పుడు మీరు ఎమ్మెల్యే లుగా, మంత్రులుగా ఎందుకు ఉన్నట్టు అని పవన్ ప్రశ్నించారు. వైసీపీ నేతలు వ్యక్తిగత దూషణలకు దిగుతారని, అప్రమత్తంగా ఉండి వారి కుతంత్రాలను తిప్పికొట్టాలని సూచించారు. నేతల వ్యక్తిగత వ్యవహారాల వల్ల పార్టీకి నష్టం కలగకూడదని, సిద్ధాంత పరంగా, సబ్జెక్ట్ పరంగా మాత్రమే మాట్లాడాలని స్పష్టం చేశారు. సమావేశం అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్ మీడియాతో మాట్లాడుతూ పార్టీ భవిష్యత్ కార్యాచరణను వివరించారు. తిరుమల లడ్డూ అపవిత్రత, కేంద్ర బడ్జెట్ అంశాలపై సుదీర్ఘంగా చర్చించి తీర్మానాలు చేశామని వెల్లడించారు. జగన్ హయాంలో శ్రీవారి సొమ్ము రూ. 233 కోట్లు కొల్లగొట్టారని ఆరోపించారు.

మార్చి 14 నపార్టీ ఆవిర్భావ దినోత్సవం లోపు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. 32 మందితో క్రమశిక్షణ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు, అలాగే పొలిటికల్ కమిటీని పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. పార్టీ నేత, ఎమ్మెల్యేఆరవ వివాదంపై చర్చించామని, కమిటీ రిపోర్ట్ ఆధారంగా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

# సిట్ చీఫ్ సజ్జన్నార్ వ్యాఖ్యలు సరికాదు

(మొదటి పేజీ తరువాయి)

అనుగుణంగా ఉందో లేదో న్యాయస్థానమే నిర్ణయించాల్సి ఉంటుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కానీ కేసీఆర్ సిట్ విచారణ పూర్తయ్యిందని చేసిన అధికారిక ప్రకటనలోనే అక్రమమం అని తేల్చడం సరికాదని అన్నారు. సిట్ చీఫ్ సజ్జనార్ వ్యాఖ్యలు దర్యాప్తు ఫలితంపై ముందస్తు అభిప్రాయంతో ఉన్నట్లు కనిపిస్తున్నాయని హరీశ్‌రావు తెలిపారు. ఇది ఆలిండియా సర్వీసెస్ (కండక్ట్) రూల్స్ 1968కు విరుద్ధమని అన్నారు. మాజీ సీఎం, ప్రతిపక్ష నాయకుడికి సంబంధించి రాజకీయంగా సున్నితమైన అంశంలో ఇలాంటి వ్యాఖ్యలు రావడం ద్వారా దర్యాప్తులో నిష్పక్షపాతత్వంపై అనుమానాలను కలిగిస్తున్నాయని తెలిపారు. విచారణకు ముందే తప్పు జరిగిందనే భావన కలిగించేలా చేసిన ప్రకటనలు ప్రజలకు న్యాయవ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని అన్నారు. పోలీస్ కమ్యూనికేషన్లను రాజకీయ కథనాలను బలపరిచేందుకు ఉపయోగించ రాదని స్పష్టం చేశారు. దర్యాప్తు సంస్థలు స్వతంత్రంగా, వృత్తిపరంగా చట్ట పరిధిలోకి లోబడే పనిచేయాలని హరీశ్‌రావు సూచించారు. పోలీసుల ప్రకటనల ద్వారా కాకుండా తీర్పులను కోర్టులు ఇవ్వాలని అన్నారు. రాజ్యాంగ పరిమితులను దర్యాప్తు సంస్థలు విస్మరిస్తే ప్రజాస్వామ్యం నిలవదని హెచ్చరించారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్‌ను సిట్ చీఫ్ ఎందుకు గుర్తించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో హరీష్‌రావు ఒక పోస్టు పెట్టారు. పోలీసులకు దర్యాప్తు బాధ్యత మాత్రమే అప్పగించబడిందని, విచారణ దశలో ఏదైనా చర్యను చట్టవిరుద్ధమని ప్రకటించడానికి పోలీసులు న్యాయమూర్తులో లేదా న్యాయనిర్ణేతలో కాదని పేర్కొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ దుశ్చర్యలు బయటపడాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. చట్టం తన పని తాను చేస్తుందని స్పష్టం చేశారు. భార్యాభర్తల సంభాషణలు వినే దుశ్చర్యకు పాల్పడితే విచారణ జరపాలా వద్దా అని ప్రశ్నించారు. తప్పుచేసి మాపైనే అభియోగాలు మోపుతున్నారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డికి ఎవరి మీదా కక్ష సాధింపు ఆలోచన లేదని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రాష్ట్రానికి చెడ్డపేరు తెచ్చిందన్నారు. సాధారణంగా ఉగ్రవాదులు, ఆటంకవాదుల ఫోన్లను ట్యాప్ చేస్తారని.. కానీ ఇక్కడ నాయకులు, జడ్జిలు, వ్యాపారవేత్తల ఫోన్లనే ట్యాప్ చేశారని చెప్పారు. ఆధారాలు లభించిన నేపథ్యంలో విచారణ జరుగుతోందని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ ఎవరు చేశారు? ఎందుకు చేశారో.? తేల్చాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. బీజేపీ నేతలు బండి సంజయ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ధర్మపురి అర్వింద్ ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ చేయాలని డిమాండ్ చేశారని ప్రస్తావించారు. వారి కుటుంబ సభ్యులు ఫోన్ ట్యాపింగ్ జరిగిందని బీజేపీ నేతలు చెబుతున్నారన్నారు. ఈ నీచానికి ఎవరు ఒడిగట్టారో విచారణ జరిపిస్తున్నామని తెలిపారు. దుశ్చర్యకు పాల్పడ్డవారికి శిక్ష తప్పదని హెచ్చరించారు.

# కెసిఆర్‌కు మద్దతుగా బిఆర్ఎస్ ఆందోళనలు

**• కార్యకర్తలకు కెటిఆర్ కృతజ్ఞతలు**



**హైదరాబాద్,ఫిబ్రవరి 02 :** ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్య మంత్రి కేసీఆర్‌ను సిట్ విచారణకు పిలువడాన్ని నిరసిస్తూ ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. గ్రామగ్రామాన బీఆర్ఎస్ శ్రేణులు తమ అధినేతకు మద్దతుగా కదం తొక్కారు. కార్యకర్తలు ఎక్కడికక్కడ సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ నేపథ్యంలో గ్రామగ్రామాన గర్జించిన కార్యకర్తలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కృతజ్ఞతలు తెలియజేశారు. 'నిన్న ఉదయం నుంచే గ్రామగ్రామాన గర్జించిన మా కార్యకర్తలకు, సోషల్ మీడియాలో మద్దతుగా నిలిచిన వారియర్‌లకు, ప్రతి పట్టణంలో కదంతొక్కి మోటర్ సైకిల్ ర్యాలీలు, రాస్తారోకోలు, ధర్నాలు, నిరసనలతో హోరెత్తించి ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేలా గొప్పగా పోరాడిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని కేటీఆర్ తన ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు.

# మోదీ నాకు గొప్ప స్నేహితుడు.. భారత్‌పై ప్రతీకార టారీఫ్‌లు తగ్గిస్తున్నా..!

(మొదటి పేజీ తరువాయి)

మోడీతో మాట్లాడినట్టు పేర్కొన్న అమెరికా అధినేత మోడీ తనకు గొప్ప స్నేహితుడని అన్నారు. అంతేకాదు ఇండియాపై ప్రతీకార టారీఫ్‌లను 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నాని వెల్లడించారు. గత కొన్నిరోజులుగా భారత్‌పై పగబట్టినట్టు ప్రవర్తించిన డొనాల్డ్ ట్రంప్ దారికొచ్చారు. అమెరికాను కాదని రష్యా, యూరోపియన్ యూనియన్‌తో ద్వైపాక్షిక సంబంధాలు, ఆర్థిక కార్యకలాపాలపై దృష్టి సారించిన ఇండియాను వదులుకోవద్దని భావించిన ఆయన మనసు మార్చుకున్నారు.

# భారత్ సరిహద్దుల్లోకి చైనా చొరబాట్లు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 02 :**భారత సరిహద్దుల్లోకి చైనా సైన్యం చొరబడుతోందనే మాటలు తాను చెప్పినవి కావని, స్వయంగా ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవణెళి తన పుస్తకంలో రాసినవేనని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ తెలిపారు. వాస్తవాలు బయటకు రాకూడనే ఉద్దేశంతోనే ఆ పుస్తక ప్రచురణను కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. జాతీయ భద్రతకు సంబంధించిన విషయాలు చెబుతాననే భయంతోనే లోక్‌సభలో తన ప్రసంగం మొదట్లోనే అడ్డుకున్నారని చెప్పారు. లోక్‌సభ వాయిదా పడిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, మాజీ ఆర్మీ చీఫ్ పుస్తకం బయటకు వస్తే మన సైన్యాన్ని ప్రభుత్వ నేతలు ఎలా నిరాశపరుస్తున్నరనేది ప్రజలు తెలుసుకుంటారని చెప్పారు.మాజీ ఆర్మీ చీఫ్ తన దృష్టికోణాన్ని ఎందుకు చెప్పకూడదు? ఆయన ఏమి చెప్పి ఉంటారని ప్రభుత్వం భయపడుతోంది? అని రాహుల్ ప్రశ్నించారు. 'ప్రధాన మంత్రి గురించి, రాజ్‌నాథ్ సింగ్ గురించి పుస్తకంలో స్పష్టంగా రాశారని నేను చెప్పదలచుకున్నాను. ఒక ఆర్టికల్‌లో కూడా ఈ విషయం వచ్చింది. నేను ఆ ఆర్టికల్‌ను ప్రస్తా వించాను. దాంతో నన్ను మాట్లాడకుండా అడ్డుకున్నారు. అసలు విషయాలు బయటకు వస్తాయనే భయమే అందుకు కారణం. మాజీ ఆర్మీ చీఫ్ తన పుస్తకంలో ఏమి రాశారో, ఆయనకు రాజ్‌నాథ్ సింగ్, ప్రధాని మోదీ ఏ ఆదేశాలు ఇచ్చారో, వారి మధ్య జరిగిన సంభాషణలు ఏమిటో సభలో చెప్పాలనుకున్నాను. కానీ రెండు,మూడు లైన్లు మాట్లాడగానే నన్ను ప్రసంగించకుండా అడ్డుకున్నారు' అని రాహుల్ తెలిపారు.

# బుల్లెట్ ట్రైన్ హబ్‌గా హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

కేటాయించామని తెలిపారు. అలాగే మూడు బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులు ఇచ్చామని చెప్పారు. అవి.. హైదరాబాద్ – బెంగళూరు (రెండున్నర గంటల ప్రయాణం..) , హైదరాబాద్ – చెన్నై (2:55 గంటల ప్రయాణం..), హైదరాబాద్ – పుణె (1:45 గంటల ప్రయాణం..) అంటూ సోదాహరణగా వివరించారు. కేంద్ర బ్జడెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంట్‌కు సమర్పించారు. ఈ బడ్జెట్‌లో కేటాయింపును ఆయన వివరించారు. బుల్లెట్ ట్రైన్ కారిడార్‌లు అన్నీ ఎలివేటెడ్ కారిడార్‌గా నిర్మిస్తామన్నారు. అందుకు సంబంధించిన పనులను త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఇది సౌత్ ఇండియా డైమండ్ హై స్పీడ్ రైల్వే ప్రాజెక్ట్ అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కంటే అధికంగా తెలంగాణ రాష్ట్రానికి రైల్వే ప్రాజెక్టులకు నిధులు కేటాయించామని ఈ సందర్భంగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. అయినా 2026–27 బడ్జెట్‌లో కేంద్రం మొండి చేయి చూపిందంటూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీలోని పలువురు అగ్రనేతలు ఆరోపిస్తున్నారు. అలాంటి వేళ రైల్వే శాఖ ద్వారా తెలంగాణకు జరిగిన బ్జడెట్ కేటాయింపులను ఆ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సోదాహరణగా వివరించారు.

# మేడారం జాతర విజయవంతం

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తావించారు. అందుకే అన్ని జాగ్రత్తలు చేపట్టామని వివరించారు. జాతరకు వెళ్తే ఏదో జరుగుతుందని ఓ వర్గం ప్రచారం చేసిందని తెలిపారు. జాతరను తక్కువచేసి చూపాలన్న కుటిల ప్రయత్నం చేశారని ధ్వజమెత్తారు. అయినప్పటికీ జాతరకు జనం తండోపతండాలుగా తరలివచ్చారని చెప్పుకొచ్చారు. మహాజాతర అనంతరం తాను పారిపోయినట్లు కొందరు తప్పుడు ప్రచారం చేశారని ్గ÷ర్ అయ్యారు. తాను పారిపోయేరకం కాదని.. ప్రజల కోసం పంతం నెగ్గించుకునే వ్యక్తినని స్పష్టం చేశారామె. ఆదివాసీల అస్తిత్వం కోసం పరితపించే బిడ్డనని చెప్పారు.

## అడ్డంగా సంపాదించి..అధికార దుర్వినియోగం చేసి వేలకోట్లు కూడాబెడితే ప్రశ్నించవద్దా...?

(మొదటి పేజీ తరువాయి)

పేదలకు పంచి ఆదర్శంగా నిలిచారు. స్వేచ్ఛను హరించి, హక్కులకు భంగం కలిగిస్తే తిరుగుబాటు వస్తుంది. ప్రజల తిరుగుబాటు సాయుధ పోరాటంగా మారుతుందని ఆయన చాటి చెప్పారు. 60 ఏళ్లు వచ్చేసరికి రాజకీయ పదవీ విరమణ చేసిన గొప్ప నాయకుడు రావి నారాయణరెడ్డి. ప్రజల నుంచి తిరస్కారం పొందినా.. నేటి నేతలకు పదవీ వ్యామోహం పోవడం లేదు. రావి నారాయణ రెడ్డి నేషనల్ అవార్డు పొందడం ఎంతో గొప్పదిగా భావిస్తానని అవార్డు గ్రహీత జస్టిస్ సుదర్శన్ రెడ్డి అన్నారు. రావి నారాయణ రెడ్డి నిత్య చైతన్య స్ఫూర్తి అని కొనియాడారు. సొంత ఆస్తులను ప్రజలకు పంచిన మహానుభావుడని ప్రశంసించారు.

# కులం కాదు..గుణం చూసి ఓటేయండి

(మొదటి పేజీ తరువాయి)

తరఫున మంచి అభ్యర్థులు ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై పోటీ చేస్తున్నారని కవిత పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో సోమవారం మీడియాతో కవిత మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్ టార్గెట్‌గా విమర్శలు చేశారు. మునిసిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఎవరు నిలబడ్డ కారు గుర్తుపై ఓటు వేయాలని కేటీఆర్ చెబుతున్నారని ప్రస్తావించారు. చెడ్డ వాళ్లకి ఓటు వేయాలని కేటీఆర్ చెబుతున్నారా అని ప్రశ్నించారు. కేటీఆర్ మాటలు నియంతృత్వం, రాచరికపు పోకడలకు నిదర్శనమని విమర్శించారు. రేవంత్‌రెడ్డితో హరీశ్‌రావు కుమ్మక్కు అయి.. నాటకాలాడుతున్నారని కవిత విమర్శలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో ఫెయిర్‌గా విచారణ జరగాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌పై కేసీఆర్‌ని సిట్ విచారణకు పిలిచిందని ప్రస్తావించారు. ఈ కేసులో సిట్ విచారణకు పిలిస్తే ఎవరైనా పోక తప్పదని కవిత స్పష్టం చేశారు. కేందప్రభుత్వం ప్రవేశపెట్టిన బ్జడెట్‌లో తెలంగాణకు మోదీ సర్కార్ అన్యాయం చేసిందని కవిత విమర్శలు చేశారు. హైదరాబాద్‌లో వరుసగా అగ్నిప్రమాదాలు జరుగుతున్న ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రశ్నించారు. గంజాయి ముఠా దాడులకు పాల్పడుతున్న కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి హార్వర్డ్ యూనివర్సిటీ ఫీజు సొంతంగా కట్టుకున్నారా..? ప్రభుత్వ సొమ్ముతో కట్టారా అని ప్రశ్నించారు.రేవంత్‌రెడ్డి ఈ విషయంపై ప్రజలకు సమాధానం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ వెళ్లి ఎన్ని ఏంఓయూలు చేసుకున్నారని నిలదీశారు. ఫేక్ కంపెనీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఓయూలు చేసుకుందని ఆక్షేపించారు. కాంగ్రెస్ ఫేక్ ఎంఓయూలపై యువత దృష్టి పెట్టాలని సూచించారు. ఫేక్ ఏంఓయూలపై జాగృతి పోరాటం చేస్తుందని కవిత పేర్కొన్నారు.

# కోట గుళ్ళు శివరాత్రి మహోత్సవాలకు అంకురార్పణ

### ఆలయ పోషకులకు కళ్యాణ పత్రిక అందజేత





**ములుగు జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 02( పీపుల్స్ న్యూస్)** ప్రసిద్ధి గాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళా క్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరా లయం కోటగుళ్లలో ఈనెల 15 ఆదివారం నుండి, 17 మంగళవారం , వరకు మూడు రోజులపాటు నిర్వహించే శివరాత్రి మహోత్సవాలకు అంకురార్పణ జరిగింది. సోమవారం ఆలయ పోషకులు లలిత నర్సింగ్ హోమ్ నిర్వాహకులు డాక్టర్ రాజేశ్వరప్రసాద్ లలిత దేవి దంపతులు, డాక్టర్ కోడూరు నవీన్ కుమార్ సుమతి దంపతులకు కళ్యాణ పత్రికను కోట గుళ్ళు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో అలయ అర్చకులు బూరుగుపల్లి మఠం గంగాధర్, జూలపల్లి నాగరాజు లు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పోషకులకు ఆశీర్వచనాలు అందజేశారు.

# కనకదుర్గ లయన్స్ క్లబ్ కు అవార్డుల పంట





**ములుగు జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 02 (పీపుల్స్ న్యూస్)** లయన్స్ ఇంటర్నేషనల్ 320 ఎఫ్ రెండవ రీజనల్ ప్రాంతీయ మహాసభ నిత్య బంకెట్ హాల్లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రొసీడింగ్ ఆఫీసర్ గా రీజినన్ చైర్ పర్సన్ లయన్ డాక్టర్ ఎం. పద్మజా దేవి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా మధ్యప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి పాల్గొని మాట్లాడారు. 320ఎఫ్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య ప్రారంభించారు. రీజనల్ మీట్ కార్యక్రమంలో మూడు జోన్లలోని 10 క్లబ్ ల అధ్యక్ష కార్యదర్శులు కోశాధికారులతోపాటు సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కలర్ ఫుల్ గా బ్యానర్ ప్రజెంటేషన్ ద్వారా వారి యొక్క సేవా కార్యక్రమాలను వివరించారు. రీజినల్ మీట్ లో కనకదుర్గ లయన్స్ క్లబ్ కు బెస్ట్ అధ్యక్షుడు, బెస్ట్ కార్యదర్శి బెస్ట్ కోశాధికారి తోపాటు కనకదుర్గ లయన్స్ క్లబ్ చేసిన కార్యక్రమంలో మరెన్నో అవార్డులు వరించాయి, పద్మాక్షి రీజియన్ మీట్ లో జోన్ 2 లోని కనకదుర్గ లయన్స్ క్లబ్ కు బెస్ట్ క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్, బెస్ట్ ఎన్విరాన్మెంటల్ ప్రోగ్రామ్స్, బెస్ట్ చైల్డ్ క్యాన్సర్ ప్రోగ్రాం, బెస్ట్ అవేర్నెస్ ప్రోగ్రామ్స్ తో పాటు బెస్ట్ ఫస్ట్ ప్రెసిడెంట్ లయన్ ఏం అన్న దేవి, ఫస్ట్ బెస్ట్ సెక్రటరీ లయన్ జె శోభా, బెస్ట్ జోన్ చైర్ పర్సన్ లయన్ ఏ వనజ, డెడికేటెడ్ లయన్ గా బిల్లా సులోచన బెస్ట్ బ్యానర్ ప్రజెంటేషన్, సెకండ్ బెస్ట్ స్క్రాప్ బుక్ అవార్డు రావడం జరిగింది. ఈ సందర్భంగా లయన్స్ అధ్యక్షుడు మాట్లాడుతూ..కనకదుర్గ లయన్స్ క్లబ్ సభ్యుల సహకారంతో అవార్డులు వరించాయని, ఇక ముందు కూడా మేము మరింత బాధ్యతగా సేవా కార్యక్రమం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


# రామగుండం 1 వ వార్డులో నామినేషన్ విత్‌డ్రా వెనుక బెదిరింపుల నీడ

### రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపుతున్న ఆరోపణలు

### బీజేపీ మహిళా అభ్యర్థిపై ఒత్తిడి. కుటుంబానికి ప్రాణహాని భయాలు







**రామగుండం, ఫిబ్రవరి 02 (పీపుల్స్ న్యూస్):** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజాస్వామ్య విలువలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. కార్పొరేషన్ పరిధిలోని 1వ వార్డులో జరిగిన పరిణామాలు ఎన్నికల స్వేచ్ఛపై తీవ్ర ఆందోళనలకు దారి తీస్తున్నాయి. బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన రీమా బిశ్వాస్ తనను, తన కుటుంబాన్ని బెదిరించి బలవంతంగా నామినేషన్ విత్‌డ్రా చేయించారని సంచలన ఆరోపణలు చేశారు. “నామినేషన్ లేదా జైలు” -- బెదిరింపుల రాజకీయాలు గంజాయి కేసు పేరుతో భర్తపై ఒత్తిడి? ఎన్‌టీపీసీ ఇందిరమ్మ క్యాంప్‌లో నివసిస్తున్న రీమా బిశ్వాస్ తెలిపిన వివరాల ప్రకారం, ఫిబ్రవరి 2 మధ్యాహ్నం ఆమె భర్త పంకజ్ కుమార్ బిశ్వాస్ను ఎన్‌టీపీసీ కాంట్రాక్టర్ ద్వారా పిలిపించి, “నామినేషన్ విత్‌డ్రా చేయకపోతే గంజాయి కేసు పెడతాం” అంటూ పోలీసుల పేరుతో బెదిరించినట్లు ఆమె ఆరోపించారు. “జైలు కావాలా? లేక నామినేషన్ తీసుకోవాలా?” అంటూ తీవ్ర ఒత్తిడి తెచ్చినట్లు వాపోయారు. మార్గమధ్యంలో బెదిరింపులుకాంగ్రెస్ అభ్యర్థి అనుచరులపై ఆరోపణలు ఇదే సమయంలో, 1వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి మడిపెల్లి మల్లేష్ అనుచరులు తమ భర్తను లక్ష్యంగా చేసుకొని, “మధ్యలో ఏం జరిగినా బాధ్యత మాది కాదు” అంటూ బెదిరింపులకు పాల్పడ్డారని రీమా బిశ్వాస్ తెలిపారు. ఈ ఘటనతో తమ కుటుంబం భయాందోళనలకు గురైందని చెప్పారు. చిన్నారి భద్రతపై కూడా ముప్పు ఆటో పంపించి భయపెట్టినట్టు వెల్లడి బెదిరింపులు అక్కడితో ఆగలేదని, తన వద్దకు ఆటో పంపించి, తన చిన్న కుమారుడిని కూడా లక్ష్యంగా చేసుకొని “నామినేషన్ విత్‌డ్రా చేయకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయి” అంటూ భయపెట్టినట్లు ఆమె ఆరోపించారు. అనంతరం బలవంతంగా వీడియో స్టేట్‌మెంట్ రికార్డు చేసి, రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయానికి తీసుకెళ్లి, పలు పత్రాలపై సంతకాలు చేయించారని పేర్కొన్నారు. “ఎవరికైనా చెప్పితే నాశనం చేస్తాం”నోరు మూయించేందుకు భయభ్రాంతుల యత్నం ఈ విషయాన్ని పార్టీ నేతలకు గానీ, అధికారులకు గానీ తెలిపితే “మీ కుటుంబాన్ని పూర్తిగా నాశనం చేస్తాం”, “ఇక్కడ ఎలా బతుకుతారో చూస్తాం” అంటూ మరింతగా బెదిరించినట్లు రీమా బిశ్వాస్ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఫిర్యాదు ప్రాణహాని ఉందంటూ రక్షణ కోరిన బీజేపీ అభ్యర్థి తమకు, తమ భర్తకు, కుటుంబ సభ్యులకు తీవ్ర ప్రాణహాని ఉందని పేర్కొంటూ, స్పెషల్ ఎలక్షన్ కమిషనర్, డీజీపీ, పోలీస్ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. తక్షణమే రక్షణ కల్పించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేస్తున్నారు.

# 12 అవార్డులు సొంతం చేసుకున్న ములుగు లయన్స్ క్లబ్





**ములుగు జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 02 (పీపుల్స్ న్యూస్) :** లయన్స్ ఇంటర్నేషనల్ 320 ఎఫ్ రెండవ రీజనల్ ప్రాంతీయ మహాసభ నిత్య బంకెట్ హాల్లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రొసీడింగ్ ఆఫీసర్ గా రీజినన్ చైర్ పర్సన్ లయన్ డాక్టర్ ఎం. పద్మజా దేవి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా మధ్యప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి పాల్గొని మాట్లాడారు. 320ఎఫ్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య ప్రారంభించారు. రీజనల్ మీట్ కార్యక్రమంలో మూడు జోన్లలోని 10 క్లబ్ ల అధ్యక్ష కార్యదర్శులు కోశాధికారులతో పాటు సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కలర్ ఫుల్ గా బ్యానర్ ప్రజెంటేషన్ ద్వారా వారి యొక్క సేవా కార్యక్రమాలను వివరించారు. రీజినల్ మీట్ లో ములుగు లైన్స్ క్లబ్ కు బెస్ట్ అధ్యక్షుడిగా లయన్ దొంతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బెస్ట్ కార్యదర్శిగా లయన్ చుంచు రమేష్, బెస్ట్ కోశాధికారిగా లయన్ ఆడెపు రాజులకు 12 అవార్డులు అందజేశారు. వీటితోపాటు ములుగు లయన్స్ క్లబ్ చేసిన కార్యక్రమాలకు తొమ్మిది అవార్డులు వరించాయి. ఫస్ట్ బెస్ట్ మెంబర్షిప్ గ్రోత్, బెస్ట్ క్యాలెండర్ ఈవెంట్స్, బెస్ట్ చైల్డ్ వూడ్ క్యాన్సల్, బెస్ట్ అవేర్నెస్, బెస్ట్ నీడ్ బేసిక్ ఆక్టివిటీ, బెస్ట్ ఎన్విరాన్మెంట్, ఫస్ట్ బెస్ట్ స్క్రబ్ బుక్, బెస్ట్ ఫోటో ఎగ్జిబిషన్, ఫస్ట్ రీచ్డ్ అవార్డులను ముఖ్య అతిథుల చేతుల మీదుగా ములుగు లయన్స్ క్లబ్ సభ్యులు అందుకున్నారు. ఈ సందర్భంగా ములుగు లయన్స్ అధ్యక్షుడు దొంతి రెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ..ములుగు లైన్స్ క్లబ్ సభ్యుల సహకారంతో అవార్డులు ఈరోజు వరించాయని, ఇక ముందు కూడా మేము మరింత బాధ్యతగా సేవా కార్యక్రమం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు లయన్స్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# జాతర ప్రతిష్టను దెబ్బతీయాలనే కుట్రలు సహించం

### మంత్రి సీతక్క

### కేటీఆర్ నీ దురహంకారం తగ్గించుకో

### ప్రతిపక్షాలపై నిప్పులు జరిగిన మంత్రి సీతక్క





**ములుగు జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 02 (పీపుల్స్ న్యూస్)** ప్రపంచ ప్రఖ్యాత శ్రీ సమ్మక్క--సారలమ్మ మహాజాతర ప్రతిష్టను దెబ్బతీసేలా కావాలనే కొంతమంది రాజకీయ పార్టీలు, కొన్ని మీడియా సంస్థలు, కొందరు స్వాములు తప్పుడు ప్రచారాలకు పాల్పడుతు న్నారని మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మేడారం జాతర నిర్వహణలో భాగంగా వారం రోజుల పాటు తాము 24 గంటలూ అక్కడే ఉండి పనిచేశామని, కోట్లాది మంది భక్తులు సుఖశాంతులతో దర్శనం చేసుకున్నారని తెలిపారు. జాతరను సక్సెస్ చేయడంలో సహకరించిన ములుగు జిల్లా మీడియా సోదరులకు, అధికారులు, పోలీసులు, పారిశుధ్య సిబ్బందికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. గుడి నిర్మాణం ప్రారంభమైన నాటి నుంచే ఆదివాసీ విశ్వాసాలకు వ్యతిరేకమని తప్పుడు ప్రచారాలు సాగుతున్నాయని పేర్కొన్నారు. గుడిలో చేసిన ప్రతి మార్పు పూజారుల ఆమోదం, ఎండోమెంట్ కమిషనర్ అనుమతితోనే జరిగిందని స్పష్టం చేశారు. అయినప్పటికీ సమ్మక్క గద్దెల వద్ద కూడా రాజకీయాలు చేయడం దురదృష్టకరమన్నారు. శుక్రవారం సాయంత్రం విఐపి వాహనాలు భారీగా రావడంతో కొంతసేపు ట్రాఫిక్ ఇబ్బంది ఏర్పడిందని, అది బస్సులు లేకపోవడం వల్ల కాదని తెలిపారు. గత జాతరలతో పోలిస్తే ఈసారి ట్రాఫిక్ సమస్యలు చాలా వరకు తగ్గాయని పేర్కొన్నారు. కొంతమంది విఐపిలు వందలాది మందితో, అనేక వాహనాలతో రావడం వల్లే ఇబ్బందులు తలెత్తాయన్నారు. వ్యక్తిగత భూముల్లో జరిగిన చిన్న వ్యాపారాలను కూడా దందాలుగా చిత్రీకరించడం కుట్రపూరితమని మండిపడ్డారు. ప్రభుత్వ భూముల్లో ఎవరైనా అక్రమాలు చేస్తే తామే బాధ్యత వహిస్తామని స్పష్టం చేశారు. జాతరలో ప్రమాదాలు జరుగుతాయని, ప్రాణనష్టం జరుగుతుందని యూట్యూబ్‌లు, టీవీ ఛానళ్లలో చేసిన ప్రచారం పూర్తిగా అవాస్తవమని అన్నారు. ఈసారి మాస్‌తో పాటు క్లాస్, సూపర్ క్లాస్ భక్తులు కూడా పెద్ద ఎత్తున రావడం కొందరికి జీర్ణించుకోలేక నెగటివ్ నరేటివ్‌ను సృష్టిస్తున్నారని విమర్శించారు. రాజకీయాలపై మాట్లాడితే మాట్లాడొచ్చుగానీ, దేవతలను, జాతరను కించపరచడం సహించబోమన్నారు. జాతరలో 13 వేల మంది పోలీసులు, 40 రోజుల పాటు జిల్లా యంత్రాంగం సేవలందించిందని తెలిపారు. తాగునీటి ట్యాంకులు, చలివేంద్రాలు, టాయిలెట్లు, షెడ్లు, తల్లులు, పిల్లల కోసం ప్రత్యేక గదులు ఏర్పాటు చేశామని వివరించారు. చిన్నచిన్న లోపాలు ఉంటే భవిష్యత్తులో సరిదిద్దుకుంటామని తెలిపారు. సమ్మక్క--సారలమ్మలు అన్ని కులాలు, అన్ని మతాలు నమ్మే ప్రకృతి దేవతలని, వారి కీర్తిని తగ్గించే కుట్రలను తక్షణమే మానుకోవాలని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. భక్తుల విశ్వాసాన్ని కాపాడటమే తమ బాధ్యతని స్పష్టం చేశారు.

# ములుగు జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించిన రాష్ట్ర మంత్రి సీతక్క



**ములుగు జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 02 (పీపుల్స్ న్యూస్):** ములుగు నియోజకవర్గంలో నూతనంగా ఏర్పడ్డ ములుగు మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరచిన 20 వార్డుల సభ్యులను ప్రతి ఒక్కరిని గెలిపించాలని ములుగు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం సహకరించాలని ములుగు పట్టణ ప్రజలకు సూచించిన మంత్రి సీతక్క 2023 శాసన సభ ఎన్నికల్లో నన్ను ఎలాగైతే భారీ మెజారిటీతో గెలిపించి రాష్ట్రానికి మంత్రిని చేశారో అలాగే ములుగు మున్సిపాలిటీలో మొదటి సారి జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులందరిని గెలిపించి ములుగు పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని మంత్రి సీతక్క అన్నారు ఇప్పటికే ములుగు పట్టణానికి 50 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు పూర్తి చేశామని రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని మంత్రి సీతక్క కోరారూ ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లాడి రాంరెడ్డి, పంచాయతీ రాజ్ స్టేట్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి. కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇస్సార్ ఖాన్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ పల్లె జైపాల్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ కొండం రవీందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సేద సారంగం, కొంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ములుగు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతనిప్పుల బిక్షపతి, జిల్లా నాయకులు, సీనియర్ నాయకులు యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ప్రజా దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు వెంటనే చేపట్టాలి.. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం/ ఫిబ్రవరి2/(పీపుల్స్ న్యూస్):** ప్రజల దరఖాస్తులను అధికారులు ప్రాధాన్యత నిచ్చి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని, ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా చింతకాని మండలం లచ్చగూడెం గ్రామం నుండి డి.సుజాత ఉపాధి కొరకు స్వీపర్ పోస్ట్ ఇప్పించగలం దులకు దరఖాస్తు చేయగా, జిల్లా ఉపాధికల్పన అధికారిని తగుచర్యకై కలెక్టర్ ఆదేశించారు. సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామం నుండి గ్రామస్థులు, గ్రామంలోని ప్రభుత్వ భూమి ఆక్రమణ కాకుండా చర్యలకు దరఖాస్తు సమర్పించగా, సత్తుపల్లి తహసీల్దార్ నకు విచారణ చేసి, చర్యలు చేపట్టాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. స్థానిక పంపింగ్ వెల్ రోడ్ నుండి పిడకల రాంబాయి, తనకు ఇల్లు లేదని, డబల్ బెడ్ రూం ఇల్లు కేటాయించుటకు దరఖాస్తు సమర్పించగా, హౌజింగ్ పిడి ని తగుచర్యకై కలెక్టర్ ఆదేశించారు. వైరా పట్టణం నుండి ఎస్కె. గాలిబి, తనకు స్థలం ఉందని, తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కు దరఖాస్తు సమర్పించగా, హౌజింగ్ పిడి ని తగుచర్యకై కలెక్టర్ ఆదేశించారు. తిరుమలాయపాలెం మండలం సుబ్లేడ్ గ్రామం నుండి పి. వెంకటమ్మ, తన భర్త ఎల్లయ్య జూన్, 2023 లో మరణించారని, తనకు ప్రభుత్వం నుండి వితంతు పెన్షన్ మంజూరుకు దరఖాస్తు సమర్పించగా, డిఆర్డీవో కు తగుచర్యకై కలెక్టర్ ఆదేశించారు. అనంతరం వివిధ శాఖల్లో పనిచేసి 31 జనవరి న పదవీ విరమణ చెందిన 7 గురు అధికారులు, సిబ్బందిని కలెక్టర్ సన్మానించి, వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తనకు అవకాశం ఇస్తే నాయకుడిగా కాకుండా ప్రతి ఒక్కరికి సేవకుడిగా పని చేస్తా

### 21 వ వార్డు జనసేన అభ్యర్థి జి అంజనేయులు



**వనపర్తి, ఫిబ్రవరి 02, (పీపుల్స్ న్యూస్ ) :** జన సేవే నా లక్ష్యం నాకు ఒక్కసారి అవకాశం ఇస్తే నాయకుడిగా కాకుండా ప్రతి ఒక్కరికి సేవకుడిగా పని చేస్తానని 21 వ వార్డు జనసేన అభ్యర్థి జి అంజనేయులు అన్నారు. సోమవారం వనపర్తి మున్సిపాలిటీ పరిధిలో 21వ వార్డు నుంచి జి అంజనేయులు జనసేన పార్టీ తరఫున నామినేషన్ వేసి ఎన్నికల బరిలో నిలిచారు. పార్టీ ఆదేశాల మేరకు జనసేన పార్టీ వనపర్తి జిల్లా కోఆర్డినేటర్ రాష్ట్ర యూత్ వింగ్ నాయకులు ముకుంద నాయుడు ఆధ్వర్యంలో వనపర్తి మున్సిపాలిటీ లోని 21 వ వార్డు జనసేన అభ్యర్థికి జి అంజనేయులు కు బీ-ఫాము అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైనవిగా భావించి వార్డు లోని మేధావులు, మహిళలు, యువత ,విద్యార్థులు వార్డు సమస్యలపై ప్రత్యక్ష పరిష్కారానికి పాటుపడే కనీసం విద్యార్హత కలిగి సమాజం పట్ల , ప్రజా పరిపాలనపై అవగాహన ఉన్న వ్యక్తులకే ఈ ఎన్నికల్లో అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జనసేన పార్టీ 21 వ వార్డు అభ్యర్థిని వార్డు ప్రజలందరూ ఆశీర్వదించి కౌన్సిలర్ గా గెలిపిస్తే స్థానికంగా ఉండే సమస్యలతో పాటు వార్డులో దీర్ఘకాలికంగా పట్టిపీడిస్తున్న సమస్యల పరిష్కారానికై , విద్యార్థుల విద్యా ఉద్యోగ ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో ఉపాధి అవకాశాలను పెంపొందించే దిశగా చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరే విధంగా పారిదర్శకత వహించి వార్డు అభివృద్ధికి తోడ్పడుతానని జనమేన బలమన్నారు. ప్రతి ఒక్కరి పనిని ముందుండి పూర్తి చేసే బాధ్యత నేను తీసుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా నాయకులు ముకుంద నాయుడు, సురేష్ యాదవ్ ,ఉత్తేజ్, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# క్రీడలతోనే ఆరోగ్యం.. ఆటలతోనే ఉత్సాహం!

**మాజీ సర్పంచ్ రామగిరి లావణ్య నాగరాజు**
**ముస్త్యాలలో ఘనంగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం**




**రామగుండం, ఫిబ్రవరి 02 (పీపుల్స్ న్యూస్):**గ్రామీణ ప్రాంతాల్లోని యువ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని మాజీ సర్పంచ్ రామగిరి లావణ్య నాగరాజు పేర్కొన్నారు. ముస్త్యాల గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆమె ఉత్సాహంగా ప్రారంభించారు.యువతకు అండగా నిలిచిన లావణ్య నాగరాజు ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్న ప్రతి జట్టుకు బ్యాట్స్‌ను పంపిణీ చేస్తూ, క్రీడాకారులను ప్రోత్సహించారు. యువత క్రమశిక్షణతో ఆటల్లో పాల్గొని గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు.ఆకర్షణీయమైన నగదు బహుమతులు యువతను క్రీడల వైపు ఆకర్షించేందుకు నిర్వాహకులు ఆకర్షణీయమైన నగదు బహుమతులను ప్రకటించారు.మొదటి బహుమతి -- 1000 రెండో బహుమతి -- 500 క్రీడలే శారీరక-- మానసిక వికాసానికి పునాది క్రీడలు కేవలం వినోదానికి మాత్రమే కాకుండా, శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంలో, మానసిక ఉల్లాసాన్ని కలిగించడంలో కీలకమైనవని లావణ్య నాగరాజు తెలిపారు. ముస్త్యాల యువత కృషితో ఈ టోర్నమెంట్ విజయవంతంగా కొనసాగుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.భారీగా హాజరైన గ్రామస్తులు ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువజన సంఘాల సభ్యులు, గ్రామస్తులు మరియు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీడాకారులకు ఉత్సాహం అందించారు.

# న్యూసిటీ కాలనీ వెంకటేశ్వర స్వామి రథోత్సవానికి భక్తులు తరలి రావాలి.


**అంగరంగ వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు .**




**కంటోన్మెంట్ ఫిబ్రవరి 02 , (పీపుల్స్ న్యూస్ ) :** వాహన సేవ ఆలయ ప్రాంగణంలో కన్నుల పండుగ జరిగింది. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. హోమం లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.హనుమత్ వాహన సేవలో పాల్గొన్నారు. సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ మంగళవారం ఆలయం వద్ద నుంచి ప్రారంభం కానున్న రథయాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.నేడు రథయాత్ర......బోయిన్పల్లి న్యూ సిటీ కాలనీ శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం జరగనున్న రథయాత్ర కార్యక్రమంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్ మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తోపాటు పలువురు రాజకీయ నేతలు వ్యాపారవేత్తలు పాల్గొనే అవకాశం ఉందని, ఆలయ నిర్వహకులు తెలియజేశారు.స్వామి వారి ఊరేగింపు కోసం సుమంత్ రెడ్డి, శిరీష దంపతులు సుమారు 16 లక్షల రూపాయలు రథాన్ని స్వామి వారికోసం చేయించారు. ఈ రథంలోనే స్వామి అమ్మవార్లు ఊరేగింపు నిర్వహించనున్నారు. ఆలయం నుండి ప్రారంభమయ్యే యాత్ర పురవీధులలో తిరిగి ఆలయానికి చేరుకొనుంది. మొట్టమొదటిసారిగా రథయాత్రను నిర్వహిస్తుండటంతో ఎలాంటి అవాంతరములు చోటు చేసుకోకుండా ఆలయ నిర్వాహకులు భక్తులు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ రథయాత్రలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కంటోన్మెంట్ బోర్డ్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదా మల్లికార్జున్, తార్డ్ బందు ఈవో నరేందర్ ఓల్డ్ బోయిన్పల్లి కార్పొరేటర్ మొత్తం నరసింహ యాదవ్ కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి బోర్డు మాజీ సభ్యుడు పాండు యాదవ్ తదితరులు హాజరుకానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ రథయాత్రలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ నారాయణ, జగన్నాథం, యాదగిరి,నాగభూషణం, కనక ప్రసాద్, అర్చకులు రంగనాథాచార్యులు, శ్రీకాంత్ చార్యులు భక్తులకు పిలుపునిచ్చారు.

# కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ మాటల గరాడిగా ఉంది

**జేఎన్టీయూ హెచ్ స్టూడెంట్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఎరవెల్లి జగన్**




**కూకట్ పల్లి, ఫిబ్రవరి 02, (పీపుల్స్ న్యూస్ ) :** పార్లమెంట్ లో ప్రవేశ పెట్టిన కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ మాటల గరాడిగా ఉందని జేఎన్టీయూ హెచ్ స్టూడెంట్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఎరవెల్లి జగన్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రనికి పూర్తిగా మొండి చెయ్యి చూపారన్నారు. విద్యారంగం నిధులు పక్కకి మళ్లించి, పి. హెచ్. డి రీసెర్చ్ స్కాలర్స్ కి పేలోషిప్స్ ఇవ్వకుండా, కొత్త రీసెర్చ్ ఆవిష్కరణల ఊసే లేదన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. నిరుద్యోగులు, విద్యార్థులు, యువత కేంద్ర ప్రభుత్వం మీద అసంతృప్తి గా ఉన్నారన్నారు. విద్య రంగం ను పూర్తిగా విస్మరించిందన్నారు. బీజేపీ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్న రాష్టాల్లో నిధులు ఎక్కువ కేటాయిస్తూ, బీజేపీ ప్రభుత్వం లేని రాష్టలకు మొండి చేయి చూపరని విమర్శిస్తూ కేంద్ర ప్రభుత్వ ని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం మీద అసహనం వ్యక్తం చేశారు

# ఆకెనపల్లి గ్రామంలో ఆధ్యాత్మిక ఉత్సవ శోభ..!!

**లంబులాద్రి లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణం --**
**రథోత్సవం ఘనంగా నిర్వహణ**
**సర్పంచ్ గాదె స్రవంతి -- సుధాకర్**
**నేతృత్వంలో సంప్రదాయబద్ధ వేడుకలు**





**రామగుండం, ఫిబ్రవరి 02 (పీపుల్స్ న్యూస్):**గోదావరిఖని ఫిబ్రవరి 02 ఆకెనపల్లి గ్రామం భక్తిశ్రద్ధలతో ఉట్టిపడింది. లంబులాద్రి లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణం, రథోత్సవాలను గ్రామస్తులు అత్యంత భక్తి భావంతో, సంప్రదాయ పద్ధతుల్లో ఘనంగా నిర్వహించారు.స్వామివారి సన్నిధిలో ప్రముఖ అతిథుల సందడి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న శ్రీమతి మనాలి ఠాకూర్ ఈ పవిత్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ గారి సతీమణి శ్రీమతి మనాలి ఠాకూర్ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాభివృద్ధి, ప్రజల శ్రేయస్సు, నియోజకవర్గ ప్రజల సుఖసంతోషాల కోసం హృదయపూర్వకంగా ప్రార్థనలు చేశారు.భక్తుల నామస్మరణతో మార్మోగిన గ్రామ వీధులు "గోవిందా.. గోవిందా.." నినాదాలతో రథోత్సవం కళ్యాణోత్సవం అనంతరం నిర్వహించిన రథోత్సవం గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో నింపింది. భక్తులు స్వామివారి రథాన్ని లాగుతూ "గోవిందా.. గోవిందా.." అనే నామస్మరణతో స్వామివారి కృప కోసం ప్రార్థించారు.ఐక్యతకు ప్రతీకగా ఉత్సవాలు సంప్రదాయ విలువలను చాటిన ఆకెనపల్లి ఈ ఉత్సవాలు గ్రామ ప్రజల్లో ఐక్యతను, సంప్రదాయ విలువలను మరింత బలపరిచాయి. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మహిళలు, యువకులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.భక్తి పరవశంతో మార్మోగిన ఆకెనపల్లి స్వామివారి దివ్య ఆశీస్సులతో పునీతమైన గ్రామం పూర్తి గ్రామం భక్తి పరవశంతో మార్మోగుతూ, లంబులాద్రి లక్ష్మీ నరసింహ స్వామి దివ్య ఆశీస్సులతో ఆకెనపల్లి మరింత పునీతమైంది.

# పదవికి పోటీ కాదు... సేవకు పోరాటం!

**20 ఏళ్లుగా ప్రజల మధ్యే జీవితం**
**నిరంతర సేవకు నిదర్శనం**
**28 వ డివిజన్‌లో స్వప్న హరిప్రసాద్**
**పెరుగుతున్న ఆదరణ**




**రామగుండం ఫిబ్రవరి 02 (పీపుల్స్ న్యూస్):**రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 28 వ డివిజన్ రాజకీయంగా కీలక దశలో నిలిచింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి ఈదునూరి స్వప్న హరిప్రసాద్ పేరు డివిజన్ ప్రజల్లో విశేషంగా చర్చకు వస్తోంది. పదవి కోసం కాకుండా, సేవే జీవిత లక్ష్యంగా గత రెండు దశాబ్దాలుగా ప్రజల మధ్యే ఉంటూ సాగిస్తున్న ఆయన ప్రస్థానం ఇప్పుడు ఎన్నికల బరిలో ప్రత్యేక గుర్తింపును సంతరించుకుంటోంది.గత 20 సంవత్సరాలుగా డివిజన్‌లోని ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ, అవసరమైన చోట సహాయం అందిస్తూ, సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ స్వప్న హరిప్రసాద్ తనకంటూ ప్రత్యేకమైన సేవా ముద్ర వేశారు. రోడ్లు, డ్రైనేజీ, త్రాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, ప్రజలకు అండగా నిలిచిన వ్యక్తిగా స్థానికులు ఆయనను గుర్తిస్తున్నారు.స్థానికులు మాట్లాడుతూ,"హరిప్రసాద్ మాటల నాయకుడు కాదు... పని చేసే నాయకుడు. ఎలాంటి పదవి లేకున్నా ప్రజల కోసం ముందుండే వ్యక్తి. ఇలాంటి వ్యక్తికి అవకాశం ఇస్తే 28 వ డివిజన్ అభివృద్ధి దిశగా మరింత ముందుకు వెళ్తుంది" అని అభిప్రాయపడుతున్నారు.స్వప్న హరిప్రసాద్ కూడా తన లక్ష్యాన్ని స్పష్టంగా ప్రకటిస్తున్నారు. "పదవి నాకు ముఖ్యం కాదు. ప్రజలకు సేవ చేయడమే నా లక్ష్యం. 28 వ డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడిపించేందుకు నా వంతు బాధ్యతగా కృషి చేస్తాను" అని ఆయన తెలిపారు. మహిళలు, యువత, వృద్ధులు సహా అన్ని వర్గాల ప్రజలతో ఆయనకు ఉన్న అనుబంధం, డివిజన్‌లో ఆయనకు పెరుగుతున్న మద్దతుకు కారణంగా మారిందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. సేవా నేపథ్యం, అనుభవం, ప్రజలతో నేరుగా ఉండే నాయకత్వ శైలి... ఇవన్నీ స్వప్న హరిప్రసాద్‌ను 28 వ డివిజన్‌లో ప్రత్యేకంగా నిలబెడుతున్నాయని స్థానిక పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

# మాటల రాజకీయం కాదు... పనుల నాయకత్వం!

**26 వ డివిజన్‌లో అనిత చౌదరి ఫోకస్**
**అభివృద్ధి ఆశల ప్రతీకగా అనిత చౌదరి**




**రామగుండం ఫిబ్రవరి 02 (పీపుల్స్ న్యూస్):** 26 వ డివిజన్ రాజకీయ వాతావరణం వేగంగా మారుతోంది. కార్పొరేటర్ ఎన్నికల నేపథ్యంలో డివిజన్ ప్రజలు అభివృద్ధిని కేంద్రంగా చేసుకొని తమ నిర్ణయాన్ని తీసుకుంటున్నారన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో కోయ అనిత చౌదరి పేరు డివిజన్ అంతటా విస్తృతంగా చర్చకు వస్తోంది.ప్రజలకు దగ్గరగా ఉంటూ, సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని స్పందించే నాయకత్వ శైలి ఆమెకు ప్రత్యేక గుర్తింపునిచ్చిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. గతంలో అనేక సందర్భాల్లో ప్రజా సమస్యలపై ఆమె చూపిన చొరవ, ప్రజల మనసుల్లో విశ్వాసాన్ని బలపరిచిందని చెబుతున్నారు.డివిజన్‌లోని పలు కాలనీల్లో స్థానికులు మాట్లాడుతూ,"26వ డివిజన్‌కు మాటల నాయకత్వం కాదు... పనిచేసే నాయకత్వం కావాలి. ఆ లక్షణాలు అనిత చౌదరిలో స్పష్టంగా కనిపిస్తున్నాయి" అని పేర్కొంటున్నారు. ముఖ్యంగా మౌలిక సదుపాయాలైన రోడ్లు, డ్రైనేజీ, త్రాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి సమస్యలపై ఆమెకు స్పష్టమైన అవగాహన ఉందని వారు అంటున్నారు.మహిళలు, యువత, వృద్ధులు అన్న తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు ఆమెపై ఆసక్తి చూపడం డివిజన్ రాజకీయాల్లో కొత్త చర్చకు దారి తీస్తోంది. "మా డివిజన్‌కు కావాల్సింది వినే నాయకత్వం. అదే అనిత చౌదరిలో ఉంది" అనే అభిప్రాయం స్థానికంగా వినిపిస్తోంది. ఎన్నికల వేళ ప్రజలు అభివృద్ధిని కొలమానంగా చేసుకొని నిర్ణయం తీసుకునే ప్రయత్నంలో ఉన్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో 26 వ డివిజన్‌లో అనిత చౌదరి పేరు ప్రాధాన్యతను సంతరించుకుంటూ ముందుకు సాగుతోందని స్థానికంగా చర్చ సాగుతోంది.

# పాదచారుల భద్రతే లక్ష్యంగా స్కైవాక్ నిర్మాణం

**సైబరాబాద్ పోలీస్ కమిషనర్**
**డాక్టర్ ఎం. రమేష్.**





**సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, ఫిబ్రవరి 02, (పీపుల్స్ న్యూస్ ) :** స్కైవాక్ నిర్మాణంతో వాహనాల రాకపోకలు సజావుగా సాగడంతో పాటు పాదచారులు ప్రమాదాలు లేకుండా రహదారి దాటే వీలు కలగనుందని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, అన్నారు. సైబరాబాద్ ఐటీ కారిడార్‌లో పాదచారుల భద్రతను మెరుగుపరచడంతో పాటు ట్రాఫిక్ రద్దీని గణనీయంగా తగ్గించాలనే లక్ష్యంతో రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి టీ హబ్ వరకు తొలి దశ స్కైవాక్ నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నారు.ఈ నేపథ్యంలో ఐపీఎస్., నేతృత్వంలో అధికారుల బృందం సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు. ఈ స్కైవాక్ రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి ఐకియా ఫ్లైఓవర్, ఐఓసీఎల్ మీదుగా టీ హబ్ వరకు విస్తరించనుంది. ఐటీ కంపెనీలు, కార్యాలయాలు అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో పాదచారుల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో పాటు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే ట్రాఫిక్ రద్దీ సుమారు 30 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రతిష్టాత్మక ప్రాజెక్టును ఎస్సీఎస్సీ సహకారంతో వివిధ సంస్థల భాగస్వామ్యంతో చేపట్టనున్నాయి. తొలి దశలో సుమారు 500 మీటర్ల పొడవు గల స్కైవాక్‌ను నిర్మించనున్నారు. అలాగే టీ హబ్ నుంచి మైండ్ స్పేస్ సీ--గేట్ వరకు సుమారు 400 మీటర్ల పొడవైన అండర్‌పాస్ (టన్నెల్) నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐఏఎల్ఏ) ద్వారా తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీఐఐసీ) నుంచి ప్రభుత్వానికి ఈ ప్రతిపాదనలు పంపనున్నారు. భవిష్యత్తులో ఈ స్కైవాక్‌ను ఇతర ప్రాంతాలకు విస్తరించేలా ప్రణాళికలు రూపొందించారు. ఈ పనుల పురోగతిని జీహెచ్ఎంసీ, టీజీఐఐసీ, ఐఏఎల్ఏ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశాల ద్వారా క్రమం తప్పకుండా పర్యవేక్షించనున్నారు.సీపీ వెంట కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, శేరిలింగంపల్లి ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్, మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీ సాయి కుమార్, ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు, మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, మాదాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ కుమార్, రాయదుర్గం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పవన్, ఎస్సీఎస్సీ సీఈవో నావెద్, రహేజా మైండ్ స్పేస్, సత్వ, దివ్యశ్రీ, ఫీనిక్స్ గ్రూప్ సంస్థల ప్రతినిధులు ఉన్నారు.

# పవిత్ర స్థలాన్ని కనీసం శుభ్రం చేయించకపోవడం బాధాకరం

**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 02, (పీపుల్స్ న్యూస్ ) :** తమ పెద్దల సమాధుల వద్ద ప్రార్థనలు చేసుకునే పవిత్ర స్థలాన్ని కనీసం శుభ్రం చేయించకపోవడం బాధాకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. విందు ముగిశాక విస్తరాకులు ఎత్తినట్లు.. సరిగ్గా ఇదే తీరు శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కనిపిస్తోంది. మంగళవారం జరగనుంది. అయితే, విడ్డూరంగా శ్మశాన వాటికల శుభ్రత కోసం పిలిచిన టెండర్ల గడువు కూడా రేపు మధ్యాహ్నం వరకు విధించడం అధికారులు,ప్రజాప్రతినిధుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా నిలుస్తోంది.మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు టెండర్లు ఖరారు చేసి, ఇంకెప్పుడు పనులు ప్రారంభిస్తారని మైనార్టీలు ప్రశ్నిస్తున్నారు. పండుగ అయిపోయాక శ్మశానాలను శుభ్రం చేస్తారా? అని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే, అధికారుల నిర్లక్ష్య వైఖరికి ఇది పరాకాష్ట అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిధులు లేనప్పుడు కోట్లాది రూపాయలతో శిలాఫలకాలు వేస్తూ హడావుడి చేసే ప్రజాప్రతినిధులు, ఉన్న నిధులను మైనార్టీల శ్రేయస్సు కోసం సకాలంలో ఖర్చు చేయడానికి ఎందుకు వెనుకాడుతున్నారు? వారం రోజుల క్రితమే పూర్తి చేయాల్సిన టెండర్ల ప్రక్రియను, ఉద్దేశపూర్వకంగా పండుగ రోజు వరకు సాగదీయడం వెనుక ఆంతర్యమేమిటి? కేవలం నిధులను కాజేసేందుకే (నిధుల స్వాహా) ఈ చివరి నిమిషం నాటకమాడుతున్నారా అనే అనుమానాలు బలపడుతున్నాయి.
పశువుల నిలయంగా పవిత్ర స్థలాలు మరోవైపు క్షేత్రస్థాయిలో పరిస్థితి దారుణంగా ఉంది. మాతృశ్రీ నగర్ డివిజన్, ఆదిత్య నగర్ సర్వే నెంబర్ 80లోని ముస్లిం మైనార్టీ శ్మశాన వాటిక పశువుల సంచారంతో అపరిశుభ్రతకు నిలయంగా మారింది.










అధికారులను ప్రశ్నిస్తే రేపు చేస్తాం అంటూ దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారని మండిపడుతున్నారు.అధికారుల పనితీరుకు అద్దం పడుతున్న తేదీలు:అధికారులు టెండర్ల ప్రక్రియను ఎంత అపహాస్యం చేశారో ఈ గడువు తేదీలే స్పష్టం చేస్తున్నాయి. దీప్తి శ్రీ నగర్ (వార్డు 239): రూ. 69,457 లు, మియాపూర్: రూ. 47,871, హఫీజ్‌పేట్ (వార్డు 236): రూ. 72,000లు, మాదాపూర్ (వార్డు 239): రూ. 1,22,000 లు , శేరిలింగంపల్లి సర్కిల్: రూ. 1,49,000 లు రేపు మధ్యాహ్నం టెండరు ఖరారైతే, సాయంత్రం జరిగే పండుగకు ఏర్పాట్లు ఎప్పుడు చేస్తారు?ఇది ముమ్మాటికీ మైనార్టీల మనోభావాలతో ఆడుకోవడమేనని మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి మండిపడ్డారు. ఆమె ఆదిత్య నగర్ లోని శ్మశాన వాటికను స్వయంగా పరిశీలించి, అధికారుల, ఎమ్మెల్యే తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వైసీపీ చర్యలపై అప్రమత్తంగా ఉండండి సీనియర్ మంత్రుల హెచ్చరిక

**అమరావతి, ఫిబ్రవరి 2:** కూటమి ఎంపీలు, ఎమ్మెల్యేలతో టీడీపీ సీనియర్ నేతలు మంత్రి అచ్చెన్నాయుడు, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ రావు సోమవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వైసీపీ కవ్వింపు చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో అలజడులు సృష్టించాలని వైసీపీ(జా) ప్లాన్ చేస్తోందని.. అందుకే ఆ పార్టీ నేతలు బూతు పురాణం ఎంచుకున్నారని మంత్రులు తెలిపారు. వారి ట్రాప్‌లో పడొద్దని టీడీపీ నేతలకు సూచించారు. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా వైసీపీ నేతలు బూతులు మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజలంతా వైసీపీని చీదరించుకుంటున్నారన్నారు. 20 నెలలుగా రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందని.. ఏపీకి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని వారు తెలిపారు.ఇటీవల కాలంలో వైసీపీ నేతలు రెచ్చగొట్టే వ్యాఖ్యలతో రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ సమస్య సృష్టిస్తున్నారని సీనియర్ మంత్రులు తెలిపారు. రెండు రోజులుగా జరిగిన సంఘటనపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వైసీపీ ఇలా చేయడం వల్లే 2024లో ప్రజలు వారికి అధికారం లేకుండా చేశారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు.

# నాణ్యత ప్రమాణాల్లో రాజీ పడకుండా నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలి





## పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు, ఫిబ్రవరి 02, (పీపుల్స్ న్యూస్ ) :** నాణ్యత ప్రమాణాల్లో రాజీ పడకుండా నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో జిహెచ్ఎంసి, రెవెన్యూ, ఇంజనీరింగ్ శాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పటాన్ చెరు అమీన్పూర్ సర్కిల్ల పరిధిలోని డివిజన్లో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతి నివేదికలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమీన్ పూర్, పటాన్ చెరు బల్దియా సర్కిల్ల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని జిహెచ్ఎంసి అధికారులను ఆదేశించారు.ప్రధానంగా మినీ ఫంక్షన్ హాళ్లు, కమ్యూనిటీ హాళ్లు, ఇండోర్ స్టేడియం, అంతర్గత మురుగునీటి కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులలో వేగం పెంచాలని సూచించారు. పటాన్చెరు డివిజన్ పరిధిలో నిర్మిస్తున్న వార్డు కార్యాలయాన్ని ప్రత్యేకతను పూర్తి చేయాలన్నారు. ముత్తంగి డివిజన్ పరిధిలోని పాటి గ్రామ పరిధిలోగల వివేకానంద స్టేడియం అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 27 కోట్ల రూపాయలు మంజూరు చేశాయని.. పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టెండర్లు పూర్తయిన పనులను వెంటనే ప్రారంభించాలని.. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని సూచించారు. పటాన్చెరు డివిజన్ పరిధిలో రెండు ఎకరాల విస్తీర్ణంలో స్లాటర్ హౌస్ (పశు వధశాల) నిర్మించబోతున్నట్లు తెలిపారు. 10 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో..ఆధునిక వసతులతో.. నూతన టెక్నాలజీతో నిర్మాణం చేయబోతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూములలో లేఔట్లు, అనుమతి లేని నిర్మాణాలు, అక్రమంలో కొనసాగకుండా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తూ .. కబ్జాదారుల పైన ఉక్కుపాదం మోపాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పటాన్చెరు డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, పటాన్చెరు ఎమ్మార్వో హరిబాబు, రామచంద్రపురం తహసిల్దార్ సరస్వతి, విద్యుత్ శాఖ డి ఈ భాస్కరరావు, నీటిపారుదల శాఖ ఈ ఈ భీమ్, డి ఈ రామస్వామి, జిహెచ్ఎంసి ఈఈ సురేష్, డిఈ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

# ట్రావెల్ ఏజెన్సీ మోసం ఇబ్బందుల్లో ప్రయాణికులు

**కడప, ఫిబ్రవరి 2 :** కడప కేంద్రంగా సాగుతున్న ఒక భారీ ట్రావెల్ మోసం వెలుగులోకి వచ్చింది. ఆధ్యాత్మిక యాత్రల పేరుతో అమాయక పర్యాటకులను నమ్మించి, విదేశీ గడ్డపై వారిని గాలికొదిలేసిన ఈ ఘటన బాధితులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. కడప నగరానికి చెందిన 'గో న్యూ హాలిడేస్ ' అనే ట్రావెల్ ఏజెన్సీ రామేశ్వరం, శ్రీలంక టూర్ ప్యాకేజీల పేరుతో భారీ వసూళ్లకు పాల్పడి.. తీరా అక్కడికి వెళ్లాక పర్యాటకులను నట్టేట ముంచింది.ఏం జరిగిందంటే.కడప కేంద్రంగా ఉదయ భాస్కర్ అనే వ్యక్తి ఈ ట్రావెల్ ఏజెన్సీని నడుపుతునట్లు బాధితులు గుర్తించారు. ఒక్కో పర్యాటకుని వద్ద సుమారు రూ.60 వేలు వసూలు చేసి, శ్రీలంక టూర్ ప్యాకేజీని ఖరారు చేశారు. శ్రీలంకలో తమ ప్రతినిధి రిసీవ్ చేసుకుంటాడని.. వసతి, భోజన సౌకర్యాలున్నీ తామే చూసుకుంటామని నమ్మబలికారు. బెంగళూరు నుంచి 11 మంది, హైదరాబాద్ నుంచి 40 మంది పర్యాటకులు శ్రీలంక చేరుకోగా.. అక్కడ వారిని పట్టించుకునే వారేలేకుండా పోయారు. ప్రస్తుతం వీరంతా అక్కడి లోకల్ ట్రావెల్ సంస్థల సాయంతో తలదాచుకుంటున్నారు.బాధితుల ఆవేదన.

# తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రుల చెంతకు




**సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, ఫిబ్రవరి 02, (పీపుల్స్ న్యూస్ ) :** తప్పిపోయిన బాలుడిని క్షేమంగా మియాపూర్ పోలీసులు తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. మియాపూర్ ఇన్స్పెక్టర్ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ న్యూ కాలనీకి చెందిన రాజేష్ కొడుకు సిద్ధార్థ్ (5) సోమవారం ఉదయం ఇంటి బయట ఆడుకుంటూ ఒక కిలోమీటర్ దూరం వెళ్లి తప్పిపోయాడు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న మియాపూర్ పోలీసులు బాలుడిని గుర్తించి రెండు గంటల పాటు శ్రమించి తిరిగి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవడంతో బాలుడి ఆచూకీ కోసం పోలీసులకు ఫిర్యాదు చేద్దామనుకున్న నేపథ్యంలో పోలీసులే ముందస్తుగా తమ బాబును గుర్తించి వారికి క్షేమంగా అప్పగించడం పై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

# సీఎంను తిట్టడం ప్రజాస్వామ్య విరుద్ధం అంబటిపై శ్రీనివాస్ వర్మ ఆగ్రహం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై వైసీపీ నేత అంబటి రాంబాబు చేసిన అసభ్య వ్యాఖ్యలను కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ తీవ్రంగా ఖండించారు. సోమవారం ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. అంబటి రాంబాబు వ్యాఖ్యలు సభ్య సమాజం సిగ్గుపడేలా ఉన్నాయని మండిపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రిని తిట్టడం ప్రజాస్వామ్య విరుద్ధమని, రాజకీయాల్లో నైతిక విలువలకు పూర్తి వ్యతిరేకమని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలు కేంద్ర హోంమంత్రిని కలవవచ్చన్నారు. రాష్ట్రంలో వైసీపీ నేత చేసిన అసభ్య వ్యాఖ్యల కారణంగా రాష్ట్ర కూటమి నేతలు వ్యతిరేకత వ్యక్తం చేశారని ఆయన తెలిపారు.రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిందని రాష్ట్రపతి, హోంమంత్రిని కలవాలనుకోవడం వైసీపీ



రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమని శ్రీనివాస్ వర్మ అన్నారు. గత ఎన్నికల్లో కేవలం 11 సీట్లకు పరిమితమైన వైసీపీకి.. ప్రతిపక్ష హోదా లేదని, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించడం మంచిది కాదన్నారు. గౌరవప్రదమైన రాజకీయాలు చేయాలని ఆయన సూచించారు. ఏపీలో వైసీపీ ఆవిర్భావం కావడం రాష్ట్ర ప్రజల కర్మ అని కేంద్రమంత్రి వ్యాఖ్యానించారు.వ్యక్తిగత దూషణలు, కుటుంబ సభ్యులను దూషించడం మంచిది కాదన్నారు శ్రీనివాస్ వర్మ. కొడాలి నాని, అప్పలరాజు, అంబటి రాంబాబు లాంటివారు దూషణలు చేస్తున్నా.. పార్టీ అధ్యక్షుడిగా ఉన్న జగన్ ఇలా మాటాడొద్దని చెప్పిన సందర్భాలు లేవని పేర్కొన్నారు. భార్యాబిడ్డలను తిడుతుంటే జగన్ మోహన్ రెడ్డి ఆనందపడిన తీరును అందరూ చూశారని మంత్రి శ్రీనివాస్ వర్మ చెప్పుకొచ్చారు.

# అదృశ్యమైన ఇద్దరు చిన్నారులు తల్లిదండ్రుల కు అప్పగింత




**సైబరాబాద్ కమిషనరేట్ , క్రైమ్ బ్యూరో, ఫిబ్రవరి 02, (పీపుల్స్ న్యూస్ ) :** తల్లిదండ్రులు మందలించారని అదృశ్యమైన ఇద్దరు చిన్నారులను జీడిమెట్ల పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం........ జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న ఇద్దరు చిన్నారులు చదువుకోవట్లేదు చెప్పిన మాట వినట్లేదని తల్లిదండ్రులు మందలించడంతో వారిద్దరు చిన్నారులు వెళ్లిపోయినట్టు తెలిసింది. ఇద్దరు పిల్లలు కనిపించకపోవడంతో నరేష్ అనే వ్యక్తి జీడిమెట్ల పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్ఐ నాయుడు కానిస్టేబుల్ నరేష్ సీసీ కెమెరాలు ద్వారా వారి యొక్క కదలికలను వారు ఎక్కడ వెళ్లారు వెరిఫై చేసి ఎర్లీ మార్నింగ్ కల్లా వారిని ట్రేస్ చేశారు. ఇద్దరు చిన్నారులు అమ్మాయి అలాగే అబ్బాయి వారిద్దరిని వారి యొక్క తల్లిదండ్రులకు అప్పగించారు. పిల్లల్ని అర్థమయ్యే రీతిలో వారికి అర్థమయ్యే రీతిలో సరిచేయాలని కోరారు. కొన్ని కొన్ని సందర్భాల్లో వారు తప్పుడు నిర్ణయాలు తీసుకునే అవకాశం ఇచ్చిన పిల్లలు కాబట్టి ఆ ఇలాంటి విషయంలో పిల్లలు మందలించాల్సి వస్తే కొంచెం జాగ్రత్తగా వివరించాల్సిందిగా తెలియజేస్తున్నాం. ఈ యొక్క కేసు చేతల్లో చాకచక్యంగా వ్యవహరించినటువంటి ఎస్సై నాయుడు , నరేష్ కానిస్టేబుల్ అభినందించారు.

# ఏపీలో అరాచకాలపై జాతీయ స్థాయి ఉద్యమం

**అమరావతి :** రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలపై జాతీయ స్థాయి ఉద్యమం చేయడానికి సిద్ధంగా ఉన్నామని శాసన మండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ వెల్లడించారు. సోమవారం విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడారు. జాతీయ ఉద్యమం కోసం వైఎస్ జగన్‌తో మాట్లాడి కార్యాచరణ ప్రకటిస్తామని పేర్కొన్నారు.చంద్రబాబు ప్రభుత్వం చట్టాలను చేతుల్లోకి తీసుకుని వైసీపీ నాయకులపై మూడ్రోజులుగా దుర్మార్గానికి పాల్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి అంబటి ఇల్లు దహనం, జోగి రమేష్ ఇంటిపై పెట్రోలు బాంబులు వేయడం దౌర్జన్య పాలనకు పరాకాష్ట అని విమర్శించారు. జరుగకూడని సంఘటన జరిగితే



అందుకు బాధ్యులెవరంటూ ప్రశ్నించారు. రాష్ట్రం మరో బిహార్ మాదిరిగా తయారవుతుందని ఆరోపించారు. శాంతి భద్రతల పర్యవేక్షణకు నియమించబడ్డ రాష్ట్ర డీజీపీ ఏం చేస్తున్నారని మండిపడ్డారు.చంద్రబాబు వద్ద ఉడుంగి పనికోసం కాదని అన్నారు.దాడులు ప్రోత్సహించి చంద్రబాబు అప్రతిష్ట మూటకట్టుకోవద్దని హితవు పలికారు. రాష్ట్రంలో ఏదో ఒక సమస్య వస్తే దానిని డైవర్ట్ చేయడానికి ప్రజలు ఇబ్బందులు పడేవిధంగా అనేక రకాలు కుట్రలు చేస్తారని ఆరోపించారు. రాష్ట్రంలో హింసకాండ జరిగితే బీజేపీ, జనసేనఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు.అంబటి రాంబాబు ఎప్పుడు లైన్ తప్పి మాట్లాడలేదని అన్నారు. కేంద్ర మంత్రి పౌరుషంగా మాట్లాడడంపై అభ్యంతరం సంపద సృష్టిస్తామని చెప్పి విశాఖలో

మంగళవారం, ఫిబ్రవరి 03, 2026 | హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి చుక్కెదురు



**ఢిల్లీ, ఫిబ్రవరి 2 :** సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి చుక్కెదురైంది. బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్త నల్లబాలుపై రాష్ట్ర హైకోర్టు తీర్పును తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ పిటిషన్‌ను సుప్రీం న్యాయస్థానం డిస్మిస్ చేసింది.సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్త నల్లబాలు పోస్టులు పెట్టారని పోలీసులు మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఈ కేసుపై గతంలో విచారణ చేపట్టిన రాష్ట్ర హైకోర్టు.. సదరు ఎఫ్ఐఆర్‌లను కొట్టివేస్తూ పలు మార్గదర్శకాలను జారీ చేసింది. సోషల్ మీడియా పోస్టులపై మెకానికల్‌గా కేసులు నమోదు చేయొద్దని పోలీసులకు సూచించింది. ఈ మార్గదర్శకాలు ఇబ్బందికరంగా ఉన్నాయని తెలంగాణ ప్రభుత్వ తరఫు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా గతంలో ప్రస్తావించారు. ఈ కేసును తాజాగా విచారించిన సుప్రీం న్యాయస్థానం.. హైకోర్టు తీర్పును అభినందిస్తున్నామని, మార్గదర్శకాలు ఇవ్వడంలో తప్పేమీలేదని స్పష్టం చేసింది.

# ప్రతీసారి నిర్మలమ్మ 'బడ్జెట్ చీరల'పై చర్చ పురుషులైతే ఏం చేస్తారు కేంద్రమంత్రి తీవ్ర అసహనం

**న్యూఢిల్లీ:** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్.. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ఆదివారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. చేతితో నేసిన తమిళనాడు కాంచీపురం సిల్క్ చీర కట్టుకుని సభకు వచ్చిన నిర్మలమ్మ.. బడ్జెట్?ను ప్రవేశపెట్టారు. ఈ నేపథ్యంలోనే బడ్జెట్ ప్రసంగం సమయంలో తన వస్త్రధారణపై మీడియా, సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న రకరకాల చర్చలపై కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రతీ సంవత్సరం బడ్జెట్‌ను పక్కన పెట్టి.. తన చీరలపైనే అందరికీ ఆసక్తి కలగడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు.వరుసగా 9వ ఏడాది బడ్జెట్‌ను ప్రవేశపెట్టి సరికొత్త రికార్డును సృష్టించిన నిర్మలా సీతారామన్.. తన చీరకట్టు గురించి జరుగుతున్న చర్చను తప్పుబట్టారు. ఇలా చేయడం మహిళా నేతల పట్ల ఉన్న లింగ వివక్షను చూపిస్తోందని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. మహిళల పనితీరు కంటే వారు కట్టుకునే చీరలు, వస్త్రధారణపై ఇలాంటి అవసర వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వృత్తిపరంగా మహిళలకు సమాన గౌరవం దక్కాలని ఆమె పిలుపునిచ్చారు. ఇక నుంచి తనకు ఇష్టం ఉన్న దుస్తులను



ధరిస్తానని ఆమె తేల్చి చెప్పారు.ఏటా కేంద్ర బడ్జెట్ సమయంలో తాను ఏ రకమైన చీర ధరిస్తాను అనే ప్రశ్న తనపై తీవ్ర ఒత్తిడికి గురి చేస్తోందని.. అదే ఒక పురుషుడు కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉంటే.. వారిని ఎప్పుడైనా ఇలాంటి ప్రశ్న అడిగారా.. మగవారి బట్టల గురించి కూడా ఇలాగే మాట్లాడుకునేవారా అని ప్రశ్నించారు. మగవారిని అడగరు కానీ.., మహిళల విషయంలో మాత్రం ఇది బడ్జెట్ సబ్జెక్టుగా మారిపోతోందని ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.వృత్తిపరంగా మహిళలను కూడా పురుషులతో సమానంగా చూడాలని ఆమె విజ్ఞప్తి చేశారు. తాను మహిళను కాబట్టి తనకు ప్రత్యేక రాయితీలు ఇవ్వాలని తాను కోరనని.. తన పనిలో తనకు ఉన్న ప్రతిభను చూపిస్తానని పేర్కొన్నారు. ఒక పురుషుడిని ఎలా గౌరవిస్తారో.. తనను కూడా అలాగే గౌరవించండి అని.. అప్పుడే నిజమైన సమానత్వం వస్తుందని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు.ఈ ఏడాది బడ్జెట్ సందర్భంగా కాంచీపురం చేనేత పట్టు చీరను ధరించిన నిర్మలా సీతారామన్.. సాంప్రదాయ ఎరుపు రంగు బహీ ఖాతా స్టైల్ పౌచ్‌లో డిజిటల్ బడ్జెట్ పత్రాలను లోక్‌సభకు తీసుకువచ్చారు. మరోవైపు.. తాజాగా ఫిబ్రవరి 1వ తేదీన బడ్జెట్ ప్రవేశపెట్టడం ద్వారా ఆమె వరుసగా 9 సార్లు బడ్జెట్ సమర్పించిన తొలి ఆర్థిక శాఖ మంత్రిగా రికార్డు సృష్టించారు.

# 700 కోట్ల అక్రమాస్తుల కేసు నిందితుడు బిక్రం సింగ్ మజితియాకు బెయిల్‌ద




**పంజాబ్:** దాదాపు రూ.700 కోట్ల అక్రమాస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న శిరోమణి అకాలీదల్ నేత బిక్రం సింగ్ మజితియాకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన సుప్రీం ధర్మాసనం సోమవారం బెయిల్‌పై ఆదేశాలు జారీ చేసింది. కేసు పూర్వాపరాలు, విచారణ తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని నిందితుడికి బెయిల్ మంజూరు చేస్తున్నట్లు సుప్రీం పేర్కొంది.నిందిత ుడు ఏడు నెలలుగా జైల్లోనే ఉన్నాడని, అక్రమాస్తులు కలిగి ఉన్న సమయం 2007-2017 అని, ఎఫ్ఐఆర్ నమోదైంది 2025లో అని.. అందువల్ల 2025 నాటి పీసీ యాక్ట్ ప్రకారం బెయిల్ ఇస్తున్నామని కోర్టు చెప్పింది. అక్రమాస్తుల కేసుకు సంబంధించి బిక్రం సింగ్‌పై సిట్ 2025 జూన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఆ వెంటనే అతడిని అమృత్ సర్‌లోని తన ఇంటి నుంచి పంజాబ్ విజిలెన్స్ బ్యూరో (వీబీ)కి చెందిన పోలీసులు అరెస్టు చేశారు. అప్పటినుంచి అతడు న్యూ నభా జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు. దీంతో బిక్రం సింగ్.. పంజాబ్, హరియాణా హైకోర్టులో గతంలోనే బెయిల్ పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై విచారణ జరిపిన కోర్టు ఈ బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది. తర్వాత అతడు సుప్రీంకోర్టును ఆశ్రయించగా బెయిల్ మంజూరు చేసింది.మరోవైపు ఈ కేసులో సప్లిమెంటరీ ఫైల్స్‌తోకలిపి 40,000 పేజీల చార్జిషీటు దాఖలు చేశారు. పంజాబ్‌కు చెందిన మజితియా శిరోమణి అకాళిదల్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి, క్యాబినెట్ మంత్రిగా కూడా పని చేశారు. ఈ సమయంలో ఆయన అవినీతికి పాల్పడ్డాడనే ఆరోపణలొచ్చాయి. 2007-2017 మధ్య కాలంలో ఆయన, అతడి భార్య కలిపి వందల కోట్ల అవినీతికి పాల్పడ్డాడనే ఆరోపణలు రావడంతో పంజాబ్ విజిలెన్స్ రంగంలోకి దిగి విచారణ జరుపుతోంది.

# ఆర్మీ మాజీ చీఫ్ పుస్తకంలోని అంశాన్ని ప్రస్తావించిన రాహుల్.. రాజ్‌నాథ్, అమిత్‌షా అభ్యంతరం

**న్యూఢిల్లీ:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా సోమవారం ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డోక్లామ్ అంశాన్ని ప్రస్తావించడంతో గందరగోళం నెలకుంది. ఆర్మీ మాజీ చీఫ్ ముకుంద్ నరవాణే రాసిన పుస్తకంలోని ఓ వ్యాక్యాన్ని రాహుల్ గాంధీ ప్రస్తావించడంపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం వ్యక్తం చేశారు. రాహుల్ చెప్పిన పుస్తకం ఎక్కడుంది అని స్పీకర్ ప్రశ్నించారు. రూల్స్ అతిక్రమించవద్దని, పుస్తకం ప్రామాణికత చెప్పాలని పేర్కొన్నారు. సభలో పేపర్ కటింగ్స్, ప్లకార్డులు, ఫ్లెక్సీలు ప్రదర్శించడం నిషేధమని స్పీకర్ వ్యాఖ్యానించారు. సబ్జెక్ట్ మాట్లాడాలంటూ రాహుల్ గాంధీ మైక్ కట్ చేయడంతో కాంగ్రెస్ సహా ప్రతిపక్ష ఎంపీలు తమ సీట్ల నుంచి లేచి నిరసన తెలిపారు.కేంద్రం నుంచి ఏదో ఒక సమాధానం వస్తుందనే తాను ఈ అంశాన్ని ప్రస్తావించనని రాహుల్ గాంధీ తెలిపారు. ఈ సందర్భంగా పుస్తకం ప్రామాణికత ఏంటో చెప్పాలని స్పీకర్ ప్రశ్నించగా.. ఆ పుస్తకాన్ని విడుదల చేయకుండా అడ్డుకున్నారని



రాహుల్ గాంధీ ఆరోపించారు. దీంతో స్పీకర్, రాహుల్ గాంధీ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.రాహుల్ గాంధీ మాత్రం 'వారిని అంతగా భయపెడుతున్నది అందులో ఏముంది? ఒకవేళ భయపడకపోతే, నన్ను చదవడానికి అనుమతించాలి' అన్నారు.రాహుల్ మాట్లాడుతుండగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జోక్యం చేసుకున్నారు. ' లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు (రాహుల్ గాంధీ) ఉటంకిస్తున్న పుస్తకాన్ని సభ ముందు ఉంచాలని నేను కోరుకుంటున్నాను, ఎందుకంటే ఆయన ప్రస్తావిస్తున్న ఆ పుస్తకం ఇంకా ప్రచురితం కాలేదు' అని అన్నారు. అయితే, సభలో పేపర్లు, పుస్తకాలు చదవద్దు అంటూ అధికార పక్షం అభ్యంతరం వ్యక్తం చేసింది.రాహుల్ గాంధీకి మద్దతుగా ప్రతిపక్ష పార్టీ ఎంపీలు గళమెత్తారు. సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ స్పందిస్తూ.. 'చైనాకు సంబంధించిన ఈ అంశం చాలా సున్నితమైంది.. లోక్‌సభలో ప్రతిపక్ష నేతను మాట్లాడటానికి అనుమతించాలి' అని కోరారు. రాహుల్ గాంధీ పదేపదే 'చైనీస్ ట్యాంకులు' అనే పదాన్ని పలకడాన్ని సభలోని దాదాపు ప్రతి బీజేపీ నాయకుడు వ్యతిరేకించారు.

# పాకిస్తాన్ నుంచి వచ్చిన దళితులకు ఇండ్లు ఇవ్వాల్సిందే



**న్యూఢిల్లీ:** పాకిస్తాన్ నుంచి వలస వచ్చి, ఇక్కడే ఉండిపోయిన హిందూ దళితులకు ప్రభుత్వం ఇండ్లు ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు కేంద్రానికి ఆదేశాలు జారీ చేసింది. పాకిస్తాన్ నుంచి కొంతకాలం క్రితం వలస వచ్చిన దళిత హిందువులు ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో తాత్కాలికంగా నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు.ముఖ్యంగా మజ్ను కా తిలా ప్రాంతంలోని, సిగ్నేచర్ బ్రిడ్జి వద్ద ఎక్కువగా నివసిస్తున్నారు. అయితే, వీరి నివాసాలను తొలగించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఆక్రమణల పేరుతో తొలగించేందుకు ప్రయత్నిస్తుండటంతో నిత్యం భయంతో బతుకుతున్నారు. ఈ నేపథ్యంలో వీరికి భారత ప్రభుత్వం పౌరసత్వం కల్పించడంతోపాటు, ఇండ్లు మంజూరు చేసేలా ఆదేశించాలని కోరుతూ సుప్రీంలో పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై విచారణ జరిపిన కోర్టు తాజాగా కీలక ఆదేశాలిచ్చింది. జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్ కోటేశ్వర్ సింగ్ ఆధ్వర్యంలోని బెంచ్ సోమవారం ఈ వ్యాఖ్యలు చేసింది. పాక్ నుంచి వచ్చిన హిందూ దళితులకు కేవలం భారత పౌరసత్వం ఇస్తే సరిపోదని, గౌరవంగా బతికేలా ఇండ్లు కూడా ఇవ్వాలని కేంద్రాన్ని ఆదేశించింది. అలాగే, ఇతర పునరావాస చర్యలకు కూడా కోర్టు ఆదేశించింది.దీనికి సంబంధించి నాలుగు వారాల్లోగా సమాధానం తెలపాలని సూచించింది. అలాగే, ఆక్రమణల తొలగింపు లేదా అభివృద్ధి పనుల కోసం నివాసాల్ని తొలగిస్తే దళితులు ఇబ్బంది పడతారని కోర్టు అభిప్రాయపడింది. వీరి నివాసాల తొలగింపును ఆపేయాలని సూచించింది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 250 కుటుంబాలు పాక్ నుంచి వచ్చి జీవిస్తున్నాయి. దాదాపు వెయ్యి మంది వరకు దళితులు ఉంటారని అంచనా. కొన్నేళ్లుగా ఉంటున్న వీరికి సరైన జీవన భద్రత లేకుండా పోయింది.

# 'మహా డిప్యూటీ సీఎం పదవి వెనుక బీజేపీ 'మాస్టర్ మైండ్'- అజిత్ మరణం తర్వాత సునేత్ర ప్రమాణం రెండో షాక్'

**మహారాష్ట్ర :** దివంగత అజిత్ పవార్ సతీమణి సునేత్రా పవార్‌ను హుటాహుటిన మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా చేయడంపై శివసేన (ఉద్ధవ్) పత్రిక 'సామ్నా' సంచలన ఎడిటోరియల్‌ను ప్రచురించింది. అనూహ్య పరిణామం వెనుక పలువురు బీజేపీ అగ్రనేతల పాత్ర ఉందని సామ్నా ఆరోపించింది. అజిత్ పవార్ చితాగ్ని చల్లారక ముందే, సునేత్రా పవార్‌ను ముంబయికి పిలిపించి ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించారని తెలిపింది. అజిత్ పవార్ విమాన ప్రమాదం అనేది మొదటి షాక్ కాగా, అకస్మాత్తుగా సునేత్రా పవార్ డిప్యూటీ సీఎం కావడం రెండో షాక్ అని పేర్కొంది.సునేత్రను డిప్యూటీ సీఎంగా చేయాలనే నిర్ణయం వెనుక కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్‌ల ప్రధాన పాత్ర ఉందని సామ్నా ఆరోపించింది. వ్యక్తిగత పాలనా అనుభవం వల్ల సునేత్రా పవార్‌కు డిప్యూటీ సీఎం పదవి లభించలేదని, కేవలం బీజేపీ అగ్రనేతల రాజకీయ యుక్తుల్లో భాగంగానే ఇదంతా జరిగిందని ఎడిటోరియల్‌లో ప్రస్తావించారు. మహారాష్ట్ర తొలి మహిళా డిప్యూటీ సీఎం నియామకంపై రాష్ట్ర ప్రజల్లో మిశ్రమ అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయని సామ్నా తెలిపింది. ఒక మహిళా నాయకురాలికి ఈ పదవి లభించడంపై కొందరు హర్షం వ్యక్తం చేస్తుంటే, రాజకీయ సమీకరణాల్లో భాగంగానే సునేత్రా పవార్‌కు ఈ ఛాన్స్ ఇచ్చారని ఇంకొందరు అనుకుంటున్నారని పేర్కొంది. ఇంతకీ అజిత్ పవార్ సతీమణికి ఈ అవకాశాన్ని ఎవరు ఇప్పించారు అనే ప్రశ్న కూడా యావత్ మహారాష్ట్ర ప్రజానీకం ఎదుట నిలిచి ఉందని తెలిపింది.బంధువులకు చెప్పకుండానే ప్రమాణం చేశారా?'సునేత్రా పవార్‌కు డిప్యూటీ సీఎం పదవి లభించబోతోంది అనే సమాచారం చివరి నిమిషం దాకా తమకూ తెలియదని ఎన్‌సీపీ(ఎస్‌పీ) అగ్రనేతలు శరద్ పవార్, సుప్రియా సూలే అంటున్నారు. అజిత్ పవార్ ఎన్‌సీపీని



ఇప్పుడు ప్రఫుల్ పటేల్, సునీల్ తత్కారే లాంటి నేతలు నడిపిస్తున్నారని వారు చెబుతున్నారు. రాజకీయ పార్టీలు వేర్వేరు అయినా శరద్ పవార్, అజిత్ పవార్ కుటుంబాలకు బంధుత్వం ఉంది. కనీసం తన సమీప బంధువుల్లోనూ ఎవరికీ చెప్పకుండానే ముంబయికి వచ్చి సునేత్రా పవార్ డిప్యూటీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారా? ఇలాంటి తుచ్ఛ రాజకీయాలను బీజేపీ అగ్రనేతలే చేయిస్తుంటారు. శరద్ పవార్, సుప్రియా సూలే చేసిన వ్యాఖ్యలను బట్టి, ఉద్దేశపూర్వకంగానే బంధువులకు సమాచారాన్ని ఇవ్వకుండా సునేత్రా పవార్, ఆమె ఇద్దరు కుమారులు ముంబయిలోని రాజ్ భవన్‌కు వచ్చి ప్రమాణ స్వీకారం చేసి ఉంటారు. రాజకీయాల్లో విలువలు దారుణంగా పతనమైన తీరుకు ఈ పరిణామం ఒక నిదర్శనం' అని సామ్నా కథనంలో ప్రస్తావించారు.సూతక కాలం గడవక ముందే ప్రమాణం చేశారెందుకు?'కుటుంబీకులు ఎవరైనా చనిపోతే కనీసం 13 రోజుల పాటు సూతక కాలాన్ని పాటించాలి అనేది హిందువుల విశ్వాసం. కానీ ఇందుకు పూర్తి విరుద్ధంగా భర్త అజిత్ పవార్ చనిపోయిన మరుసటి రోజే సునేత్రా పవార్ ముంబయికి వెళ్లి డిప్యూటీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. అది కూడా సమీప బంధువులకు చెప్పకుండా. సనాతన ధర్మం గురించి నిత్యం మాట్లాడే బీజేపీతో అజిత్ పవార్ ఎన్‌సీపీ పార్టీ పొత్తు పెట్టుకుంది. మరి కనీసం సూతక కాల నియమాన్ని పాటించకుంటే ఎలా? ఇది హిందుత్వ విశ్వాసాలకు విరుద్ధమైన చర్య' అని సామ్నా ఎడిటోరియల్‌లో ప్రశ్నను సంధించారు.'పటేల్' పార్టీగా ఎన్‌సీపీ మారకుండా అడ్డుకునేందుకే ఈ ప్లాన్'అజిత్ పవార్ చనిపోయాక ఎన్‌సీపీ పగ్గాలను సునేత్రా పవార్ చేపట్టారని ఆ పార్టీ నేత హసన్ ముష్రిఫ్ అంటున్నారు. ఇకపై ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ శ్రేణులంతా ఆమె సారథ్యంలోనే పనిచేస్తారని ముష్రిఫ్ చెబుతున్నారు. ఇదంతా వినడానికి బాగానే ఉన్నప్పటికీ, డిప్యూటీ సీఎంగా ప్రమాణ స్వీకారంపై సునేత్రా పవార్ ఎన్‌సీపీలోనూ ఎవ్వరికీ ఎందుకు సమాచారాన్ని ఇవ్వలేదు అనేది తెలియరావడం లేదు. సూతక కాలం పూర్తి కాక ముందే ఆమె ప్రమాణ స్వీకారం చేయాల్సిన అవసరం ఏమొచ్చింది ? బహుశా ప్రఫుల్ పటేల్, సునీల్ తత్కారే లాంటి నేతలు ఎన్‌సీపీపై పట్టును సాధించకుండా అడ్డుకునేందుకే సునేత్రా పవార్ ఇలా చేసి ఉంటారని అనిపిస్తోంది. ఈ ఏడాది జిల్లా పరిషత్ ఎన్నికలు ముగిసిన వెంటనే తన పార్టీని శరద్ పవార్ ఎన్‌సీపీలో కలిపేయాలని అజిత్ పవార్ భావించారు. కానీ ఈ విలీన ప్రతిపాదన అజిత్ పవార్ ఎన్‌సీపీ నేతలు ప్రఫుల్ పటేల్, సునీల్ తత్కారేలకు ఇష్టం లేదు. మొత్తం మీద జిల్లా పరిషత్ ఎన్నికల కంటే ముందే అజిత్ చనిపోయారు. ఈనేపథ్యంలో 'పవార్ - పటేల్' పార్టీ (ఎన్‌సీపీ) కాస్తా, 'పటేల్' పార్టీగా మారకుండా అడ్డుకునేందుకు, అమిత్‌షా, దేవేంద్ర ఫడ్నవిస్ లాంటి బీజేపీ అగ్రనేతలు చొరవ చూపి సునేత్రతో డిప్యూటీ సీఎంగా ప్రమాణం చేయించి ఉంటారు' అని సామ్నా విశ్లేషించింది.

# బంగ్లాదేశ్‌లో బందీగా ఉన్న ఏపీ మత్స్యకారుల విడుదల



**అమరావతి :** సరిహద్దు దాటారనే ఆరోపణలతో గత ఆరు నెలలుగా బంగ్లాదేశ్ జైలులో ఉన్న ఏపీ మత్స్యకారులు విడుదలై సురక్షితంగా స్వదేశానికి చేరుకున్నారు. గత అక్టోబర్‌లో తొమ్మిది మంది మత్స్యకారులు వేటకు వెళ్లి బంగ్లాదేశ్ సరిహద్దు దాటారు. దీంతో అక్కడి నేవీ అధికారులు వారిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి బాగర్‌హాట్ జైలుకు పంపారు.బాధిత కుటుంబ సభ్యుల వినతుల మేరకు భారత దౌత్య అధికారులు బంగ్లాదేశ్ ప్రభుత్వంతో సంప్రదిపులు జరిపారు. ఎట్టకేలాగు ఇరుదేశాల అధికారుల సంప్రదింపుల అనంతరం ఇండియన్ కోస్ట్‌గార్డ్ పర్యవేక్షణలో మత్స్య కారులను విశాఖకు తరలించి స్థానిక పోలీసులకు అప్పగించారు. బంగ్లా బందీలో మత్స్యకారులను విడిపించినందుకు భారత ప్రభుత్వానికి బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

# ఉపాధి హామీ చట్టంలో ఉపాధికి గ్యారంటీ- కొత్త చట్టంలో అధికార కేంద్రీకరణకు గ్యారంటీ:

**న్యూఢిల్లీ:** మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంఎన్ఆర్ఈజీఏ) ఉపాధికి గ్యారంటీ ఇస్తే, దాని స్థానంలో మోదీ సర్కారు తెచ్చిన కొత్త చట్టం అధికార కేంద్రీకరణకే గ్యారంటీ ఇస్తోందని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు. ఉపాధి హామీ చట్టం లక్ష్యాలకు తూట్లు పొడిచేలా 'వికసిత్ భారత్ - గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ చట్టం- 2025' ఉందని ఆయన ఆరోపించారు. నేటికి (ఫిబ్రవరి 2) సరిగ్గా 20 ఏళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్ జిల్లా బద్నాపల్లి గ్రామంలో ప్రారంభమైన ఉపాధిహామీ పథకం విప్లవాత్మకమైందన్నారు. తొలి ఉపాధి హామీ కార్డును ఆ ఊరికి చెందిన దళిత మహిళ చీమల పెద్దక్క అందుకుందని జైరాం రమేశ్ తెలిపారు. ఈమేరకు సోమవారం



ఎక్స్ వేదికగా ఒక ట్వీట్ చేశారు.పని దినాల కేటాయింపు కేంద్రం చేతిలోకి'ఇకపై దేశంలోని ఏయే జిల్లాలకు ఎన్నెన్ని ఉపాధి హామీ పని దినాలను కేటాయించాలి అనేది ఢిల్లీలోని మోదీ సర్కారే డిసైడ్ చేస్తుంది. ప్రజల డిమాండ్‌ను, అవసరాలను ఈ సర్కారు పట్టించుకోదు. కేవలం కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులకు అనుగుణంగా పనిదినాలను కల్పిస్తారు. వ్యవసాయ సీజన్‌లోని దాదాపు రెండు నెలల పాటు ఈ స్కీం అమల్లో ఉండదు. ఇది ఎంతోమంది గ్రామీణ నిరుపేదలకు బ్యాడ్ పనులు చేసినా, న్యాయమైన వేతనాలను అడిగి తీసుకునే పరిస్థితి ఉండదు. ఇకపై ఉపాధి హామీ పథకంలో గ్రామ పంచాయతీల పాత్ర కూడా ఉండదు. నేరుగా మోదీ సర్కారే అన్నీ నిర్ణయిస్తుంది. రాష్ట్రాలు ఇక నుంచి ఈ పథకం ఖర్చుల్లోని 40 శాతం భాగాన్ని భరించాల్సి ఉంటుంది. చాలా రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి బాగా లేదు. కొన్ని రాష్ట్రాలు ఈ 40 శాతం నిధులను ఇవ్వడం ఆపేసే ముప్పు సైతం ఉంది' అని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

# మసిపూసి మారేడుకాయ !

మసిపూసి మారేడుకాయ చేయడమంటే ఇదే. దేశంలో ప్రజల ఆకలిబాధలను, పరిస్థితులను,రోదనలను పట్టించుకోకుండా బడ్జెట్ యధావిధిగా ప్రవేశ పెట్టారు. గత 9 ఏళ్లుగా నిర్మలా సీతారామన్ బడ్జెట్ వల్ల దేశంలో మార్పులు ఏమైనా వచ్చాయా అని చర్చిస్తే..వచ్చాయనే చెప్పాలి. దేశంలో ఆర్థిక మందగమనం సాగుతోంది. ప్రజల కొనుగోలు శక్తి తగ్గింధి. నిత్యాసవర వస్తువులతో పాటు అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగాయి. ముఖ్యంగా ఔషధాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కోవిడ్ తరవాత ధరలను పరిశీలిస్తే 200 నుంచి 500 శాతం వరకు ఔషధాల ధరలు పెరిగాయి. సామాన్యునులు వైద్యం చేయించుకునే మాటెలా ఉన్నా..మందులు కొనుక్కుని వేసుకునే దిక్కులేకుండా పోయింది. మరి బడ్జెట్ ప్రగతిశీలమైతే ఇవన్నీ ప్రభావం చూపాలి. చూపడం లేదంటే బడ్జెట్‌తో ప్రజలకు ఒరిగిందేమీ లేదని గుర్తించాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మార్పురావడం లేదు. ప్రజల చేతుల్లో డబ్బులు ఆడడం లేదు. సంపాదించింది తిండికి కూడా సరిపోవడం లేదు. ఇలా నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మరోసారి సామాన్యులను నిజంగానే వంచించింది. ఒకదాని తరువాత ఒకటిగా చోటుచేసుకుంటున్న అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలంటూ ఆర్థిక సర్వే చేసిన హెచ్చరికలను సైతం బేఖాతరు చేసింది. కొద్దిమంది కోటీశ్వరుల ప్రయోజనాలను రక్షించేదిగా మాత్రమే బడ్జెట్ ఉంది. వరుసగా తొమ్మిదవసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తన ప్రసంగంలోఘనంగా చెప్పిన 'సంస్కరణల ఎక్స్‌ప్రెస్' నిర్దాక్షిణ్యంగా సగటుజీవి పైనుండి దూసుకెళ్ళింది. ఫలితం 53,47,315 కోట్ల రూపాయల బడ్జెట్ సామాన్యులను ప్రమాదంలోకి నెట్టింది. కార్పొరేట్లకు, కోటీశ్వరులకు రాయితీలు, వరాల వర్షం కురిపించి నప్పుడు గుర్తుకురాని ఆర్థిక క్రమశిక్షణ కార్మికులకు, రైతులకు, వ్యవసాయ కూలీలకు, మధ్య తరగతి ప్రజానీకానికి మాత్రం గుర్తు చేశారు. దేశంలోని కోటానుకోట్ల జనానికి మేలు చేసేదిలా బడ్జెట్ లేదన్నది ముమ్మాటికీ నిజం. ప్రతిపక్ష సభ్యులు మొదలు, ఆర్థిక సంస్కరణ అభిలాషులు సైతం దీనిని అంగీకరిం చారు. ఫలితంగా వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం ఇలా ఒకటేమిటిఅన్ని రంగాల సాధారణ ప్రజానీకానికి సంబంధించిన పథకాల కేటాయింపుల్లో కోతలు పడ్డాయి. చివరికి, మహిళా సంక్షేమం, అభివృద్ధి కోసం కేటాయించే 'జెండర్ బ్జడెట్'కూ నిధులలోనూ కోత పెట్టడం మోడీ సర్కారు తీరుకు నిదర్శనం. దీంతో రానున్న రోజుల్లోనూ నిరుద్యోగం, అధికధరలు, జీవన వ్యయాలు పెరగడం, ఉపాధి కోత వంటి కష్టాలు తప్పవన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. కేంద్రబడ్జెట్‌లో సామాన్యులకు నేరుగా ప్రయోజనం కల్పించే చర్యలు పెద్దగా లేవు. గత ఏడాదిలో ఆదాయ పన్ను, జీఎస్టీల్లో భారీ కోతలతో ఉపశమనం కల్పించిన ప్రభుత్వం ఈసారి వాటి జోలికి వెళ్లలేదు. అయితే పలు విభాగాల్లో మినహాయింపు లను ఇవ్వడం ద్వారా పరోక్షంగా సాయం చేసేందుకు ప్రయత్నించినట్లు చెప్పుకుంది. అయితే అది ఏమేర ప్రతిఫలిస్తుందన్నది చూడాలి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బ్జడెట్‌లో.. మధ్య తరగతి వారు, చిన్న ఇన్వెస్టర్లకు పలు అంశాల్లో మినహాయింపులను ప్రకటించారు. వ్యవసాయం, విద్య, చిన్న పరిశ్రమలు, ఆరోగ్య రంగం,, ÷నాన్షియల్ మార్కెట్లు, ఐటీ రంగం, రవాణా మౌలిక వసతులు, పర్యాటకం, క్రీడా రంగాల ద్వారా సామాన్యులకు పరోక్షంగా ప్రయోజనం కల్పించే చర్యలను మంత్రి వెల్లడించారు. పోటీతత్వం పెంచడంతోనే ఆర్థికవృద్ధిని వేగవంతం చేయగలమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఉత్పాదకతను, పోటీతత్వాన్ని పెంచడం ద్వారా నిలకడగల ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం, వారి సామర్థ్యాలను మెరుగుపరచడం, ప్రతి కుటుంబం, సమాజం, ప్రాంతం వృద్ధికి వనరులు, అవకాశాలను పొందేలా చూడటం అనే మూడు 'కర్తవ్యాలు'ను ప్రభుత్వం చేపట్టిందని మంత్రి పేర్కొన్నా.. గత 9 ఏళ్లుగా ఇవేమీ కనిపించడం లేదు. ఏటా కొత్తకొత్త ప్రకటనలతో మభ్య పెట్టడం సాధ్యం కాదని పాలకుల తెలుసుకుంటే మంచిది. ఈ కర్తవ్యాలను సక్రమంగా నెరవేర్చడానికి సంస్కరణల ఎక్స్‌ప్రెస్ వేగంగా ముందుకు సాగుతుందని వ్యాఖ్యానించారు. గత 12ఏళ్ళుగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ఫలితమే ఈనాటి అనిశ్చిత పరిస్థితుల్లో కూడా నిలకడగల వృద్ధిని, ఆర్థిక సుస్థిరతను సాధించగలిగామని నిర్మలమ్మ చెప్పుకున్నారు. అయితే ఈ లెక్కలు దేనిని బేరీజు వేసుకుని చెప్పారన్నది అర్థం కావడం లేదు. గ్రామాలకు వెళితే ప్రజల జీవన పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలుస్తాయి. వారికి ఇంకా ఉచిత బియ్యం అందిస్తున్నామంటే, వారి అర్థిక పరిస్థితిని గమనించవచ్చు. రైతులు ధాన్యం పండిస్తున్నా గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. తిండి గింజలు కొనుక్కోలేక సామాన్యులు విలవిల్లాడుతున్నారు. అయితే కేన్సర్ పేషెంట్లకు ఊరట కలిగించేలా కీలక నిర్ణయం తీసుకున్నారు. కేన్సర్ చికిత్స కోసం విదేశాల నుంచి దిగుమతి చేసుకునే అత్యావశ్యక ఔషధాలపై దిగుమతి సుంకాన్ని మినహాయిస్తారు. దీనిలో భాగంగా 17 రకాల ఔషధాలు ధరలు తగ్గుతాయి. అరుదైన వ్యాధుల చికిత్సకు ఉపయోగించే మరో ఏడు కీలక ఔషధాలపై కూడా దిగుమతి సుంకాలు తగ్గుతాయి. కేన్సర్ చికిత్సలో వాడే మందులు, ఇతర ఔషధాలు, ఆహార పదార్థాలు, పరికరాలపై కూడా సుంకాలు తగ్గుతాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ఆకళింపు చేసుకోకుండా ఎన్ని బడ్జెట్లు ప్రవేశ పెట్టినా భారత పురోగతి కాగితాలకే పరిమితం అవుతుంది.




# మరింతగా దిగివస్తున్న బంగారం ధరలు

**24 క్యారెట్ల బంగారం ధర రూ.1,51,530కి చేరిక**

**22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,38,900**

**రూ.3 లక్షలకు చేరుకున్న కిలో వెండి ధర**

**హైదరాబాద్,ఫిబ్రవరి2:** బంగారం, వెండి ధరలు పెట్టుబడిదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఇటీవలి కాలంలో భారీగా పెరిగిన వెండి, బంగారం ధరలు గత నాలుగైదు రోజులుగా అంతే స్థాయిలో పతనమవుతున్నాయి. ఆల్ టైమ్ గరిష్టానికి చేరుకున్న బంగారం, వెండి ధరల్లో భారీగా లాభాల స్వీకరణ జరుగుతుండడమే దీనికి కారణంగా కనిపిస్తోంది. కొనుగోలుదారులకు ఆనందాన్ని కలిగించకున్నా కొంతమేర దిగివస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి సోమవారం ఉదయం 9:30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,51,530కి చేరింది. నిన్నటి ధరతో పోల్చుకుంటే ఏకంగా 9,050 రూపాయలు తగ్గింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,38,900కి చేరింది. నిన్నటి ధరతో పోల్చుకుంటే 8,300 రూపాయలు తగ్గింది. ఇక, దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ.1,51,680కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ.1,39,050కి చేరుకుంది.మరోవైపు ఇటీవల భారీగా పెరిగిన వెండి కూడా వేగంగా పతనమవుతోంది. ఐదు రోజుల క్రితం రూ.4.25 లక్షలకు చేరిన కిలో వెండి కొద్ది రోజుల్లోనే తిరిగి రూ.3 లక్షలకు చేరుకుంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే కిలోకు రూ.50 వేల మేర తగ్గింది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.3 లక్షలుగా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో కూడా కిలో వెండి ధర రూ.3 లక్షలుగా ఉంది.




# బలూచీ ఆత్మాహుతి దాడిలో 50మది మృతి

**• ఇద్దరు మహిళా ఆత్మాహుతి బాంబర్లు పాల్గొన్నట్లు గుర్తింపు**



**ఇస్లామాబాద్,ఫిబ్రవరి2:** పాకిస్థాన్‌లోని బలోచిస్థాన్ ప్రావిన్సులో నరమేధం కొనసాగుతోంది. పాక్ సైన్యం చేపట్టిన ఆపరేషన్‌కు వ్యతిరేకంగా ఆత్మహుతి దాడులు సాగుతున్నాయి. దీంతో ఇప్పటికే వందల్లో మృతి చెందారు. బలూచిలోని 12 వేర్వేరు ప్రాంతాల్లో పెద్దఎత్తున జరుగుతోన్న దాడులకు బాధ్యత వహిస్తూ.. బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ప్రకటన వెలువరించింది. పాక్ దళాలపై దాడి చేసింది తమ విభాగానికి చెందిన ఇద్దరు మహిళా ఆత్మాహుతి బాంబర్లేనని వెల్లడించింది. వీరిలో 24 ఏళ్ల ఆసిఫా మెంగల్ అనే యువతి చేసిన దాడిలో పాక్ సిబ్బంది సహా 50 మంది మృతి చెందినట్లు తెలిపింది. మరో ఆత్మాహుతి బాంబర్ దాడిలోనూ అనేకమంది ప్రాణాలు కోల్పోయినట్లు పేర్కొంది. అయితే ఆ బాంబర్ పేరును మాత్రం వెల్లడించలేదు. బలోచిస్థాన్ అంతటా భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకొని 'హీరోఫ్' పేరుతో రెండో దశ ఆపరేషన్‌ను ప్రారంభించనున్నట్లు బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ఆదివారం పేర్కొంది. ఈ విషయంపై పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ.. ఆత్మాహుతి దాడుల్లో ఇద్దరు మహిళా నేరస్థులు పాల్గొన్నట్లు గుర్తించామన్నారు. ఈ దాడులపై బలోచిస్థాన్ ముఖ్యమంత్రి సర్ఫరాజ్ బుగతీ స్పందించారు. పాకిస్థాన్ భద్రతా దళాలు 40 గంటలుగా ఉగ్రవాద ఏరివేత చర్యలు కొనసాగిస్తున్నాయని.. ఇందులోభాగంగా ఇప్పటివరకు 140 మందికి పైగా వేర్పాటువాదులను మట్టుబెట్టాయని వెల్లడించారు. స్థానిక పౌరుల వేషధారణలో ఉన్న బలోచ్ రెబల్స్ పాఠశాలలు, బ్యాంకులు, మార్కెట్లు, ఆసుపత్రులలోకి ప్రవేశించి కాల్పులకు తెగబడుతున్నారని పాక్ మిలిటరీ తెలిపింది. ఏదైనా నగరం లేదా వ్యూహాత్మక స్థావరాన్ని స్వాధీనం చేసుకోవడానికి బలోచ్ రెబల్స్ ప్రయత్నాలు చేస్తున్నాయని.. అయితే వాటిని తమ దళాలు సమర్థవంతంగా తిప్పికొడుతున్నాయని పేర్కొంది.



# చీరల గురించి కాదు..బడ్జెట్‌పై చర్చించండి

**• సోషల్ మీడియా వార్తలపై నిర్మలమ్మ అసహనం**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి2:** ఏటా బడ్జెట్ వేళ ఆర్థిక కేటాయింపుల పైనే కాకుండా.. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ధరించే చీరల పైనా అందరి దృష్టి ఉంటుంది. ఎందుకంటే ఆమె చేనేతకు సంబంధించిన ప్రత్యేకించిన చీరలను ధరిస్తారు. అలాగే ఎంతో హుందాగా దర్శనమిస్తారు. ఈ సందర్భంగా ఏటా ఆమె ధరించే చీరలపై చర్చ సాగుతూనే ఉంటుంది. దేశ సంస్కృతీ సంప్రదాయాల్ని ప్రతిబింబించేలా ఆమె ఎంచుకునే చీరల పైనా చర్చలు జరుగుతాయి. ప్రతి ఏడాది బడ్జెట్ సమయంలో తన చీరలపై జరుగుతోన్న చర్చలపై ఆర్థికమంత్రి అసహనం వ్యక్తంచేశారు. ప్రతి సంవత్సరం బడ్జెట్రోజు నేను ఏం ధరించబోతున్నా ననే ప్రశ్నలు నాకు ఒత్తిడిగా మారుతున్నాయన్నారు. 'ఎందుకు ఇలా ప్రశ్నలతో వేధిస్తున్నారు ఒకవేళ బ్జడెట్ ప్రవేశపెట్టేది పురుష మంత్రులైతే వారిని కూడా ఇలాగే వారి దుస్తుల గురించి అడిగేవారా నేను ధరించే చీరను కూడా బ్జడెట్‌లో ఒక అంశంలా మార్చేస్తున్నారు' అంటూ సీతారామన్ అసహనం వ్యక్తంచేశారు.బడ్జెట్లో ఉన్న అంశాలు ఏమిటి అనే విషయాలను తెలుసుకోవడంపై ప్రజలు దృష్టి పెట్టాలని.. తన చీరలపై కాదని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. ఇటువంటి అనవసర విషయాల గురించి ఆలోచించడం వల్ల ముఖ్యమైన విషయాలపై పట్టు కోల్పోతామన్నారు. కాగా ఆదివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ వేళ ఆమె కాంచీపురం చీరలో కన్పించారు. బంగారు, కాఫీ వర్ణం అంచుతో ఉన్న మెజెంటా రంగు చీర, గోల్డెన్ కలర్ బ్లౌజ్, శాలువాతో కన్పించారు. అది తమిళనాడు నేపథ్యం ఉన్న చీర. కొన్ని నెలల్లో ఆ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.. ఆమె కాంచీపురం చీరను ఎంచుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీనిపై నెట్టింట చర్చ జరుగుతోన్న సమయంలో నిర్మలా సీతారామన్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం



మంగళవారం, ఫిబ్రవరి 03, 2026

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



## ఈ టెక్నిక్స్ తెలిస్తే చాలు - మీ పని టైంకి పూర్తవుతుందట!



అనుకున్న పనులు సమయానికి పూర్తి కావాలంటే టైం మేనేజ్మెంట్ చాలా ముఖ్యం. దీన్ని పట్టించుకోకపోతే పనులన్నీ గందర గోళంగా, అసంపూర్తిగా ఉంటాయి. అందుకే, సమయపాలనలో ఉన్న కొన్ని టెక్నిక్స్‌ను సందర్భానుసారం పాటించాలం టున్నారు నిపుణులు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!50-10 రూల్ : ఏదైనా పని మొదలుపెట్టినప్పుడు 50 నిమిషాలపాటు ఎలాంటి అవరోధాలూ లేకుండా ఏకాగ్రతతో పనిచేయాలంటున్నారు నిపుణులు. ఆ తర్వాత 10 నిమిషాలు బ్రేక్ తీసుకోవాలని చెబుతున్నారు. ఈ సమయంలో చిన్న పాటి వ్యాయామం, నడక, ధ్యానం వంటివి చేస్తే శరీరం తిరిగి పుంజుకొని మళ్లీ పనిలో నిమగ్నమవడానికి వీలవుతుందని పేర్కొంటున్నారు.మినిట్స్ రూల్ : ఇంట్లో అయినా, ఆఫీస్‌లో అయినా 2 నిమిషాల్లో పూర్తయ్యే పనులను వెంటనే చేయడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. చిన్నవే కదా తర్వాత చేద్దామనుకుంటే ఆయా పనులు పెండింగ్‌లో ఉంటాయని చెబుతున్నారు. ఆ తర్వాత అవే గుదిబండగా మారే అవకాశముందని తెలియజేస్తున్నారు.

80-20 రూల్ : మీరు చేసే పనుల్లో అతి ముఖ్యమైనవి, ఎక్కువ ఫలితాలను ఇచ్చేవి 20 శాతం పనులు ఎంపిక చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వాటి పైనే మీ 80 శాతం ఫోకస్ పెట్టి పనిచేయాలని సలహా ఇస్తున్నారు. ఇలా చేయడం ద్వారా మీ శ్రమ వృథా కాకుండా ఉంటుందని వివరిస్తున్నారు.ఒత్తైన జుట్టు కోసం షాంపూలు వాడుతున్నారా? - ఈ విషయాలు తెలుసుకోవాల్సిందే!1-3-5 రూల్ : ఒక రోజులో 1 పెద్ద టాస్క్, 3 మీడియం టాస్కులు, 5 చిన్న టాస్కులు ఎంచుకోవాలంటున్నారు నిపుణులు. మొదట పెద్ద టాస్క్ పూర్తి చేయడం, ఆ తర్వాత 3 మీడియం టాస్కులు, అవి పూర్తయ్యాక 5 చిన్న టాస్కులు పూర్తి చేస్తే ఎలాంటి సమస్యే ఉండదని చెబుతున్నారు. దీంతో ఒత్తిడి లేకుండా పనులు జరిగిపోతాయట.5/25 రూల్ : ప్రముఖ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ 5/25 రూల్‌ను తీసుకొచ్చారు. దీని ప్రకారం, మీరు చేయాల్సిన వాటిని 25 పనులుగా విభజించుకోవాలి. వాటిని ప్రాధాన్యత క్రమంలో జాబితాలో రాసుకోని, వాటిలో తొలి 5 ముఖ్యమైన పనుల్ని కంప్లీట్ చేయాలని నిపుణులు చెబుతున్నారు.పొమోడోరో టెక్నిక్ : ఒక పనిని 25 నిమిషాలపాటు ఏకాగ్రతతో చేసే టెక్నిక్? ఇది. ఆ తర్వాత 5 నిమిషాలు విశ్రాంతి తీసుకోవాలంటున్నారు నిపుణులు. ఆ తర్వాత 4 సార్లు ఇలాగే చేయాలని చెబుతున్నారు. అంటే 2 గంటల పాటు ఈ విధంగా పనిచేసి ఆ తర్వాత 15-30 నిమిషాలు విరామం తీసుకోవాలని వివరిస్తున్నారు.ఈట్ యువర్ ఫ్రాగ్ : మీరు చేయాల్సిన పనుల్లో అతి ముఖ్యమైన లేదా కఠినమైన పనిని ఫస్ట్ చేయడం. దాన్ని విజయవంతంగా పూర్తి చేసినప్పుడు వచ్చే ఆత్మవిశ్వాసం రోజంతా కొనసాగుతుందంటున్నారు నిపుణులు. దీంతో ఇతర పనులన్నీ సులభంగా చేసేయగలుగుతారట.60 సెకండ్స్ స్టార్ట్ : ఏదైనా పనిని ప్రారంభించే ముందు బ్రెయిన్ నిండా ఎన్నో ఆలోచనలు తిరుగుతుంటాయి. ఇది చేయగలమా? ఎలా చేయాలి? అంటూ ఆలోచిస్తూ టైం వేస్ట్ చేస్తుంటారు. అందుకే, ఓ పని చేయాల్సి వస్తే దాన్ని వెంటనే ప్రారంభించి 60 సెకండ్ల పాటు కొనసాగించి ఆపాలంటున్నారు నిపుణులు. అప్పుడు చేయాల్సిన పనిపై శ్రద్ధ వస్తుందని చెబుతున్నారు.

## తిన్న వెంటనే ఆకలిగా ఉంటుందా? - ఇలా ఎందుకు అవుతుందో తెలుసా?



ఆకలి వేస్తే భోజనం చేస్తాం. అనుకోకుండా నచ్చిన ఫుడ్ కనిపిస్తే జిహ్వ కోరికని తీర్చేస్తాం. అయితే ఎంత తిన్నా ఒక మోతాదు వరకే తీసుకోవాలి. కానీ, కొంతమంది మాత్రం ఆకలి తీరినా, ఎన్ని రకాల రుచులు ఆరగించినా ఇంకా ఏం తినాలా? ఎప్పుడు తినాలా? అని ఆలోచిస్తుంటారు. ఆకలి వేయకపోయినా సరే, మనసులో అవే ఆలోచనలు. దీన్నే 'ఫుడ్ నాయిస్' అంటున్నారు నిపుణులు. మానసిక ఒత్తిడి, భావోద్వేగాల వల్ల జీవనశైలి, ఆహారంలో వచ్చే మార్పు అని చెబుతున్నారు. ఈ క్రమంలో 'ఫుడ్ నాయిస్' నియంత్రించుకోలేకపోతే ఆరోగ్య సమస్యలు వస్తాయని హెచ్చరిస్తున్నారు. మరి, అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం!ఎలా గుర్తించాలి? : భోజనం చేసిన తర్వాత కడుపు నిండిన భావన. అయినా ఇంకేం తినాలి? అని ఆలోచన. బ్రేక్‌ఫాస్ట్ తింటూనే మధ్యాహ్నం ఏం తింటే బాగుంటుందని, లంచ్ చేస్తూ సాయంత్రం స్నాక్స్ గురించి, ఆ తర్వాత రాత్రి భోజనం గురించి ఇలా మనసంతా ఎప్పుడూ ఫుడ్ గురించే ఆలోచిస్తుంటారు. ఒత్తిడికి లోనైనప్పుడు, బాధ కలిగినప్పుడు, ఖాళీగా ఉన్నప్పుడు ఇలా సందర్భం ఏదైనా సరే, ఆహారం తింటూ ఊరట పొందుతుంటారు. బరువు తగ్గడానికి డైట్‌లో ఉండామనీ అనుకుంటారు. అదే విధంగా మొదలు పెడతారు. కానీ, మామూలు రోజుల్లో కంటే మరింత ఎక్కువగా తినాలనిపిస్తుంటుంది. ఇవన్నీ ఫుడ్ నాయిస్‌కు సంకేతాలంటున్నారు నిపుణులు.చర్మం పొడిబారడం, జుట్టు రాలిపోవడం! - ఈ లక్షణాలు కనిపిస్తే అలర్ట్ కావాలంటున్న నిపుణులుఎందుకొస్తుంది? చాలా మంది బరువు పెరగకూడదని, ఫిట్‌నెస్ పేరుతో ఆహారం విషయంలో ఆంక్షలు పెట్టుకుంటారు. 'వీటి జోలికి వెళ్లకూడదు' 'అవి తినకూడదు' అని అనుకుంటారు. ఇలాంటప్పుడు ఆహారంపై ఆలోచనలు మరింత పెరుగుతాయి. నియంత్రించుకోవడం చాలా కష్టమవుతుంది. మానసిక ఒత్తిడి పెరిగినప్పుడు, భావోద్వేగాలకు గురైనప్పుడు కొంతమందిలో ఏదైనా ఆహారం తినాలనే ఆలోచన వస్తుంటుంది. అలాంటి వారిలో బాధ, ఆందోళన, ఒంటరితనం, కోపం వంటివి ఫుడ్ నాయిస్‌ను పెంచుతాయి.సరిపడా నిద్ర లేకపోతే మెదడు ఉపశమనాన్ని కోరుకుంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆలోచనలు ఫుడ్‌పైకి మళ్లుతాయి. ఏమైనా తినగానే మెదడు తక్షణ ఆనందాన్ని పొందుతుందట. శరీరంలో హార్మోన్ల అసమతుల్యత వల్ల అనేక మార్పులు వస్తుంటాయి. కొన్ని సందర్భాల్లో ఆకలి లేకపోయినా ఏమైనా తినాలనిపిస్తుందట. చాలామంది దీన్ని గుర్తించకలేక తినేస్తుంటారు.


ఈ మధ్య సోషల్‌మీడియాలో ఫుడ్ వ్లాగ్ వీడియోలు పెరిగాయి. వివిధ ప్రాంతాల్లో ఉండే ఫుడ్‌ను పరిచయం చేస్తూ వ్లాగర్లు వీడియోలు యూట్యూబ్, సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆ వీడియోలు, ప్రకటనలు చూసి నోరూరుతుంది.

ఆకలిని గుర్తించడం కష్టమే : 'ఆహారం మితంగా తింటే అమృతం, అతిగా తింటే విషం' అని అంటుంటారు పెద్దలు. ఫుడ్ నాయిస్ ప్రభావంతో అతిగా తినడం వల్ల బరువు నియంత్రణలో ఉండదు. శరీరంలోకి కొవ్వు పెరిగి ఒబెసిటీ వచ్చే ప్రమాదం ఉంది. నిజమైన ఆకలి ఏదో గుర్తించడం కష్టమవుతుందంటున్నారు నిపుణులు. అలాగే, బయట హోటల్స్, ఫుడ్‌స్టాల్స్‌లో పరిశుభ్రత ప్రశ్నార్థకంగా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ఫుడ్ పాయిజన్ జరిగి అస్వస్థతకు గురయ్యే ప్రమాదం కూడా ఉంది. ఫుడ్ నాయిస్ వల్ల ఊబకాయంతో బాధపడవచ్చు, ఇది స్లీప్ అప్నియా, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్‌కు కూడా దారితీస్తుందని ఎన్‌ఐహెచ్ అధ్యయనం పేర్కొంది.ఎలా నియంత్రించాలి? : స్వయంగా లేదా డాక్టర్ల సాయంతో శరీరాన్ని అర్థం చేసుకోవాలి. శరీరం ఇచ్చే సంకేతాలను గమనించాలి. నిజంగా ఆకలవుతోందా? భావోద్వేగాల కారణంగా అలా అనిపిస్తోందా అని ఒకటికి రెండు సార్లు మనల్ని ప్రశ్నించుకోవాలి.ఫుడ్ నాయిస్‌ను నియంత్రించుకోవాలని పూర్తిగా నోరు కట్టేసుకోవద్దు. ఇష్టమైన వాటికి దూరం పెట్టొద్దు. ఏది తిన్నా మితంగా, పోషక విలువలున్న సమతులాహారం తినడం మంచిది.

రోజూ వ్యాయామం చేయడం, తగినన్ని నీరు తాగడం, తగినంత నిద్ర తప్పనిసరి.తినే సమయంలో ఫోన్ వాడకుండా, టీవీ చూడకుండా తినే ఆహారంపైనే దృష్టి పెట్టాలి. రుచి, వాసనను ఆస్వాదిస్తూ భోజనం చేయాలి.ఒంటరితనం, ఒత్తిడి, ఆందోళన వల్ల ఏదో ఒకటి తినాలనిపిస్తుంది. ఇలాంటప్పుడు వెంటనే ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టేయకుండా, కాసేపు నడవడం, కొన్ని క్షణాలు ధ్యానం చేయండి. వీలైతే కాసేపు సంగీతం వినండి. ఇంత చేసినా ఆకలి తీరకపోతే అప్పుడు జంక్‌ఫుడ్

చీబూజు : ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.


## అందంగా ఉండాలంటే - ఒత్తిడికి దూరంగా ఉండాలట!



దీర్ఘకాలిక ఒత్తిడి, ఆందోళన శరీర ఆరోగ్యంతోపాటు అందంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతాయంటున్నారు సౌందర్య నిపుణులు. ఒత్తిడికి గురైనప్పుడు శరీరంలో హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుందని చెబుతున్నారు. తద్వారా జరిగే శారీరక మార్పుల వల్ల అందంపై ప్రతికూల ప్రభావం పడుతుందంటున్నారు. అంతేకాదు, ఒత్తిడికి గురైనప్పుడు ఏది పడితే అది తినడం వల్ల జీవనశైలిలో కూడా మార్పులు వస్తాయని పేర్కొంటున్నారు. మరి, ఈ నేపథ్యంలో ఒత్తిడి, ఆందోళనలకు గురైనప్పుడు ఎలాంటి మార్పులు వస్తాయి? వాటిని ఎలా అధిగమించాలి? అన్నది ఇప్పుడు చూద్దాం.మొటిమలు : ఒత్తిడి, ఆందోళనకు గురైనప్పుడు శరీరంలో అధిక మొత్తంలో కార్టిసాల్ విడుదలవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ హార్మోన్ చర్మంపై ఉండే సెబేషియస్ గ్రంథులను ప్రేరేపించి ఎక్కువ మొత్తంలో నూనెలు విడుదలయ్యేలా చేస్తుందట. దీంతో చర్మ గ్రంథులు మూసుకుపోయి మొటిమలు వస్తాయని పేర్కొంటున్నారు. ఒత్తిడి వల్ల మొటిమలు, జుట్టు రాలడం, జుట్టు పల్చబడటం, తామర, సోరియాసిస్, దద్దుర్లు లాంటి సమస్యలు వస్తాయని

తిన్న వెంటనే ఆకలిగా ఉంటుందా? - ఇలా ఎందుకు అవుతుందో తెలుసా?ఐ బ్యాగ్స్ : మామూలుగా వయసు పైబడే కొద్దీ కనురెప్పలు ఉబ్బడం, కళ్ల కింద డార్క్ సర్కిల్ లాంటి సమస్యలు వస్తాయి. అంతేకాదు, పిగ్మెంటేషన్, చిన్నవయసులోనే చర్మం ముడతలు పడటం, చర్మం స్థితిస్థాపకతను కోల్పోవడం జరుగుతుందని వివరిస్తున్నారు. ఇలా ఒత్తిడి అనేది అందంపై పలు రకాలుగా ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలియజేస్తున్నారు.చర్మం పొడిబారడం : చర్మం కింద ఉండే లిపిడ్స్, ప్రొటీన్ అనేవి చర్మ కణాలు తేమగా ఉండడంలో సహకరిస్తాయంటున్నారు నిపుణులు. అయితే, ఒత్తిడి కారణంగా వాటి పనితీరు దెబ్బతింటుందని పేర్కొంటున్నారు. దీంతో చర్మం పొడిబారిపోవడం, దురద రావడం వంటి సమస్యలు వస్తాయని తెలియజేస్తున్నారు. మానసిక ఒత్తిడి చర్మపు పై పొర అయిన ఎపిడెర్మల్ అవరోధాన్ని కూడా దెబ్బతీస్తుందని ఫ్లూజీబుక్ తీసి.వంట అధ్యయనం పేర్కొంది.జుట్టు నెరిసిపోవడం : మానసిక ఒత్తిడి ఎంత ఎక్కువైతే జుట్టు అంతగా నెరిసిపోయే అవకాశం ఉంటుందంటున్నారు నిపుణులు. జుట్టుకు సహజసిద్ధమైన నలుపు రంగును అందించే మెలనోసైట్స్(వివర్ణకణాలు) ఒత్తిడి కారణంగా క్రమంగా తగ్గిపోతుందని చెబుతున్నారు. దీంతో కొత్తగా పుట్టుకొచ్చే కణాలకు మెలనిన్ అందక జుట్టు నెరిసిపోవడం ప్రారంభమవుతుందని తెలియజేస్తున్నారు. అంతేకాదు, దీర్ఘకాలిక మానసిక సమస్యలు హెయిర్ గ్రోత్ ఆగిపోయేలా చేసి, అది పూర్తిగా నిర్వీర్యమైపోయేలా చేస్తాయని వివరిస్తున్నారు.ఒత్తిడిని చిత్తు చేయాలంటే : ఒత్తిడి కారణంగా సౌందర్యంపై ఇంతలా ప్రభావం పడుతుంది కాబట్టి ఇలాంటి మానసిక సమస్యలకు సాధ్యమైనంత దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని చిన్న చిన్న చిట్కాల్ని పాటించాలని సూచిస్తున్నారు.ఖాళీగా ఉంటే ఏవేవో ఆలోచనలతో మనసంతా గందరగోళంగా ఉంటుంది. ఇలాంటప్పుడు మనకు ఏ పనైతే ఇష్టంగా చేయాలనిపిస్తుందో ఆ పనిలో బిజీగా మారిపోవాలంటున్నారు నిపుణులు. దీంతో మనసు ప్రశాంతంగా ఉండటంతోపాటు ఏదో తెలియని సంతృప్తి కలుగుతుందని చెబుతున్నారు.మనం రోజూ తీసుకునే ఆహారం ద్వారా కూడా ఒత్తిడిని అదుపు చేసుకోవచ్చని సూచిస్తున్నారు. ఈ క్రమంలో డార్క్ చాక్లెట్, గుడ్లు, ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు ఎక్కువగా ఉండే చేపలు, చామొమైల్ టీ వంటివి చక్కగా పనిచేస్తాయంటున్నారు. వీటిలో ఉండే పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్లే అందుకు ప్రధాన కారణమంటున్నారు. ఒత్తిడిని కలుగజేసే కార్టిసాల్ హార్మోన్ స్థాయిల్ని అదుపులో ఉంచడంలో వ్యాయామం, యోగా, ధ్యానం వంటివి తోడ్పడతాయని వివరిస్తున్నారు. అందుకే, రోజూ ఉదయం లేదా సాయంత్రం 30 నిమిషాలపాటు మనకు నచ్చిన వ్యాయామాలు చేస్తే ఒత్తిడికి దూరంగా ఉండవచ్చని పేర్కొంటున్నారు.ఒత్తిడిగా అనిపించినప్పుడు కుటుంబ సభ్యులు, ఫ్రెండ్స్, మనసుకు నచ్చిన వారితో కాసేపు సమయం గడపడం వల్ల ఉపశమనం లభిస్తుందని తెలియజేస్తున్నారు.ఇలా ఎన్ని ప్రయత్నాలు చేసినా ఒత్తిడి, ఆందోళన నుంచి బయటపడలేకపోతే మాత్రం వెంటనే మానసిక నిపుణుల్ని సంప్రదించడం మంచిదని సూచిస్తున్నారు. తద్వారా మొదట్లోనే సమస్య నుంచి బయటపడవచ్చంటున్నారు. తద్వారా ఇతర మానసిక, శారీరక సమస్యల్లోకి కూరుకుపోకుండా జాగ్రత్తపడచ్చని సలహా చీబూజు : ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

## ఈ దేశాలలో ఒక్క ఎయిర్‌పోర్ట్ కూడా లేదు



ప్రతి దేశంలో కనీసం ఒక విమానాశ్రయం అయినా ఉంటుంది. విమానాశ్రయాలు ఆ దేశ అభివృద్ధిని ప్రతిబింబిస్తాయి. కానీ ప్రపంచ పటంలో ఒక్క విమానాశ్రయం కూడా లేని దేశాలు ఐదు ఉన్నాయి. ఆశ్చర్యం ఏమిటంటే.. విమానాశ్రయాలు లేకపోయినా, ఈ దేశాలు ప్రతి సంవత్సరం లక్షలాది మంది పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ఆ దేశాల్లో ప్రకృతి అందాలు.. ప్రశాంత వాతావరణమే ఇందుకు ప్రధాన కారణం. ఆ దేశాలు ఏవో వివరంగా తెలుసుకుందాం.అండోరాఫ్రాన్స్, స్పెయిన్ మధ్య పైరినీస్ పర్వతాలలో ఉన్న ఈ చిన్న దేశం ఒక పర్వత స్వర్గధామం. చుట్టూ ఎత్తైన పర్వతాలు ఉండటంతో ఇక్కడ విమానాశ్రయం నిర్మించడం సాధ్యం కాదు. కానీ స్కీయింగ్, మంచు దృశ్యాలు, ప్రకృతి సహజ సౌందర్యం చూసిన తర్వాత విమానాశ్రయం లేదనే విషయమే పెద్దగా గుర్తుకు రాదు.మొనాకోమొనాకో ప్రపంచంలోనే రెండో అతి చిన్న దేశం. దేశం చాలా చిన్నదిగా ఉండటంతో విమానాశ్రయం నిర్మించడానికి స్థలం లేదు. కానీ క్యాసినోలు, ఖరీదైన కార్లు, సముద్రతీర అందాలు మొనాకోను ప్రత్యేకంగా నిలబెడతాయి.శాన్ మారినో..ఇటలీ మధ్యలో ఉన్న ఈ చిన్న దేశం చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తుంది. పురాతన కోటలు, సన్నని వీధులు, పురాతన నిర్మాణాలు చూసి చరిత్ర ప్రేమికులు మంత్రముగ్ధులు అవుతారు.లీచెన్‌స్టెయిన్స్విట్జర్లాండ్, ఆస్ట్రియా మధ్య ఉన్న ఈ చిన్న దేశం అద్భుత కథలలో కనిపించే లోయలాగే ఉంటుంది. పచ్చని కొండలు, పురాతన కోటలు, ప్రశాంత వాతావరణం దీని ప్రత్యేకతవాటికన్ సిటీప్రపంచంలోనే అతి చిన్న దేశమైన వాటికన్ సిటీ రోమ్ నగరం మధ్యలో ఉంది. దేశం అంత చిన్నది కావడంతో విమానాశ్రయం సంగతి పక్కనపెడితే.. సరిగ్గా నడవడానికి కూడా పరిమిత స్థలమే ఉంటుంది!

## అరుణాచల మహాత్యం- ఒక్కసారి దర్శిస్తే చాలు వివాహం, సంతానం గ్యారెంటీ!



పంచభూత లింగాలలో అగ్నిలింగంగా భాసిల్లుతున్న అరుణాచల క్షేత్రం తమిళనాడులో తిరువణ్ణామలైలో ఉంది. అరుణ అంటే ఎర్రని, చలం అంటే కొండ అని అర్థం. అరుణాచలం కొండ అగ్ని రూపంలో సాక్షాత్కరించిన శివ స్వరూపం. అందుకే అరుణాచలంలో గర్భాలయంలోని శివుని దర్శనం కన్నా అరుణాచలం కొండకు చేసే గిరి ప్రదక్షిణకే ప్రాధాన్యత ఎక్కువ. అరుణాచలంలో ప్రతిరోజూ లక్షలాది మంది భక్తులు గిరి ప్రదక్షిణ చేస్తుంటారు. పౌర్ణమి రోజుల్లో ఈ సంఖ్య రెట్టింపవుతుంది. అయితే అరుణాచలం గిరి ప్రదక్షిణ వలయంలో తప్పకుండా దర్శించవలసిన 44 అతి శక్తివంతమైన ఆలయాలు గురించి ఈ కథనంలో తెలుసుకుందాం.స్మరణతోనే పుణ్యం తమిళ భక్తులు అన్నామలై గా పిలుచుకునే అరుణాచలం క్షేత్రం పేరు స్మరించినంతనే సకల పాప దోషాలు తొలగిపోయి పుణ్యం లభిస్తుందని విశ్వాసం. ఈ అరుణాచల స్వామి తేజోలింగం, జ్యోతిర్లింగం. అందుకే ఈ క్షేత్రాన్ని అగ్ని క్షేత్రమని కూడా కొనియాడతారు. 14 కి. మీ. ఉన్న అరుణగిరి ప్రదక్షిణ చేయడమంటే సాక్షాత్తు ముక్కంటికి ప్రదక్షిణ చేసినట్లే అని పురాణాలు చెబుతున్నాయి. వేదాలు, ఉపనిషత్తులలో అరుణాచలం కొండ సాక్షాత్తు ఆ మహేశ్వరుడని సెలవిస్తోంది. ఇక ఈ గిరిప్రదక్షిణ చేసే మార్గంలో 44 చిన్న చిన్న ఆలయాలు దర్శించుకుని ప్రధాన ఆలయం దగ్గరకు చేరుకుంటే గిరిప్రదక్షిణ పూర్తైనట్లే! గిరి ప్రదక్షిణ మార్గంలో చూడవలసిన ఆలయాల వివరాలు ఇప్పుడు చూద్దాం.

బ్రహ్మలింగం:
అరుణాచలం గిరి ప్రదక్షిణ ప్రారంభించాల్సిన ప్రదేశం ఇది. ఇక్కడ ముందుగా వినాయకుడికి నమస్కరించుకుని గిరి ప్రదక్షిణ మొదలు పెట్టాలి.

ఇంద్ర లింగం:
ఇది ఇంద్రుడు ప్రతిష్ఠించిన శివలింగం. దీనికి శుక్రుడు, సూర్యుడు అధిదేవతలు. ఈ లింగాన్ని దర్శించుకుంటే వృత్తి ఉద్యోగ వ్యాపారాలకు సంబంధించిన సమస్యలు తొలగిపోతాయి.

అగ్నిలింగం - అగ్ని తీర్థం :
అరుణగిరి చుట్టూ మొత్తం 8 శివలింగాలున్నాయి.. వాటిలో ఏడు రోడ్డుకి ఎడమవైపు ఉంటే అగ్నిలింగం మాత్రం కుడివైపుకు ఉంటుంది. దీనినే అగ్ని తీర్థం అని కూడా అంటారు. ఇక్కడ స్వామి వారిని దర్శించుకుంటే కష్టాలలో ప్రమాదాల నుంచి గట్టెక్కిస్తాడని నమ్మకం.

శేషాద్రి స్వామి :
శేషాద్రి స్వామి అరుణాచలంలో చిరకాలం నివసించి ముక్తిని పొందారు. ఈయన ఆశ్రమంలోని సమాధి దర్శనంతో సానుకూల శక్తులు పెరుగుతాయని విశ్వాసం.

దక్షిణా మూర్తి:
శివుని యొక్క జ్ఞాన స్వరూపం దక్షిణామూర్తి. అరుణగిరి ప్రదక్షిణ వలయంలో ఉన్న అతి పురాతనమైన, శక్తివంతమైన దక్షిణామూర్తి ఆలయం తప్పకుండా దర్శించాలి.

రమణాశ్రమం:
రమణమహర్షి ఆశ్రమంలో చూడాల్సిన ప్రదేశాలు చాలా ఉన్నాయి. మీనాక్షీ, సుందరేశ్వరుడు, గణేశ ఆలయాలు: పార్వతీ పరమేశ్వరుల శక్తి ఇక్కడ భక్తుల విశ్వాసం.

ద్రౌపది ఆలయం:
గిరి ప్రదక్షిణ వలయంలో ఉన్న ద్రౌపది ఆలయం నుంచి గిరి దర్శనం అద్భుతంగా ఉంటుంది. జీవితంలో ఎదురుదెబ్బలు తిని విసిగిపోయిన వారికి ఈ ఆలయ దర్శనం మానసిక స్థైర్యాన్నిస్తుంది.

యమలింగం:
యముడు పూజించిన ఈ శివలింగాన్ని దర్శించుకుంటే అకాలమృత్యువు దరిచేరదు. మృత్యుభయం తొలగిపోతుంది. ఆర్థిక ఇబ్బందుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

పృథ్విలింగం:
అరుణాచలం గిరిచుట్టూ ఉన్న 8 శివలింగాల్లో ఇదొకటి.

గణపతి:
తొండం కుడివైపు తిరిగిఉండే ఈ గణపయ్యను దర్శించుకుంటే అదృష్టం వరిస్తుంది.

దూర్వాస ఆలయం:
ఇక్కడ దూర్వాసుడిని కుంతీ దేవి ప్రతిష్ఠించిందని చెబుతారు. ఇక్కడున్న వేప చెట్టుకి పసుపు దారాలు కడితే సంతాన భాగ్యం కలుగుతుందని, రాళ్లు పేరిస్తే ఇల్లు కట్టుకుంటారని భక్తుల విశ్వాసం.

కాట్టు శివాశ్రమం:
గిరి ప్రదక్షిణలో భాగంగా ఈ ఆశ్రమాన్ని రోడ్డుపై నుంచి దర్శనం చేసుకుని వెళ్ళిపోవచ్చు.

అప్పు నంది:
ఈ నంది దర్శనం కుటుంబ వివాదాలను సమసిపోయేలా చేసి బంధాలను వృద్ధి చేస్తుంది.

తేయునంది:
ఈ నంది నుంచి చూస్తే గిరి చతుర్ముఖ దర్శనం ఉంటుంది. బ్రహ్మదేవుడు జీవుల సృష్టికి కావాల్సిన జ్ఞానం ఇక్కడి నుంచి పొందారని చెబుతారు.

శోణ తీర్థం:
ఇక్కడ రెండు నందులుంటాయి. ఇక్కడున్న వినాయకుడిని జ్యోతి వినాయకుడు అంటారు. రమణ మహర్షి గిరి ప్రదక్షిణ చేసేటప్పుడు సేదతీరిన ప్రదేశం ఇది.

నైరుతి లింగం:
గిరి ప్రదక్షిణలో ఉన్న అష్ట లింగాల్లో నాలుగోది ఇది. ఇక్కడ స్వామిని దర్శించుకుంటే రుణ, గ్రహ బాధలు తొలగిపోయి కీర్తి ప్రతిష్టలు వస్తాయి.

నంది ముఖ దర్శనం:
ఇక్కడి నుంచి అరుణ గిరివైపు చూస్తే నంది ముఖంలా కనిపిస్తుంది.

ఎదిర్ నేర్ అన్నామలై:
ఇది అరుణ గిరికి సరిగ్గా వెనకవైపు ఉంటుంది. ఇక్కడి నుంచి గిరిని చూస్తే శివశక్తి దర్శనం అవుతుంది. అంటే శివుడు ఓ కొండగా, శక్తి మరో కొండగా కనిపిస్తారు.

ఆకాశ నంది:
పంచభూతాల్లో భాగంగా ఉండే నందుల్లో నాలుగోది ఆకాశనంది.

పళని ఆండవార్ ఆలయం:
కుమార స్వామి ఇక్కడ తపస్సుచేసి స్వయంభూవుగా వెలిశాడని చెబుతారు. అందుకే ఈ ప్రదేశం అత్యంత శక్తివంతమైనది విశ్వాసం.

# వికారాబాద్ లో ఘోర రోడ్డు ప్రమాదం

**– బైకు స్కూటీ పై పడ్డ జేసిబి ఇద్దరు మృతి**

**– అధికారుల నిర్లక్ష్యమే ఈ రోడ్డు ప్రమాదానికి కారణం**



వికారాబాద్ ఫిబ్రవరి 3 : వికారాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. సోమవారం ఉదయం వికారాబాద్ సమీపంలోని బుగ్గ రామేశ్వర ఆలయం మలుపులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పొగ మంచుతో పాటు ట్రక్కు డ్రైవర్ నిర్లక్ష్యం కూడా ప్రమాదానికి కారణంగా చెబుతున్నారు.
వికారాబాద్ నుండి బుగ్గ రామేశ్వరం వైపుగా ట్రక్కులో జేసీబీని తీసుకొని వెళుతుండగా.. టెంపుల్ మలుపులో అదుపుతప్పి ట్రక్ బోల్తా కొట్టింది. అ సమయంలో వికారాబాద్ నుంచి బైక్‌పై వస్తున్న వారిపై ట్రక్కుపై ఉన్న జేసీబీ పడడంతో రిత్విక్ (8) అనే బాలుడు అక్కడికక్కడే మృతి చెందగా.. తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తండ్రి లాలయ్య, కూడా మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మరో స్కూటీపై వస్తున్న భార్య మేఘన, ఆమె కూతురు, కు స్వల్ప గాయాలు అయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**– అధికారుల నిర్లక్ష్యమే ఈ రోడ్డు ప్రమాదానికి కారణం**

రోడ్డు ప్రమాదకరంగా ఉందని పలుమార్లు పాలకులు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ కనీసం ఆ వైపు మళ్లీ చూడని ఈ అధికారుల నిర్లక్ష్యానికి నేడు రెండు ప్రాణాలు బలి,వ్వడంతో అ కుటుంబం రోడ్డున పడ్డది అధికారులు రోడ్డు ప్రమాద స్థలాలని గుర్తిస్తాం వెంటనే సమస్య పరిష్కారం చేస్తామని పేపర్ ప్రకటనలు ఇవ్వడం తప్ప వీళ్ళు ఇప్పటివరకు చేసింది ఏమీ లేదు వాస్తవానికి ఈ మలుపు ప్రమాదకరంగా ఉందని ఎన్నిసార్లు పట్టిక్యులర్ గా వార్తల రూపంలో ప్రచురించినప్పటికీ అధికారులు, పట్టించుకో కపోవడంతోనే ఈ మార్గంలో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని.. ప్రజలు మండిపడుతున్నారు. రోడ్డు భద్రతా ఉత్సవాలంటే హెల్మెట్ పెట్టుకొని సీట్ బెల్ట్ పెట్టుకుంటే సరిపోదు అధికారులు ప్రభుత్వం ప్రమాద స్థలాలను గుర్తించి వాటిని పరిష్కరిస్తే ఇలాంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఖచ్చితంగా నివారించవచ్చు ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడి ప్రమాదకర మలుపులను సరిచేసి ప్రమాదాలను అరిక ట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ముగిసిన శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి టెంకాయల వేలంపాట



**– వేలంపాటలో పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు**

పరిగి ఫిబ్రవరి 3 : శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి దేవస్థాన ంలో సోమవారం దేవాలయ కార్య నిర్వహణ ధికారి జి బాలనర్సయ్య, ఆలయ కమిటీ ఆధ్ వ్ర్యంలో ఒక సంవత్సరనికి సంబందించిన టెంకాయ వేలం పాట నిర్వహించడం జరిగి ంది. ఈ వేలంపాటలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని టెంకాయల వేలంతో పాటు తలనీలాల వేలాన్ని పలువురు దక్కించుకోవడం జరిగింది. వేలంపాటకు సంబంధించి పూర్తి వివరాలు వెల్లడించిన దేవాలయ కార్య నిర్వహణధికారి జి బాలనర్సయ్య, వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం బండవెల్కి చర్ల, గ్రామానికి చెందిన కోనేరు వెంకట్ రాములు గౌడ్, సంవత్సరనికి సంబందించిన టెంకాయ వేలన్ని 12,1000, పన్నెండు లక్షల ఒక వెయ్యి రూపాయలకు దక్కించుకోవడం జరిగిందన్నారు. పెద్ద జాతర టెంకాయల వేలన్ని మహబూబు నగర్ జిల్లా నవాబ్ పేట్, మండలం కాకర్లపహాడ్, గ్రామానికి చెందిన ఎస్ వెంకటయ్య, 7,05 000, అక్షరాల ఏడు లక్షల ఐదు వేల రూపాయలకు దక్కించుకున్నారు. అదేవిదంగా తల నీలాల వేలన్ని మహబూబు నగర్ జిల్లా కేంద్రానికి చెందిన రామన్ గౌడ్, 303003, మూడు లక్షల మూడు వేల మూడు రూపాయలు కు దక్కించుకునట్టు బాల నర్సయ్య, తెలిపారు. ఈ కార్యక్రమం లొ పరిశీలకులు ప్రణీత్ కుమార్ దేవాదాయ ధర్మదాయ శాఖ వికారాబాద్ డివిజన్....గ్రామ సర్పంచ్ మడుగు శ్రీనివాస్.. ఉపసర్పంచ్. గోవర్ధన్ రెడ్డి, మాజీ చేర్మెన్ మైపాల్ రెడ్డి. జి రాములు, దేవాలయం అర్చకులు దశరథం.. పాండు శర్మ.. వివిధ గ్రామాల ప్రజలు.. గ్రామ ప్రజలు సిబ్బంది తదుతరులు పాల్గొన్నారు..

# బిజెపి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా ముకుంద జోష్ణ నాగేశ్వర్

**– మీడియా సమావేశంలో ప్రకటించిన బిజెపి నాయకులు**





పరిగి ఫిబ్రవరి 3 : మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా ముకుంద జ్యోష్ణ నాగేశ్వర్, ను ప్రకటించిన భారతీయ జనతా పార్టీ నాయకులు, సోమవారం పరిగి పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో భారతీయ జనతా పార్టీ తరపున పరిగి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా ఎం ఏసీ. బి ఈ డి, ఎంఏ, పూర్తిచేసిన విద్యావంతులు, మలి దశ ఉద్యమకారులు, ముకుంద జోష్ణ నాగేశ్వర్, ను ప్రకటించిన భారతీయ జనతా పార్టీ నాయకులు వికారాబాద్ జిల్లా కన్వీనర్ ప్రహ్లాద్ రావు, పరిగి అసెంబ్లీ ఇన్చార్జి మారుతి కిరణ్ బూనేటి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు వెన్న ఈశ్వరప్ప, పార్టీ సీనియర్ నాయకులు, శరత్ కుమార్ రెడ్డి, మిట్ట పరమేశ్వర్ రెడ్డి, మున్సిపల్ ఎన్నికల పరిగి ఇంచార్జ్ ఈ. నర్సిములు, ఈ సందర్భంగా పలువురు బిజెపి నాయకులు మాట్లాడుతూ...మలి దశా ఉద్యమకారులు, విద్యావంతులు ప్రజా సమస్యలపై అవగాహన కలిగిన వ్యక్తులు, ఏ హోదాలో లేకపోయినా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ముకుంద జోష్ణ నాగేశ్వర్, ను పరిగి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా ప్రకటించుకోవడం జరిగింది. పరిగి పట్టణ భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, కష్టపడి పనిచేసి చైర్మన్ అభ్యర్థి ,తో పాటు, మిగతా 15 వార్డుల్లో పోటీలో నిలిచిన భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపిం చుకోవాలన్నారు. ఈసారి మాత్రం పరిగి మున్సిపల్ పీఠం భారతీయ జనతా పార్టీ కైవాసం చేసుకోవడం పక్కా అని ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇప్పటివరకు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిని ప్రకటించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

**– ప్రజలు ఆశీర్వదిస్తే మున్సిపల్ అభివృద్ధికి కృషి చేస్తా చైర్మన్ అభ్యర్థి**

మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయవలసిన బాధ్యత ఎంతైనా ఉంది. ప్రజల కొరకు ఎవరు పనిచేస్తారని ఆలోచించి ఓటు వేయాలని పరిగి చైర్మన్ అభ్యర్థి ముకుందా జోష్ణ నాగేశ్వర్, అన్నారు. మాకు ఎలాంటి హోదా లేకపోయినా జేఏసీలో పనిచేసుకుంటూ అనునిత్యం పరిగి నియోజకవర్గ ప్రజల అభ్యున్నతి కొరకై పరిగి అభివృద్ధి కొరకై అధికార పార్టీని ప్రశ్నిస్తూ..ప్రజా సంఘాలను కలుపుకొని పని చేశామన్నారు. తొలి దశ తెలంగాణ ఉద్యమంలో అలుపెరగని పోరాటం చేసామన్నారు. భారతీయ జనతా పార్టీ తరపున జిల్లా రాష్ట్ర స్థాయి నాయకులు పరిగి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా నన్ను ఎన్నుకున్నందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతు న్నామన్నారు. పరిగి మున్సిపల్ బరిలో నాతో పాటు మరో 15 వార్డుల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులు పోటీలో నిలిచారు. ప్రజలందరూ కమలం పువ్వు గుర్తుకు ఓటేసి మమ్మల్ని ఆశీర్వదిస్తే పరిగి మున్సిపల్, ను జిల్లాలోనే ఆదర్శ మున్సిపల్ గా తీర్చిదిద్దుతానని చైర్మన్ అభ్యర్థి ముకుందా జోష్ణ నాగేశ్వర్ అన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు బాలకృష్ణారెడ్డి, మండల అధ్యక్షురాలు, అనసూయ శ్యాంసుందర్, సీనియర్ నాయకులు,జి. కేశవులు, శివకుమార్, రాము యాదవ్, వినోద్, కౌన్సిలర్ అభ్యర్థులు, వార్ల ఆంజినే యులు, రామచందర్, అనూష, మహిళా నాయకురాలు లక్ష్మిన రసింహ, మల్లేష్, రూప్ ఖాన్ పేట్ నర్సింలు, రమేష్, రాకంచెర్ల అనిల్, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మరొక్క ఒక్క అవకాశం ఇవ్వండి మరింత అభివృద్ధి చేస్తా



**– 10 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి బి. రవి కుమార్**

పరిగి ఫిబ్రవరి 3 : మరొక అవకాశం ఇవ్వండి వార్డు మరింత అభివృద్ధి చేస్తానని పదవ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి బి. రవి కుమార్, అన్నారు. పరిగి మున్సిపల్ పరిధిలోని 10 వ వార్డు బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్, అభ్యర్థి బి. రవి కుమార్, సోమవారం నాడు పార్టీ నాయకులు కార్యకర్తలతో, కలిసి 10 వ వార్డులో గడపగ డపకు తిరుగుతూ.. నాకు ఓటు వేసి మరొక్క అవకాశం ఇవ్వండి వార్డు మరింత అభివృద్ధి చేస్తానని వార్డు ప్రజలను కోరుతూ..జోరుగా ప్రచారం నిర్వహించడం జరిగింది. అనంతరం రవి కుమార్, మాట్లాడుతూ.... గత ఐదు సంవత్సరాలు కౌన్సిలర్ గా వార్డులో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాము నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచాము మరొకసారి 10వ వార్డు ప్రజలు నాకు ఓటు వేసి నన్ను ఆశీర్వదిస్తే వార్డు అభివృద్దే ద్వేయంగా పనిచేస్తానని ఆయన అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రత్యేక కృషి చేస్తానన్నారు. వార్డు పరిధిలోని ఏ కాలనీలో ఎలాంటి సమస్య ఉన్న వార్డు ప్రజలు నా దృష్టికి తీసుకువస్తే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. 10 వ వార్డులో మౌలిక వసతులు కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని, ముఖ్యంగా తాగునీటి సరఫరా, సీసీ రోడ్ల నిర్మాణం, అండర్ డ్రైనేజీ వ్యవస్థ, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీ పడకుండా, ప్రజల గొంతుకగా పని చేస్తానని స్పష్టం చేశారు. నిరంతరం వార్డు అభివృద్ధి కొరకు పనిచేసే నాకు మరొక్క అవ కాశం ఇవ్వాలని, కౌన్సిలర్ అభ్యర్థి బి రవికుమార్, వార్డు ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క అవకాశం ఇవ్వండి వార్డు అభివృద్ధే ద్వేయంగా పనిచేస్తా

**– జోరుగా కౌన్సిలర్ అభ్యర్థి మీది గడ్డ శ్రీనివాస్ ఎన్నికల ప్రచారం**



పరిగి ఫిబ్రవరి 3 : ప్రచారంలో దూసుకుపోతున్న 15వ వార్డు బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి మీదిగడ్డ శ్రీనివాస్, మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా పరిగి మున్సిపల్ పరిధిలోని 15 వ వార్డు బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి మీది గడ్డ శ్రీనివాస్, సోమవారం నాడు పార్టీ నాయకులతో, కలిసి వార్డులో గడపగడపకు తిరుగుతూ.. బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి నన్ను గెలిపించాలని వార్డు ప్రజలను కోరుతూ.. ఎన్నికల ప్రచారం నిర్వహించడం జరిగింది. వార్డు ప్రజలు సైతం మా ఓటు మీకేనంటూ అభ్యర్థి శ్రీనివాస్, కు వారి మద్దతు తెలిపారు. అనంతరం శ్రీనివాస్, మీడియా తో మాట్లాడుతూ.... 15వ వార్డు ప్రజలు నాకు ఓటు వేసి నన్ను ఆశీర్వదిస్తే వార్డు అభివృద్దే ద్వేయంగా పనిచేస్తానని ఆయన అన్నారు. పరిగి పట్టణ మున్సిపల్ లోనే సమస్యల రహితంగా వార్డును అన్ని విధాల అభివృద్ధి చేస్తానని వార్డు ప్రజలకు ఆయన హామీ ఇచ్చారు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రత్యేక కృషి చేస్తానన్నారు. వార్డు పరిధిలోని ఏ కాలనీలో ఎలాంటి సమస్య ఉన్న వార్డు ప్రజలు నా దృష్టికి తీసుకువస్తే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. 15 వ వార్డులో మౌలిక వసతులు కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని, ముఖ్యంగా తాగునీటి సరఫరా, సీసీ రోడ్ల నిర్మాణం, అండర్ డ్రైనేజీ వ్యవస్థ, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీ పడకుండా, ప్రజల గొంతుకగా పని చేస్తానని స్పష్టం చేశారు. నిరంతరం వార్డు అభివృద్ధి కొరకు పనిచేసే నాకు ఒక్క అవకాశం ఇవ్వాలని, ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# బెల్టుషాపుల నిర్మూలనకు కీలక నిర్ణయం తీసుకున్న నూతన పాలకవర్గం



కొందుర్గు ఫిబ్రవరి 3 :కొందుర్గు మండలం పరిధిలోని వెంకిర్యాల గ్రామ పంచాయతీ సర్పంచ్ మోత్కూరి యాదమ్మ జంగయ్య అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో శాశ్వత మద్యపాన నిషేధంతో పాటు గ్రామ గౌడ సంఘం తరుపున మన గ్రామ దేవత ఊరమైసమ్మ దేవాలయాన్ని నిర్మించి ఇస్తా మని మాట ఇవ్వడం జరిగింది ఇట్టి గ్రామ సభలో ఉప సర్పంచ్ రమేష్ నాయక్ మరియు వార్డు సభ్యులు యాదయ్య రవి అరుణ రఘువీర్ యాదమ్మ మొగులయ్య మరియు దేవాలయ కమిటీ చైర్మన్ రాఘవేందర్ గౌడ్ మాజీ సర్పంచ్ లు లింగం గౌడ్ గోవింద్ పెంటయ్య మరియు గ్రామ పెద్దలు జంగయ్య లింగం గౌడ్ రమేష్ వెంకటేష్ శివ గర్మి రామకృష్ణ కొలముల శివ గోపాల్ నాయక్ శంకర్ నాయక్ రాజు నాయక్ మహిళా సంఘమ్ అధ్యక్షులు భీమమ్మ
ఈ కార్యక్ర మంలో వార్డు సభ్యులు గ్రామ పెద్దలు మాజీ ప్రజా ప్రతినిధులు మహిళలు యువకులు పాల్గొని నిర్ణయించడం జరిగింది.

# అక్రమ కార్యకలాపాలకు పోలీసులు అడ్డుకట్ట

**– ఎస్పీ ఆదేశాలతో ఒక్క నెలలోనే 22 కేసులు నమోదు**

**– వివరాలు వెల్లడించిన వికారాబాద్ ఎస్పీ స్నేహ మెహ్రా**




వికారాబాద్ ఫిబ్రవరి 3 : అక్రమ కార్యకలాపాలపై పోలీసుల ఉక్కుపాదం జనవరిలోనే 22 కేసులు నమోదు చేసినట్టు వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ జిల్లాలో అక్రమ రవాణా, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటునట్టు తెలిపారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఆదేశాలతో టాస్క్ ఫోర్స్ అధికారులు జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేపట్టారు. కేవలం జనవరి నెలలోనే వివిధ అక్రమ కార్యకలాపాలకు సంబంధించి మొత్తం 22 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ ఒక ప్రకటనలో వెల్లడించారు. సహజ వనరుల దోపిడీని అరికట్టడమే లక్ష్యంగా పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టినట్టు ఆమె తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న 14 ట్రాక్టర్లపై, నిబంధనలకు విరుద్ధంగా ఎర్రమట్టిని తరలిస్తున్న ఒక ట్రాక్టరుపై కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేశారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్న నిషేధిత చైనా మాంజా విక్రయాలపై 4 కేసులు నమోదు చేశారు. వీటితో పాటు మాదకద్రవ్యాల నిరోధక చట్టం కింద ఒక కేసు. కల్తీ ఆహార పదార్థాల విక్రయదారులపై ఒక కేసు. పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి ఒక కేసు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. జిల్లాలో అక్రమ కార్యకలాపాలు ఎక్కడ జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలనిద
ఎస్పీ కోరారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని,
చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠిన
చర్యలు తప్పవని
ఎస్పీ హెచ్చరించారు.

# మాజీమంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యలను ఖండించిన దేవీపట్నం మండల కమిటీ




**దేవీపట్నం :** మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్, ముఖ్యమంత్రి చంద్రబాబు , మంత్రి లోకేష్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు ఖండిస్తూ సోమవారం ఇందుకూరుపేట స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు గోళ్ళ చంటిబాబు మాట్లాడుతూ తిరుమల తిరుపతి కల్తీ నెయ్యి వ్యవహారంలో జైలు పాలు అవ్వక తప్పదని గ్రహించిన జగన్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ లో భాగంగా వైసీపీలో ఉన్న వాళ్ళను రెచ్చగొట్టి చంద్రబాబు, లోకేష్ లపై బూతు పురాణం మొదలు పెట్టించాడని విమర్శించారు. సభ్య సమాజం వినలేని బూతులను మాజీ మంత్రులు, వైసీపీ నాయకులు మాట్లాడడం చూసి రాష్ట్ర ప్రజలు చీదరించుకుంటున్నారన్నారు.

2019 నుండి 2024 వరకు మీరు చేసిన అరాచకాలు, అక్రమ అరెస్టులు, అణచివేతలు మరిచిపోయారా అని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీలో బీసీ నాయకులైన అచ్చం నాయుడు , కొల్లు రవీంద్ర , చింతకాయల అయ్యన్నపాత్రుడు నీ ఎలా హింస పెట్టి వేధించారో రాష్ట్ర ప్రజలందరూ చూశారు గత వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతి పాలు అయిందని, అందుకే ప్రజలు జగన్ రెడ్డి అరాచకాలను సహించలేక కూటమి పార్టీలకు 164 సీట్లు ఇచ్చి గెలిపించారని, వైసిపిని 151 నుంచి 11 సీట్లకు పరిమితం చేశారు ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు గారు రాష్ట్రాన్ని పునర్నిర్మానం చేసుకుంటూ, ఒక పక్క అభివృద్ధి, సంక్షేమం చూసుకుంటూ, గత 20 నెలలుగా చంద్రబాబు గారు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి బాట పట్టింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కీర్తి గంగరాజు, క్లస్టర్ ఇంచార్జ్ నుంచి వీర వెంకట సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షులు మాగపు బాబురావు, మాజీ మండల అధ్యక్షులు ముంద్రు మధుసూదన్ రావు, తెలుగు యువత అధ్యక్షులు జొన్నల శ్రీనివాస్ కుమార్,మార్కెట్ యార్డ్ డైరెక్టర్ జొన్నల రాంబాబు, మాజీ రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి చవళం శివరామకృష్ణ, సొసైటీ డైరెక్టర్ పల్లపాటి నాగేశ్వరరావు, ఐటీడీపీ అధ్యక్షులు మద్దేటి అంజిరెడ్డి, సీనియర్ నాయకులు రేలంగి రాంబాబు,ఐ టిడిపి ప్రధాన కార్యదర్శి తాళ్లూరు కుటుంబరెడ్డి, యూనిట్ ఇన్చార్జి పుట్టపల్లి మల్లేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ మడకం శ్రీనివాస్, చిట్టిబాబు, మండల పార్టీ ప్రచార కార్యదర్శి పేరుగాని ఏసుబాబు, తెలుగు యువత కార్యదర్శి కామిశెట్టి శ్రీనివాస్, తెలుగు యువత ఉపాధ్యక్షులు తుర్రం వంశీకృష్ణ, గనిశెట్టి వీరబాబు, బూరుగు చిన్ని, లక్ష్మణ్, బడి గుంట రాజారెడ్డి, చదల నాగిరెడ్డి, కొమరం రామకృష్ణ, , టిడిపి నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.జుచీణ.

# భారత చైతన్య యువజన పార్టీ కర్నూలు జిల్లా యూత్ కన్వీనర్‌గా 'కప్పట్రాళ్ల మధు'

**-యువతను సంఘటితం చేసి పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం: అధినేత రామచంద్ర యాదవ్**
**-నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా.. అహర్నిశలు శ్రమిస్తా: కప్పట్రాళ్ల మధు**
**-మధు నియామకంతో జిల్లాలో కొత్త ఉత్సాహం.. హర్షం వ్యక్తం చేస్తున్న పార్టీ శ్రేణులు**



**చిట్వేల్, ఫిబ్రవరి 02:** కర్నూలు జిల్లాలో భారత చైతన్య యువజన పార్టీని క్షేత్రస్థాయి నుంచి పటిష్టం చేసే దిశగా పార్టీ అధినేత బోడే రామచంద్ర యాదవ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. చురుకైన నాయకత్వ లక్షణాలు కలిగిన యువ నేత కప్పట్రాళ్ల మధు ను కర్నూలు జిల్లా యూత్ కన్వీనర్‌గా నియమిస్తూ ఆదివారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ భావజాలాన్ని యువతలోకి బలంగా తీసుకెళ్లడంతో పాటు జిల్లా వ్యాప్తంగా పార్టీ విస్తరణకు మధు కృషి చేస్తారని అధినేత ఆశాభావం వ్యక్తం చేశారు.

-యువత సమస్యలపై పోరాటమే మార్గం:
జిల్లా యూత్ కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కప్పట్రాళ్ల మధు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ భారీ బాధ్యతను అప్పగించిన బోడే రామచంద్ర యాదవ్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడటమే తన ప్రథమ ప్రాధాన్యతని పేర్కొన్నారు. "యువత శక్తిని సంఘటితం చేసి, జిల్లాలో భారత చైతన్య యువజన పార్టీని ఒక బలమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దుతాను. గ్రామ స్థాయి నుంచి ప్రతి యువకుడిని పార్టీలో భాగస్వామిని చేస్తాను" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

-నూతన కార్యాచరణకు సన్నద్ధం:మధు నియామకంతో జిల్లాలో పార్టీకి కొత్త ఊపిరి వచ్చినట్లయిందని విశ్లేషకులు భావిస్తున్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడటం ద్వారా పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయాలని మధు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. యువత సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాల ను నిర్వహించనున్నట్లు సమాచారం.-హర్షం వ్యక్తం చేస్తున్న నాయకులు:కప్పట్రాళ్ల మధు నియామకం పట్ల భారత చైతన్య యువజన పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారు. మధు నాయకత్వంలో కర్నూలు జిల్లాలో పార్టీ మైలురాయిని అధిగమిస్తుందని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. యువతను పెద్ద సంఖ్యలో పార్టీలోకి ఆహ్వానించి, రాబోయే రోజుల్లో రాజకీయ ప్రక్రియలో వారి పాత్రను కీలక మలుపు తిప్పేందుకు మధు సిద్ధమవుతున్నారు.

# టమోటాలు రెగ్యులర్ గా తింటున్నారా- అయితే, ఇది మీ కోసమే..!!

టమోటాలు ప్రతీ ఇంటా నిత్యం వినియోగిస్తారు. అనేక రకాలుగా టమోటాలను ఆహారంలోకి తీసుకుంటారు. టమోటాలు పోషకాలతో నిండి ఉంటాయి. టమోటాల్లోని విటమిన్లు, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు ఆరోగ్యంగా ఉండేందుకు సహాయపడతాయి. టమాటాల్లో లైకోపీన్ అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది.లైకోపీన్ వల్ల మన శరీరంలో ఉత్పత్తి అయ్యే ఫ్రీ ర్యాడికల్స్ ప్రభావం తగ్గుతుంది. అయితే, టామాటలను ఎక్కువగా తీసుకోవడం వల్ల మీ ఆరోగ్యంపై సానుకూల ప్రభావాలకు బదులుగా ప్రతికూల ప్రభావాలు ఉంటాయని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు.టమోటాలను తీసుకోవటం ద్వారా ఎన్నో ఆరోగ్య పరమైన ప్రయోజనాలు ఉన్నాయి. ఇందులోని లైకోపీన్ వల్ల పలు రకాల క్యాన్సర్లను రాకుండా అడ్డుకోవచ్చని సైంటిస్టుల అధ్యయనాల్లో తేలింది. లైకోపీన్‌తోపాటు టమాటాల్లో పొటాషియం, విటమిన్ సి అధికంగా ఉంటాయి. ఇవన్నీ కలసి గుండె ఆరోగ్యం కోసం పనిచేస్తాయి. పొటాషియం వల్ల బీపీ నియంత్రణలో ఉంటుంది. లైకోపీన్ ఇతర యాంటీ ఆక్సిడెంట్లతో కలిసి శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ ను తగ్గిస్తాయి. ఇక టమాటాలను తినడం వల్ల ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలుగుతాయని చాలా మందికి తెలుసు. కానీ వీటిని రోజుకు ఎంత మోతాదులో తినాలి అని చాలా మందిలో సందేహం ఉంది. టమాటాల్లో లైకోపీన్ అధిక మోతాదులో లభించాలంటే టమాటాలను ఎల్లప్పుడూ ఉడికించే తినాలి. పచ్చిగా ఉండే టమాటా ల్లో లైకోపీన్ తక్కువగా ఉంటుంది. కనుక లైకోపీన్ ఎక్కువగా కావాలనుకునే వారు టమాటాలను ఉడకబెట్టి తింటే మంచిది. టమాటాల్లో ఉండే లైకోపీన్ ఎక్కువగా కొవ్వుల్లో కరుగుతుంది.కాగా, టమాటాలను ఎప్పుడు తిన్నా కొవ్వు పదార్థాలతో తింటే మేలు జరుగుతుంది. ఆలివ్ ఆయిల్, అవకాడో, చేపలు, నెయ్యి, గింజలు, విత్తనాలు వంటి వాటితో కలిపి తింటే లైకోపీన్‌ను శరీరం ఎక్కువగా శోషించుకుంటుంది. అయితే పచ్చి టమాటాలను తినడం వల్ల కూడా లాభాలు ఉన్నాయి.

# విజయవాడలో టీడీపీ మండల సారథుల శిక్షణా తరగతులు: రైల్వే కోడూరు నేతల హాజరు

**-పార్టీ బలోపేతం, ప్రభుత్వ పథకాల ప్రచారంపై దిశానిర్దేశం చేసిన మంత్రులు, సీనియర్ నేతలు**
**-కార్యకర్తలకు, ప్రజలకు వారధిగా నిలవాలి: శిక్షణలో మంత్రి గుమ్మడి సంధ్యారాణి పిలుపు**
**-ఉత్సాహంగా పాల్గొన్న రైల్వే కోడూరు నియోజకవర్గ మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు**




**చిట్వేల్, ఫిబ్రవరి 02:** తెలుగుదేశం పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడమే లక్ష్యంగా విజయవాడలోని టీడీపీ కేంద్ర ప్రధాన కార్యాలయంలో మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులకు రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల పార్టీ సారథులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.-దిశానిర్దేశం చేసిన అగ్రనేతలు:
ఈ శిక్షణ తరగతుల్లో రాష్ట్ర మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఖాదీ బోర్డు చైర్మన్ కేకే చౌదరి, మాజీ ఎమ్మెల్సీలు మహమ్మద్ షరీఫ్, అశోక్ బాబు తదితరులు పాల్గొని పార్టీ విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న 'సూపర్ సిక్స్' పథకాలు మరియు ఇతర అభివృద్ధి పనులను గ్రామస్థాయిలో ప్రతి ఇంటికీ చేరవేసేలా మండల స్థాయి నాయకత్వం బాధ్యత తీసుకోవాలని వారు సూచించారు. సోషల్ మీడియా వాడకం, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యల పరిష్కారంలో నాయకుల పాత్రపై సుదీర్ఘంగా చర్చించారు.

-హాజరైన రైల్వే కోడూరు నియోజకవర్గ నేతలు:
ఈ కీలక శిక్షణ కార్యక్రమానికి రైల్వే కోడూరు నియోజకవర్గం నుండి ఈ క్రింది నాయకులు హాజరయ్యారు:
చిట్వేల్ మండలం:ఇంచార్జ్ కాకర్ల నాగార్జున నాయుడు, ప్రధాన కార్యదర్శి అనంతయ్య యాదవ్.
పెనగలూరు మండలం: అధ్యక్షులు నారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుచ్చకాయల రవికుమార్.
ఓబులవారిపల్లి మండలం: ప్రధాన కార్యదర్శి చప్పిడి బాబు.
పుల్లంపేట మండలం:అధ్యక్షులు కాపెర్ల చంద్రశేఖర్.
రైల్వే కోడూరు మండలం:ప్రధాన కార్యదర్శి తేనేపల్లి చిన్న.
-పార్టీ పటిష్టతకు పునరంకితం:
శిక్షణ అనంతరం నాయకులు మాట్లాడుతూ.. అధిష్టానం సూచించిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తూ, నియోజకవర్గ ఇంచార్జ్ ఆధ్వర్యంలో పార్టీ విజయానికి కృషి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పార్టీ కమిటీలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

# ఘనంగా ముగిసిన కాశిరెడ్డి నాయన స్వామి ఆరాధన ఉత్సవాలు

**రసవత్తరంగా బండలాగుడు పోటీలు**





**సిద్దవటం ఫిబ్రవరి 2** మండలంలోని శివుని పల్లె గ్రామ సమీపంలో వెలసిన శ్రీశ్రీశ్రీ సద్గురు కాశిరెడ్డి నాయన స్వామి 24వ. ఆరాధన ఉత్సవాలు ఘనంగా ముగిశాయి.ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం వృషభ రాజములుచే బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి.ఈ పోటీల్లో 3 జతల ఎద్దులు పాల్గొన్నాయి.ఈ పోటీలను వైఎస్ఆర్సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, సిద్ధవటం మండలం ఇంచార్జి మేడా మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ముందుగా వారు కాశిరెడ్డి నాయన స్వామి ఆలయంలో పూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. బండలాగుడు పోటీల్లో ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీకి చెందిన ద్వారసాల గురువు రెడ్డి ఎద్దు మొదటి బహుమతి రూ. 50 వేలును, కడప రూకవారిపల్లెకు చెందిన బొజ్జ విద్యా ఓబుల్ రెడ్డి ఎద్దు రెండవ బహుమతి రూ. 30 వేలును, కమలాపురానికి చెందిన గుత్తి ఆదిల్ ఎద్దు మూడవ బహుమతి రూ. 20 వేల రూపాయలు గెలుచుకున్నారు. ఈ బహుమతులను కాశిరెడ్డి నాయన ఆలయం వద్ద ఆయా దాతలు ఎద్ల యజమానులకు అందజేశారు. ఉత్సవాల్లో భాగంగా మిట్టపల్లి, మాధవరం -1, గ్రామాల కళాకారులు కోలాటం భజనలు కోలాటం భజనలు, చెక్కభజనలు వంటి కార్యక్రమాలు చూపరులను ఎంతగానో అలరించాయి.కాశినాయన ఉత్సవాల్లో అలరించిన జగనన్న పాట కాశిరెడ్డి నాయన ఆరాధన మహోత్సవాల్లో వైఎస్ఆర్సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి ఏకుల రాజేశ్వరి రెడ్డి జగనన్న పాటకు కోలాటం ప్రదర్శన చేయగా అందరినీ ఆకట్టుకుంది. కోలాటం ప్రదర్శనకు దాత ఎన్ఆర్ఐ ఓబులేసు యాదవ్,కాడే శివయ్య నాయుడులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మాజీ సర్పంచ్ కె.వి సుబ్బయ్య, వైఎస్ఆర్సీపీ మండల కన్వీనర్ నీలకంఠా రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు శ్రీకాంత్ రెడ్డి, ఆర్ఎంపి వైద్యులు మురళీమోహన్, మండల యూత్ నాయకుడు కేవై వెంకటసుబ్బయ్య నాయుడు,జగదీశ్వర్ నాయుడు, సంగటి సబ్బనాయుడు, యస్ దాస్, రాసాల కదిరయ్య నాయుడు, ఆలయ చైర్మన్ నారాపురెడ్డి పుల్లారెడ్డి, కార్యనిర్వాహకులు నారాపురెడ్డి రామ సుబ్బారెడ్డి, నేకనాపురం సర్పంచ్ ఈశ్వర్ రెడ్డి, పార్టీ నాయకులు కొంగా లక్ష్మీరెడ్డి, బత్తల సుధాకర్, పిడుగు యల్లారెడ్డి, దొండపాటి వెంకట రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తపోవన ఆశ్రమంలో ఘనంగా సేవా కార్యక్రమం: చిన్నారి పుట్టినరోజున అన్నదాన వితరణ

**-పుట్టినరోజు వేడుకల్లో వినూత్న శైలి.. ఆశ్రమానికి బియ్యం, సరుకుల వితరణ**
**-పిల్లలకు సేవా దృక్పథం అలవాటు చేయాలి: పీఠాధిపతి నాగేశ్వరమ్మ**
**-ఓర్సు తేజశ్రీ పుట్టినరోజు సందర్భంగా మానవీయత చాటుకున్న కుటుంబ సభ్యులు**






**చిట్వేల్, ఫిబ్రవరి 02:** నేటి ఆధునిక కాలంలో పుట్టినరోజు వేడుకలను ఆర్భాటంగా జరుపుకోవడం కాకుండా, సమాజానికి ఉపయోగపడేలా నిర్వహించడం అభినందనీయమని శ్రీ శ్రీ శ్రీ దత్తగిరి నారాయణ తపోవన ఆశ్రమ పీఠాధిపతి నాగేశ్వరమ్మ పేర్కొన్నారు. చిట్వేల్ మండలం కేకే వడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓర్సు తేజశ్రీ 10వ పుట్టినరోజు సందర్భంగా ఆశ్రమంలో అన్నదాన నిమిత్తం సరుకుల వితరణ కార్యక్రమం నిర్వహించారు.-ఆశ్రమానికి సరుకుల అందజేత:కేకే వడ్డిపల్లికి చెందిన ఓర్సు లక్ష్మీనారాయణ, జయమ్మల మనుమరాలు మరియు ఓర్సు ప్రేమ్ నాథ్, లక్ష్మీదేవిల కుమార్తె అయిన ఓర్సు తేజశ్రీ పదవ పుట్టినరోజును పురస్కరించుకుని, ఆ కుటుంబ సభ్యులు ఆశ్రమానికి విచ్చేశారు. ఆశ్రమంలోని భక్తులకు, నిత్యాన్నదానానికి ఉపయోగపడే విధంగా బియ్యం, తాజా కూరగాయలు మరియు ఇతర నిత్యావసర సరుకులను పీఠాధిపతి నాగేశ్వరమ్మ గారికి అందజేశారు.-ఆదర్శంగా నిలిచిన కుటుంబం:ఈ సందర్భంగా పీఠాధిపతి నాగేశ్వరమ్మ మాట్లాడుతూ.. చిన్నారి తేజశ్రీ పుట్టినరోజున విలాసాలకు పోకుండా, ఆశ్రమానికి సహాయం అందించడం ఆ కుటుంబం యొక్క గొప్ప సంస్కారాన్ని తెలియజేస్తోందని కొనియాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాల వల్ల పిల్లల్లో చిన్నప్పటి నుంచే తోటివారికి సహాయం చేయాలనే గుణం పెరుగుతుందని తెలిపారు. ఆశ్రమ దైవం దత్తగిరి స్వామి ఆశీస్సులు ఆ చిన్నారికి, వారి కుటుంబానికి ఎల్లప్పుడూ ఉండాలని దీవించారు.-భక్తుల ప్రశంసలు:తమ గ్రామానికి చెందిన కుటుంబం ఆశ్రమం పట్ల చూపిన ఉదారతను గ్రామస్థులు, ఆశ్రమ భక్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో చిన్నారి తేజశ్రీ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు మరియు ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటుకు భూసేకరణ పనులను వేగవంతం చేయాలి

**పోలవరం ప్రాజెక్ట్ ఆర్ అండ్ ఆర్ భూసేకరణను త్వరితగతిన పూర్తిచేయాలి**
**జిల్లాలో వివిధ ప్రోజెక్టుల భూసేకరణ పీసా కమిటీ ఆమోదం తీసుకోవాలి**
**పోలవరం ఆర్ అండ్ ఆర్, జాతీయ రహదారుల భూసేకరణలపై అధికారులు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి వీడియో కాన్ఫరెన్స్**



**ఏలూరు, ఫిబ్రవరి 02.** జిల్లాలోని ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటుకు సంబంధించి భూసేకరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుండి సోమవారం సాయంత్రం పోలవరం ప్రాజెక్టు ఆర్ అండ్ ఆర్ పునరావాస కార్యక్రమాలు, జాతీయ రహదారుల నిర్మాణానికి, సెల్ ఫోన్ నెట్వర్క్ టవర్ల ఏర్పాటు, ఎంఎస్ ఎం ఈ పార్కుల ఏర్పాటు నిమిత్తం భూ సేకరణ పై అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో పోలవరం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి, కాలనీల నిర్మాణం, జాతీయ రహదారులు, ఎంఎస్ ఎం ఈ పార్కుల ఏర్పాటు, బిఎస్ఎంఎల్ టవర్ల ఏర్పాట్లకు సంబంధించి భూసేకరణ ను సంబంధిత గ్రామాలలో పీసా కమిటీ సమావేశాలు తప్పనిసరిగా నిర్వహించి ఆమోదం తీసుకోవాలని, ఆమోదం అనంతరం భూసేకరణ ప్రకటనలను విడుదల చేయాలన్నారు. జీలుగుమిల్లి-పట్టిసీమ రహదారి లో వివిధరకాల చెట్లు కోల్పోతున్న వారికి చెట్లకు పరిహారం పై నివేదికను మంగళవారం సాయంత్రం నాటికి సమర్పించాలని ఉద్యానవన శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. జాతీయ రహదారులకు సంబంధించి ఎన్ .హెచ్. 165, గ్రీన్ ఫీల్డ్ హై వే , జీలుగుమిల్లి- పట్టిసీమ, పెదన-లక్ష్మీపురం 216-హెచ్ రహదారి, పట్టిసీమ-గూటాల రహదారుల భూసేకరణ పై, అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఏలూరు జిల్లాలో చేపట్టే భూసేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణానికి సంబందించి కోర్ట్ లలో ఉన్న కేసులు త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. జిల్లాలోని ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటుకు సంబంధించి భూసేకరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, డిఆర్ఓ వి.విశ్వేశ్వర రావు, పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ అభిషేక్, నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఏలూరు, జంగారెడ్డిగూడెం ఆర్డీవో లు యం.అచ్యుత అంబరీష్, రమణ, కలెక్టరేట్ భూసేకరణ విభాగ అధికారి పోతురాజు, జిల్లా భూసేకరణ అధికారులు, జాతీయ రహదారుల ప్రాజెక్ట్ డైరెక్టర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు ,తదితరులు పాల్గొన్నారు.

# టీ20ల్లో అత్యధిక హాఫ్ సెంచరీలు

● చరిత్ర సృష్టించిన బాబర్ ఆజామ్..



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 ముందు పాకిస్థాన్ అదిరిపోయే విజయాన్ని అందుకుంది. సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో జరిగిన మూడు టీ20ల సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. ఆదివారం జరిగిన ఆఖరి టీ20లో సమష్టిగా చెలరేగిన పాకిస్థాన్ 111 పరుగుల తేడాతో ఆసీస్‌ను చిత్తు చేసింది.208 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆసీస్ 96 పరుగులకే ఆలౌటైంది. మహమ్మద్ నవాజ్(5/18) ఐదు వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించగా.. షాహీన్ షా అఫ్రిది(2/16) రెండు వికెట్లు తీసాడు. అబ్రర్ అహ్మద్, నసీమ్ షా తలో వికెట్ తీసారు. ఆసీస్ బ్యాటర్లలో కామెరూన్ గ్రీన్(22), మార్కస్ స్టోయినీస్(23), జోష్ ఫిలిప్పే(14) మినహా అంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు.అంతకుముందు పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 207 పరుగుల భారీ స్కోర్ చేసింది. సైమ్ ఆయుబ్(37 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 56), బాబర్ ఆజామ్(36 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 50 నాటౌట్) హాఫ్ సెంచరీలతో రాణించగా.. షాదాబ్ ఖాన్(19 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లతో 46) దూకుడుగా ఆడారు.ఇక ఈ మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ చేయడం ద్వారా బాబర్ ఆజామ్ వరల్డ్ రికార్డ్ నమోదు చేశాడు. అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక హాఫ్ సెంచరీలు బాదిన తొలి బ్యాటర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో అతను టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ రికార్డును అధిగమించాడు. బాబర్ ఆజామ్ ఇప్పటి వరకు 39 అర్ధ శతకాలు

# ఐసీసీ ఆంక్షలకు భయపడం..

**భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నాం**

**భవిష్యత్తులోనూ భారత్‌తో ఆడం**

**పాక్ ట్టు మాజీ కెప్టెన్ రషీద్ లతీఫ్**



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్‌తో జరిగే మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నామని పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇది ఈ ఒక్క మ్యాచ్‌తోనే ఆగిపోదని, భవిష్యత్తులో కూడా భారత్‌తో జరిగే మ్యాచ్‌లను పాకిస్థాన్ బహిష్కరిస్తుందని ఆ జట్టు మాజీ కెప్టెన్ రషీద్ లతీఫ్ అన్నాడు.భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీ ఆదివారం తెరలేవనుంది. గ్రూప్-ఏలో భాగంగా ఫిబ్రవరి 15న కొలంబో వేదికగా భారత్, పాకిస్థాన్ మ్యాచ్ జరగాల్సి ఉంది. అయితే ఈ మ్యాచ్‌ను బాయ్‌కట్ చేస్తున్నట్లు పాకిస్థాన్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది.తాజాగా ఈ వ్యవహారంపై మాట్లాడిన రషీద్ లతీఫ్.. ఐసీసీ ఎన్ని ఆంక్షలు విధించినా పీసీబీ భయపడబోదని స్పష్టం చేశాడు. 'భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌ల నుంచి ఐసీసీ, ఆసియా క్రికెట్ కౌన్సిల్ భారీ లాభాలను ఆర్జిస్తున్నాయి. రాబోయే మూడేళ్లలో ఉమ్మడి వేదికగా మ్యాచ్‌లు ఆడేందుకు ఇరు దేశాల క్రికెట్ బోర్డులు ఒప్పందం కుదుర్చుకున్నాయి. అంతా సవ్యంగా సాగుతున్న క్రమంలో బంగ్లాదేశ్ జట్టు టీ20 ప్రపంచకప్ నుంచి తప్పుకుంది. దాంతో పరిస్థితులన్నీ పూర్తిగా మారిపోయాయి.భద్రతా కారణాలతో బంగ్లాదేశ్ భారత్ రావడానికి నిరాకరించినప్పుడు ఐసీసీ తేలికగా తీసుకుంది. కానీ ఇప్పుడు రాజకీయ వాతావరణం మారిపోయింది. గతంలోలా కాకుండా బంగ్లాదేశ్‌కు పాకిస్థాన్ అండగా నిలుస్తోంది. భవిష్యత్తులో కూడా భారత్‌తో మ్యాచ్‌లను పాకిస్థాన్ బహిష్కరించనుంది. ఐసీసీ ఆంక్షలు, మ్యాచ్ ఓటమి గురించి పీసీబీ ఆందోళన చెందడం లేదు. సాధారణంగా పీసీబీ ఇలాంటి నిర్ణయాలు తీసుకోదు.చాలా ఆలోచించిన తర్వాతే ఈ అడుగు వేశారు. ఫిబ్రవరి 15 జరిగే మ్యాచ్‌తోనే ఇది ఆగిపోదు. మహిళల వరల్డ్ కప్, ఛాంపియన్స్ ట్రోఫీ 2028లో కూడా భారత్‌తో మ్యాచ్‌లను పాక్ ఇలానే బహిష్కరించనుంది. అయితే వ్యాపారవేత్తలు ప్రభుత్వాలను శాసిస్తారు. బ్రాడ్‌కాస్టర్లు ఊరుకోరు కాబట్టి ఏదో ఒక పరిష్కారం వెతుకుతారు. దౌత్యపరంగా ఏదో పరిష్కారం చూపించే ప్రయత్నం జరగవచ్చు.'అని ఆయన రషీద్ లతీఫ్ చెప్పుకొచ్చాడు.

# నా మాటలు వక్రీకరించారు: మేరీకోమ్



భారత ప్రముఖ బాక్సర్ మేరీకోమ్ మరోసారి తన వైవాహిక బంధం గురించి మాట్లాడింది. ఇటీవల మాజీ భర్త కరుంగ్ ఆంఖోలర్‌పై ఆరోపణలు చేసే క్రమంలో ఆమె మాట్లాడిన మాటలను కొందరు వక్రీకరిస్తున్నారని చెప్పింది. ఆ వ్యాఖ్యలు పూర్తిగా తన తన మాజీ భర్తను ఉద్దేశించి మాత్రమే చేశానని, ఇంకెవరినీ బాధపెట్టాలని చేసింది కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు సోషల్ మీడియాలో వీడియో షేర్ చేసింది. 'చాలా ఏళ్ల పాటు మా వైవాహిక బంధం సజావుగానే సాగింది. అయితే నా భర్త తనను ఆర్థికంగా మోసగించడం వల్ల మా రిలేషన్ దెబ్బతింది. ఆ తర్వాతే మా ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. గతేడాది మాకు విడాకులు మంజూరైన తర్వాత నాపై సోషల్ మీడియాలో వ్యతిరేకంగా దాడి జరిగింది. అయినా నేను సంయమనం పాటించాను' 'రీసెంట్‌గా ఒక టాక్‌షోలో నేను మాట్లాడిన మాటల వల్ల ఎవరైనా ఇబ్బందిపడి ఉంటే క్షమించండి. ముఖ్యంగా పురుష సమాజం. ఆ మాటలన్నీ, నా వ్యక్తిగత జీవితంలో నేను అనుభవించిన బాధ నుంచి వచ్చినవే. అయితే నా మాటలను వక్రీకరించి ప్రచారం చేస్తున్నారు. కానీ నేను ఏ ఆటకు కూడా వ్యతిరేకం కాదు. నేను క్రీడాకారులందర్నీ గౌరవిస్తా' అని మేరీకోమ్ క్లారిటీ ఇచ్చింది. గతంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మేరీకోమ్ తన మాజీ భర్తపై ఆరోపణలు చేసింది. అతడు 'గల్లీ ఫుట్‌బాల్' ఆటగాడంటూ విమర్శించింది. 'అనేక మందిలాగే అతడు కూడా ఓ సాధారణ గల్లీ ఫుట్‌బాల్ ప్లేయర్. అంతమాత్రాన అతను బైచుంగ్ భూటియా, సునీల్ ఛెత్రి అవ్వలేడు. కెరీర్‌లో అసలు సక్సెస్ అవ్వలేడు' అని మేరీకోమ్ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేసింది. అయితే ఇందులో 'గల్లీ ఫుట్‌బాల్' అనే వ్యాఖ్యల వల్ల కొందరి మనోభావాలు దెబ్బతిన్నాయి. దీంతో ఇది కాంట్రవర్సీ అయ్యింది. ఈ వ్యాఖ్యలపై మేరీకోమ్ తాజాగా క్లారిటీ ఇస్తూ, క్షమాపణలు కోరింది. అయితే ఆమె మాజీ భర్త కరుంగ్ ఆంఖోలర్ ఓ ఫుట్‌బాల్ ఆటగాడు. అయితే మేరీకోమ్ కోసం తన కెరీర్‌ను సైతం వదులుకున్నానని కరుంగ్ గతంలో ఓ సందర్భంలో చెప్పారు. దీనిపైనే మేరీకోమ్ విరుచుకుపడింది. అలా మాట్లాడింది. అయితే తామిద్దరు దిల్లీలో కలుసుకున్నప్పటికే కరుంగ్ తన కెరీర్‌ను వదిలేశారని మేరీకోమ్ పేర్కొంది. 2005లో మేరీకోమ్-కరుంగ్ ఆంఖోలర్ వివాహం జరిగింది. మణిపుర్‌కు చెందిన మేరీకోమ్ ప్రపంచ బాక్సింగ్‌లో అనేక ఘనతలు సాధించింది. అంతర్జా తీయ వేదికల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన మేరీకోమ్ ఎన్నో మరపురాని విజయాలు సాధించింది. 2012లో ఒలింపిక్స్ కాంస్య పతక విజేతగా నిలిచింది. మహిళా బాక్సర్లలో ఇంకెవరికీ సాధ్యం కాని రీతిలో ఏకంగా ఆరుసార్లు వరల్డ్ ఛాంపియన్‌గా నిలిచింది. 2016 నుంచి 2022 మధ్య రాజ్యసభకు కూడా మేరీకోమ్ ప్రాతినిధ్యం వహించింది. అయితే 41ఏళ్ల మేరీకోమ్ ప్రస్తుతం బిగ్ ఈవెంట్‌లలో ఆడకున్నా, రిటైర్మెంట్ తీసుకున్నట్లు మాత్రం ఎక్కడా ప్రకటించ లేదు. దేశం తరఫున ఇంకా పతకాలు సాధించాలనే ఆకలి ఉన్నట్లు గతంలో ఓ సందర్భంలో పేర్కొంది.

# నన్ను ఓ ఉగ్రవాదిలా చూశారు..: టీమిండియా మాజీ పేసర్ శ్రీశాంత్



టీమిండియా మాజీ పేసర్, వరల్డ్ కప్ విన్నర్ శ్రీశాంత్ తన జీవితంలో ఎదుర్కొన్న అత్యంత కఠినమైన కాలాన్ని గుర్తు చేసుకున్నాడు. 2013 ఐపీఎల్ స్పాట్ ఫిక్సింగ్ ఉదంతంతో తనను ఓ ఉగ్రవాదిలా చూశారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఐపీఎల్ 2013 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన శ్రీశాంత్.. స్పాట్ ఫిక్సింగ్ ఆరోపణలతో అరెస్ట్ అయిన సంగతి తెలిసిందే. జట్టులోని అజిత్ చండిలా, అంకిత్ చవాన్‌లతో కలిసి శ్రీశాంత్ స్పాట్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడని పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు.బీసీసీఐ కూడా అతనిపై నిషేధం విధించింది. దాంతో శ్రీశాంత్ కెరీర్ అర్థాంతరంగా ముగిసిపోయింది. సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత కోర్టు శ్రీశాంత్‌ను నిర్దోషిగా ప్రకటించింది. కోర్టు క్లీన్ చిట్ ఇచ్చినప్పటికీ, బీసీసీఐ అతనిపై విధించిన జీవితకాల నిషేధాన్ని ఏడేళ్లకు తగ్గించింది. నిషేధం ముగిసిన తర్వాత శ్రీశాంత్ దేశవాళీ క్రికెట్‌లోకి రీఎంట్రీ ఇచ్చినా మునపటిలా సత్తా చాటలేకపోయాడు. దాంతో క్రికెట్‌కు వీడ్కోలు పలికి కామెంటేటర్‌గా, విశ్లేషకుడిగా, సినీ నటుడిగా తన రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తున్నాడు.తాజాగా తన సతీమణి భువనేశ్వరి కుమారితో కలిసి ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రీశాంత్... స్పాట్ ఫిక్సింగ్ ఉదంతాన్ని గుర్తు చేసుకొని భావోద్వేగానికి గురయ్యాడు. 'నా జీవితంలోనే స్పాట్ ఫిక్సింగ్ ఉదంతాన్ని మరిచిపోలేను. నా వివాహ ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే అరెస్ట్ కావడం అతిపెద్ద విషాదం. 2012లో నాకు ఆరు సర్జరీలు జరిగాయి, నేను వీల్ చైర్‌కే పరిమితమయ్యాను. అదే సమయంలో నాపై ఉగ్రవాది అనే ముద్ర వేశారు. నా మామగారి దగ్గరకు వెళ్లి.. 'నేను మళ్ళీ క్రికెట్ ఆడలేకపోవచ్చు, పైగా నాపై ఇలాంటి ఆరోపణలు ఉన్నాయి' అని చెప్పాను.'అని శ్రీశాంత్ గుర్తు చేసుకున్నాడు. శ్రీశాంత్‌పై వచ్చిన ఆరోపణలను తాను నమ్మలేదని అతని సతీమణి భువనేశ్వరి వివరించింది.'శ్రీశాంత్ అరెస్ట్ వార్త ఒక షాక్ లాంటిది. నా స్నేహితులు ఫోన్ చేసి టీవీ చూడమని చెప్పే వరకు నాకు ఈ విషయం తెలియదు. టీవీలో 'శ్రీశాంత్ అరెస్ట్' అనే వార్త చూసి నేను షాక్‌కు గురయ్యాను. వెంటనే మా నాన్న దగ్గరకు వెళ్లి ముందు నాకు ఒక మాట ఇవ్వండి.. నా పెళ్లి ఆపకూడదని కోరాను. స్వయంగా ఆ దేవుడే వచ్చి శ్రీశాంత్ తప్పు చేశాడని చెప్పినా నేను నమ్మను.'అని తన తండ్రితో గట్టిగా చెప్పినట్లు భువనేశ్వరి గుర్తు చేసుకున్నారు.

# అభిషేక్ శర్మ అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకరిగా నిలుస్తారు

● **ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ జోస్యం**



2026 ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్‌లో భారత ఓపెనర్ అభిషేక్ శర్మ అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకరిగా నిలుస్తారని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ జోస్యం చెప్పారు. ఈ ఎడమచేతి వాటం బ్యాటర్ టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలవడమే కాకుండా, 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డును కూడా గెలుచుకోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఐసీసీ ఈవెంట్లలో పెద్దగా అనుభవం లేకపోవడం అభిషేక్‌కు ఒక రకంగా కలిసొస్తుందని పాంటింగ్ విశ్లేషించారు. 25 ఏళ్ల అభిషేక్ శర్మ ఫిబ్రవరి 7న ప్రారంభం కానున్న ఈ మెగా టోర్నీ ద్వారా తన టీ20 ప్రపంచకప్ అరంగేట్రం చేయబోతున్నాడు. "అతడొక స్టార్," అని ఐసీసీ రివ్యూ తాజా ఎడిషన్‌లో పాంటింగ్ పేర్కొన్నారు. "నిజం చెప్పాలంటే, అనుభవం లేకపోవడం అనేది అతనికి సానుకూల అంశం. అతను అత్యధిక పరుగులు చేయడమే కాకుండా, ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అయ్యే అవకాశం కూడా ఉంది" అంటూ పాంటింగ్ చెప్పుకొచ్చాడు. "అతను అంతటి ప్రతిభావంతుడని నేను నమ్ముతున్నాను. ఒకవేళ అతను రాణిస్తే భారత్‌ను ఓడించడం ఎవరికైనా కష్టమవుతుంది. అతను విఫలమైతే, భారత్ కూడా మిగతా జట్లలాగే ఒత్తిడికి లోనవుతుంది. అందుకే ఈ ప్రపంచకప్‌లో భారత్ తరఫున అతను చాలా కీలకమైన ఆటగాడని నేను అనుకుంటున్నాను" అంటూ పొగడ్తల వర్షం కురిపించాడు. ఐపీఎల్ ప్రారంభ రోజుల్లో అభిషేక్ శర్మతో కలిసి పనిచేసిన అనుభవంతో, గ్లోబల్ స్టేజ్‌పై అతను ఒత్తిడికి గురికాడని పాంటింగ్ ధీమా వ్యక్తం చేశారు. "నేనే అతని మొదటి ఐపీఎల్ కోచ్‌ని," అని ఢిల్లీ క్యాపిటల్స్‌లో తన అనుభవాన్ని పాంటింగ్ గుర్తు చేసుకున్నారు. "నా హయాంలోనే అతను 17 ఏళ్ల వయసులో ఢిల్లీ తరఫున అరంగేట్రం చేశాడు. మొదటి బంతినే బౌలర్ తల పైనుంచి క్లాసికల్ షాట్‌తో ఫోర్ లేదా సిక్స్ కొట్టి తన ప్రత్యేకతను చాటుకున్నాడు.

# ఇండియా-ఎ జట్టును ప్రకటించిన బీసీసీఐ

టీ20 వరల్డ్ కప్ 2026 సమరానికి కౌంట్‌డౌన్ మొదలైంది. ఈ మెగా టోర్నీకి ముందు టీమిండియా సన్నాహకాల్లో భాగంగా రెండు వార్మప్ మ్యాచ్‌లు ఆడనుంది. దీని కోసం బీసీసీఐ సోమవారం (ఫిబ్రవరి 2) ఇండియా-ఎ జట్టును ప్రకటించింది. యువ సంచలనం తిలక్ వర్మ రీ-ఎంట్రీ ఇవ్వడం, ఐపీఎల్ స్పీడ్ స్టార్ మయాంక్ యాదవ్ జట్టులోకి రావడం ఈ స్క్వాడ్‌లో హైలైట్‌గా నిలిచింది. ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ 2026 మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో టీమిండియా తన సన్నాహకాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా అమెరికా, నమీబియాతో రెండు వార్మప్ మ్యాచ్‌లు ఆడనుంది. ఈ మ్యాచ్‌ల కోసం సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతినిస్తూ, యువ రక్తాన్ని పరీక్షించాలని బీసీసీఐ నిర్ణయించింది. ఢిల్లీకి చెందిన యువ బ్యాటర్ ఆయుష్ బదోనికి జట్టు పగ్గాలను అప్పగించింది. దేశవాళీ క్రికెట్‌లో, ఐపీఎల్‌లో అద్భుతంగా రాణిస్తున్న బదోనికి ఇది ఒక పెద్ద అవకాశం. తెలుగు క్రికెట్ అభిమానులకు గుడ్ న్యూస్ ఏంటంటే.. గాయం కారణంగా కొన్నాళ్లు దూరమైన తిలక్ వర్మ జట్టులోకి తిరిగొచ్చాడు. సర్జరీ తర్వాత కోలుకున్న తిలక్, ఫిట్‌నెస్ టెస్ట్ పాసై జట్టులో చేరాడు. అయితే ఇందులో ఒక చిన్న ట్విస్ట్ ఉంది. తిలక్ వర్మ ఇండియా-ఎ తరఫున కేవలం ఒకే ఒక్క వార్మప్ మ్యాచ్ ఆడతాడు. ఆ మ్యాచ్‌లో తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకున్న తర్వాత నేరుగా టీమిండియా(సీనియర్ జట్టు)లో చేరి వరల్డ్ కప్ ఆడతాడు. ఇది తిలక్ కెరీర్‌కు అత్యంత కీలకమైన సమయం. ఐపీఎల్‌లో 150 కిలోమీటర్లకు పైగా వేగంతో బంతులు విసిరి అందరినీ ఆశ్చర్యపరిచిన మయాంక్ యాదవ్ కూడా ఈ జట్టులో ఉన్నాడు. ఐపీఎల్ 2025లో ఆడిన తర్వాత గాయపడిన మయాంక్, సుదీర్ఘ విరామం తర్వాత బరిలోకి దిగుతున్నాడు. అతని వేగం టీమిండియాకు రాబోయే రోజుల్లో పెద్ద ఆస్తి కానుంది. మయాంక్ తో పాటు ఖలీల్ అహ్మద్, రవి బిష్ణోయ్ వంటి సీనియర్ బౌలర్లు కూడా ఈ జట్టులో ఉండటం విశేషం. ఇక రెండో మ్యాచ్ ఫిబ్రవరి 6 (శుక్రవారం) నమీబియాతో జరుగుతుంది. ఈ మ్యాచుల ద్వారా యువ ఆటగాళ్ల ఫామ్‌ను పరిశీలించి, అవసరమైతే మెయిన్ వరల్డ్ కప్ స్క్వాడ్‌లోకి ఎవరినైనా తీసుకునే అవకాశం ఉంది. రియాన్ పరాగ్, నమన్ ధీర్, ఆశుతోష్ శర్మ వంటి హిట్టర్లు ఈ జట్టులో ఉండటంతో మ్యాచ్‌లు రసవత్తరంగా సాగే అవకాశం ఉంది.

ఇండియా-ఎ స్క్వాడ్ (వార్మప్ మ్యాచుల కోసం): ఆయుష్ బదోని (కెప్టెన్), నమన్ ధీర్, ఆశుతోష్ శర్మ, ప్రియాంశ్ ఆర్య, ఎన్.జగదీశన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ, రియాన్ పరాగ్, మానవ్ సుతార్, అశోక్ శర్మ, ఉర్విల్ పటేల్ (వికెట్ కీపర్), గుర్జాప్నీత్ సింగ్, విప్రజ్ నిగమ్, రవి బిష్ణోయ్, ఖలీల్ అహ్మద్, మయాంక్ యాదవ్.

మంగళవారం, ఫిబ్రవరి 03, 2026 | హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక | 12





# జైలర్-2లో షారూఖ్ ఖాన్

తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ కాంపౌండ్ నుంచి రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ క్రేజీ సీక్వెల్ జైలర్ 2. తలైవా టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ఈ చిత్రానికి కోలీవుడ్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. సీక్వెల్‌లో శివరాజ్‌కుమార్, మోహన్ లాల్ పాత్రలు రిపీట్ కానున్నాయని ఇప్పటికే వార్తలు వచ్చాయి. మరోవైపు తాజాగా బాలీవుడ్ బాద్ షా షారుక్ ఖాన్ ఇందులో కీలక పాత్రలో నటిస్తున్నాడని అప్‌డేట్ కూడా వచ్చింది. కాగా దీనిపై అఫీషియల్ న్యూస్ అభిమానుల్లో జోష్ నింపుతోంది. జైలర్ 2 నెక్ట్స్ షెడ్యూల్ ముంబైలో జరుగనుంది. తాజా సమాచారం ప్రకారం వచ్చే వారం షురూ కానున్న ఈ షెడ్యూల్‌లో షారుక్ ఖాన్ జాయిన్ అవ్వబోతున్నాడు. ఈ షెడ్యూల్‌లో షారుక్‌ఖాన్‌పై వచ్చే కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నట్టు ఇన్‌సైడ్ టాక్. మొత్తానికి నెల్సన్ దిలీప్ కుమార్ షారుక్ ఖాన్‌ను ఎలాంటి స్పెషల్ రోల్‌లో చూపించబోతున్నాడు.. తలైవా, షారుక్ ఖాన్ కాంబోలో సీన్లుంటాయా..? అన్నది తెలియాల్సి ఉంది. సిల్వర్ స్క్రీన్‌పై ఇద్దరు స్టార్ యాక్టర్లను చూసేందుకు ఎక్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్నారు మూవీ లవర్స్, అభిమానులు. జైలర్ 2ను 2026 జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నామని ఇప్పటికే రజినీకాంత్ క్లారిటీ కూడా ఇచ్చాడని తెలిసిందే. సీక్వెల్‌లో బాలీవుడ్ భామ విద్యాబాలన్‌తోపాటు కోలీవుడ యాక్టర్ సంతానం కీలక పాత్రల్లో నటిస్తున్నారని తెలుస్తుండగా.. మరి రాబోయే రోజుల్లో ఈ స్టార్ యాక్టర్లపై అఫీషియల్ అప్‌డేట్ ఏమైనా ఇస్తారేమో చూడాలి. జైలర్ ఫస్ట్ పార్టులో రమ్యకృష్ణ, వినాయకన్, వసంత్ రవి, మోహన్ లాల్, శివరాజ్ కుమార్, తమన్నా కీలక పాత్రల్లో నటించారని తెలిసిందే. సీక్వెల్‌లో ఎవరెవరుండబోతున్నారన్నదానిపై మేకర్స్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.


# అతడి ప్రవర్తన చూసి దూరం పెట్టాను

## మాజీ ప్రియుడి గురించి మృణాల్ కామెంట్స్



కొన్ని రోజులుగా ప్రేమ, పెళ్లి అంశాల్లో వరుసగా వార్తల్లో ఉంటున్నారు నటి మృణాల్ ఠాకూర్. తాజాగా ఆమె తన మాజీ ప్రేమికుడి గురించి చెప్పి మరోసారి నెట్టింట వైరల్‌గా మారారు. అతడితో బంధం ముగిసిపోయినందుకు తానేమీ బాధ పడలేదని తెలిపారు. ఆమె నటించిన తాజా చిత్రం 'దో దీవానే శహర్ మే' ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకురానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన మాజీ ప్రేమికుడి గురించి ప్రస్తావించారు. నాకు దూకుడు ఎక్కువని నాతో ఉండలేనని బ్రేకప్ చెప్పాడు. నేను యాక్టింగ్ చేయడం కూడా తనకు నచ్చలేదు. విడిపోవడానికి అది కూడా ఓ కారణం. బ్రేకప్ చెప్పినందుకు నేనేం బాధపడలేదు. తన మనస్తత్వం గురించి జాలి పడ్డాను. అలాంటి వాళ్లతో కొనసాగడం కూడా కష్టమే. అందుకే విడిపోయాం. అలాంటివాళ్లతో ఉంటే భవిష్యత్తులో పిల్లలు కూడా అదే భావనలతో పెరుగుతారు. అది నాకు ఇష్టం లేదని మృణాల్ తెలిపారు.కొన్ని నెలలుగా మృణాల్ డేటింగ్ వార్తలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. నటుడు ధనుష్ తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు ప్రచారం జరిగింది. ధనుష్ తనకు మంచి స్నేహితుడంటూ ఆ ప్రచారాన్ని మృణాల్ ఖండించారు. తర్వాత టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ తో ఆమె డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. వీటిపై స్పందిస్తూ.. 'ఇలాంటి రూమర్స్ వినడానికి కూడా హాస్యాస్పదంగా ఉంటాయి. వాళ్లు వార్తలు సృష్టిస్తుంటారు. వాటిని చూసి నేను నవ్వుకుంటాను. ఫ్రీ పీఆర్ స్టంట్స్ ఇవి' అంటూ వాటికి చెక్ పెట్టారు.

# ముసి ముసి నవ్వులతో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచిన ఫరియా అబ్దుల్లా!



ఏ హీరోయిన్ అయినా సరే ఒక మంచి పాత్ర దొరికితే ఆ పాత్రకు తగ్గ కంటెంట్ పడింది అంటే.. ఇక తమ టాలెంట్ తో రెచ్చిపోతారు అనడంలో సందేహం లేదు. ఇప్పటికే ఎంతోమంది అలా మంచి మంచి పాత్రలతో ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకొని ఇప్పుడు స్టార్ స్టేటస్ ను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. అందులో భాగంగానే ఒకప్పుడు తన గ్లామర్ తో అందాలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించిన చిట్టి అలియాస్ ఫరియా అబ్దుల్లాకు ఇప్పుడు సరైన క్యారెక్టర్ లభించింది అనే వార్తలు వినిపిస్తున్నాయి

జాతి రత్నాలు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈమె తన నటన కంటే కూడా తన హైట్ తోనే అందరి దృష్టిలో పడింది. ముఖ్యంగా ప్రభాస్, మహేష్ బాబు లాంటి హీరోలు అయితేనే ఈమెకు సెట్ అవుతారనే కామెంట్లు కూడా వ్యక్తమయ్యాయి. దీనికి తోడు ఇటీవల విశ్వక్ సేన్ కూడా సిజి ఇంకా డెవలప్ అయితే ఆమెతో సినిమా చేస్తానని చెప్పి అందరిని ఆశ్చర్యపరిచారు. అలాంటి ఫరియా అబ్దుల్లా తనకంటూ ఒక ఇమేజ్ దక్కించుకోవడానికి ఎంతో ప్రయత్నం చేసింది. అయితే అందుకు తగ్గట్టుగా అవకాశాలైతే రాలేదు. ముఖ్యంగా కొన్ని సినిమాలలో స్పెషల్ సాంగ్స్ కూడా చేసి ఆకట్టుకుంది ఫరియా అబ్దుల్లా. కానీ ఎట్టకేలకు ఆమె కష్టాన్ని దర్శక నిర్మాతలు గమనించినట్టు ఉన్నారు. అందుకే ఆమెకు తిరువీర్ హీరోగా నటిస్తున్న భగవంతుడు సినిమాలో స్పెషల్ రోల్ ఇచ్చి ఆమె నటనను బయటకు తీసే ప్రయత్నం చేస్తున్నారని చెప్పాలి. ఇందులో తొలిసారి పల్లెటూరి అమ్మాయి పాత్రలో నటించడమే కాకుండా తన అద్భుతమైన నటనతో ప్రేక్షకులను మెప్పించబోతోంది అంటూ మేకర్స్ స్పష్టం చేశారు. ఎప్పుడు చిట్టిపొట్టి బట్టలతో గ్లామర్ టచ్ ఇస్తూ యువతను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్న చిట్టి.. ఈ సినిమాలో లంగా ఓణీతోనే కాదు తన నటనతో కూడా మెప్పిస్తానని చెబుతోంది మరి భగవంతుడు సినిమా చిట్టికి ఎలాంటి సక్సెస్ అందిస్తుందో చూడాలి.

# కొత్త తారలతో మ్యాడ్-3 చిత్రీకరణ




టాలీవుడ్‌లో యూత్‌ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్‌లుగా భారీ విజయాలను అందుకున్న 'మ్యాడ్', 'మ్యాడ్ 2' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్లుగా నిలిచిన విషయం తెలిసిందే. దర్శకుడు కళ్యాణ్ శంకర్ తెరకెక్కించిన ఈ రెండు చిత్రాలు యువతను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఫన్, ఫ్రెండ్‌షిప్, కాలేజ్ బ్యాక్‌డ్రాప్‌తో సాగిన ఈ సిరీస్‌కు ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఏర్పడింది. నార్నె నవీన్, రామ్ నితిన్, సంగీత్ శోభన్ హీరోలుగా నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఈ సక్సెస్‌ఫుల్ ఫ్రాంచైజీకి కొనసాగింపుగా 'మ్యాడ్ 3' ను తెరపైకి తీసుకురావడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించిన నిర్మాతలు, ఈసారి కొత్త కాన్సెప్ట్‌తో పాటు కొత్త కాస్టింగ్‌ను కూడా పరిచయం చేయాలని భావిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. గత చిత్రాల్లో కనిపించిన హీరోల స్థానంలో ఈసారి కొత్త యువ నటులను తీసుకొస్తున్నట్లు సమాచారం. ఈ కొత్త కాస్టింగ్‌లో భాగంగా 'లిటిల్ హార్ట్స్' ఫేమ్ జేయ్ కృష్ణ, 'కోర్ట్' ఫేమ్ హర్ష్ రోషన్ పేర్లు వినిపిస్తున్నాయి. యంగ్ టాలెంట్‌ను ప్రోత్సహిస్తూ ఫ్రెష్ ఫేస్‌లతో ఈ చిత్రాన్ని రూపొందించాలన్న ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో సినిమాకు 'మ్యాడ్ జూనియర్స్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు ఫిల్మ్‌నగర్‌లో ప్రచారం జరుగుతోంది. టైటిల్ ద్వారా కూడా ఈ చిత్రం కొత్త తరం యువత కథగా ఉండబోతుందనే సంకేతాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ మూవీ షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైనట్లు సమాచారం. త్వరలోనే ఫస్ట్ లుక్, టీజర్ వంటి అప్డేట్స్ విడుదల చేసే అవకాశముంది. హాస్యం, ఫ్రెండ్‌షిప్, కాలేజ్ లైఫ్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రం రూపొందనుందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# 'పాంచాలి పంచభర్తృక' సినిమా టీజర్ ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి

సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్రలో నటిస్తున్న "పాంచాలి పంచభర్తృక" సినిమా టీజర్‌ను తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆవిష్కరించారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ, హాస్యం ఒక మంచి ఔషధం లాంటిదని, అపహాస్యం కాకుండా ఆరోగ్యకరమైన హాస్యంతో ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేయడాన్ని అభినందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ సినీ పరిశ్రమ అభివృద్ధికి, సినిమా కార్మికుల సంక్షేమానికి అండగా




ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. చిత్ర నిర్మాణ బృందానికి మంత్రి తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఈ చిత్రానికి గంగ సప్తశిఖర రచన మరియు దర్శకత్వం వహిస్తున్నారు. వెంకట దుగ్గిరెడ్డి (యూఎస్ఏ) నిర్మాతగా, శ్రీకాంత్ సెట్టివారి, సాయినాథ్ మన్యం సహ నిర్మాతలుగా... రాయల్ త్రోన్ ప్రొడక్షన్స్, ఓం సాయి రామ్ ఆర్ట్స్ బ్యానర్లపై తెరకెక్కుతోంది.

ఈ చిత్రంలో రాజేంద్రప్రసాద్‌తో పాటు రోల్ రైడా, జెమినీ సురేష్, పృథ్వీరాజ్, శ్రీకాంత్ అయ్యంగార్, సరీహ్ ఫర్, రూపలక్ష్మి, రాజ్ పవన్, రవి రెడ్డి, జబర్దస్త్ నవీన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. బాబీ కేఎస్ఆర్ కథ అందించగా, రాజ్ పవన్ స్క్రీన్‌ప్లే సమకూర్చారు. మహేశ్ నారాయణ, బిషేక్ సంగీతం అందిస్తుండగా, కెవి ప్రసాద్ సినిమాటోగ్రాఫర్‌గా, జానీ బాషా ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు.

# ఓటిటిలో ట్రెండ్ అవుతున్న శంబాలా



ఆది సాయికుమార్ నటించిన మిస్టిల్ థ్రిల్లర్ మూవీ 'శంబాల'. గతేడాది చివర్లో విడుదలైన ఈ సినిమా జనవరి 22న ఆహా వేదికగా ఓటీటీలోకి అందుబాటులోకి వచ్చింది. తాజాగా ఈ చిత్రం ఓటీటీలో రికార్డు సృష్టించింది. 10 రోజుల్లో 100 మిలియన్ స్ట్రీమింగ్ మినిట్స్ దాటి అత్యధికంగా వీక్షించిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ.. ప్రేక్షకులకు చిత్రబృందం కృతజ్ఞతలు తెలిపింది. యుగంధర్ ముని దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అర్చన అయ్యర్ హీరోయిన్. కథేంటంటే..: 1980వ దశకం నేపథ్యంలో సాగే కథ ఇది. వెయ్యేళ్ల చరిత్ర ఉన్న ఓ ఊరు శంబాల. అక్కడ ఆకాశం నుంచి ఓ ఉల్క పడుతుంది. అప్పటినుంచి ఊరిలో అనూహ్యమైన సంఘటనలు జరగడం మొదలవుతాయి. ఉన్నట్టుండి ఎవరో ఒకరు విచిత్రంగా ప్రవర్తిస్తూ హత్యలు చేస్తారు, ఆత్మహత్యలకు పాల్పడతారు. దాంతో బండ భూతం ఆవహించిందంటూ ఊరి జనం భయంతో వణికిపోతుంటారు. మూఢ నమ్మకాలు రాజ్యమేలుతాయి. ఆ రహస్యాలను ఛేదించేందుకు ప్రభుత్వం విక్రమ్ (ఆది సాయి కుమార్) అనే యువ శాస్త్రవేత్తని ఆ గ్రామానికి పంపిస్తుంది. సైన్స్‌నే నమ్ముకుని విధులు నిర్వర్తించే విక్రమ్ ఆ ఊళ్లో జరుగుతున్న సంఘటనల వెనక రహస్యాల్ని ఛేదించాడా? ఆ ఊరిలో కనిపించిన దేవి (అర్చన అయ్యర్) ఎవరు? విక్రమ్ నమ్ముకున్న సైన్స్‌కీ, ఊరి చరిత్ర వెనకున్న శాస్త్రానికి మధ్య సంఘర్షణ ఎలా సాగిందన్నది మిగతా కథ.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com